www.andhrajyothy.com
viziayanagaram

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

విజయనగరం
16

గురువారం 24 ఆగస్టు 2017





- జిల్లాలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు త్వరలో శ్రీకారం
- మొదటి దశగా కొన్ని గ్రామాల్లో అమలు
- రూ.20.70 కోట్లతో 82 కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్మాణం
- ఎస్.కోటకు అత్యధిక నిధులు

ఇక అండర్ డ్రైనేజీ



ఇలాంటి దుస్థితికి ఇక చెక్

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పల్లెలను మురుగు చీడ వదలబోతోంది. అస్తవ్యస్త కాలువలు, పొంగిపొర్లే మురుగునీటితో కూడిన అధ్వాన పరిస్థితుల నుంచి జనం బయట పడనున్నారు. భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ లేక... ప్రస్తుతం అనేకచోట్ల రహదారులు, ఇళ్ల సమీపంలో మురుగు నీరు నిల్వ ఉంటూ రోగాలను తెచ్చిపెడుతోంది. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణం. పంచాయతీలకు ఏటా ఎన్ని నిధులు విడుదలైనా మురుగు కాలువల నిర్వహణ, వాటి అధోగతిలో ఏమాత్రం మార్పు ఉండడం లేదు. ఈ నేపథ్యంలో తీవ్ర సమస్యాత్మక - మిగతా 14లో

125 వసంతాల కన్యాశుల్కం



మూడు రోజులు జాతీయ ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వ నిర్ణయం

(కలెక్టరేట్)

గురుజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కానికి 125 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం ఈ నెల 26 నుంచి 28 వరకు జాతీయ ఉత్సవాలు నిర్వహించడానికి నిర్ణయం తీసుకుందని కలెక్టరు వివేక్ యాదవ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కన్యాశుల్కంతో జిల్లాకు - మిగతా 14లో

పనులు త్వరగా పూర్తి చేయండి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశం 16లో

పసిపాపపై అకృత్యం

గంట్యాడలో దారుణం

అభం శుభం ఎరుగని మరో చిన్నారి కామాంధుడి దాష్టీకానికి బలైంది. కన్నబిడ్డ లాంటి పసిపాపపై ఓ దుర్మార్గుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దారుణాన్ని బయట పెడితే చంపేస్తానని బెదిరించాడు. అమాయకులైన బాధితురాలి తల్లిదండ్రులనూ మభ్యపెట్టాలని చూశాడు. వారి బంధువుల చొరవతో ఈ ఘోరం బయటకుపొక్కింది. గంట్యాడ మండలం కొత్తవెలగాడలో ఈ సంఘటన చోటుచేసుకుంది.

(గంట్యాడ)

14లో



జడ్పీ సీఈఓగా వెంకటేశ్వరరావు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)



జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి (జడ్పీ సీఈఓ)గా టి.వెంకటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో డీపీవోగా ఉన్న ఈయన ప్రస్తుతం ఎక్స్‌టెన్షన్ సెంటర్ గెజిటెడ్ ఇన్‌స్పెక్టర్‌గా అక్కడ పనిచేస్తున్నారు. విజయనగరం జిల్లా జడ్పీ సీఈఓగా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇదివరకు జడ్పీ సీఈవోగా పనిచేసిన గనియారాజకు మారికి బదిలీ అయిన తరువాత మూడు నెలలుగా ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం ఇన్‌చార్జి సీఈవోగా భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత కొనసాగుతున్నారు.

ఫేకర్ పరిశ్రమ



ఉద్యోగపర్వం

ఫేఫేకర్..

● కార్మికులకు అనుకూలంగా కోర్టు తీర్పు ● అమలు చేయని ఫేకర్ యాజమాన్యం ● కాంట్రాక్టు పద్ధతికైతే ఓకే ● ప్రశ్నార్థకంగా మారిన లోడింగ్ కార్మికుల భవితవ్యం

(గరివిడి)

ఫేకర్ లోడింగ్, అన్‌లోడింగ్, లారీ లోడింగ్ కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కోర్టు వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చినా, వారిని విధుల్లోకి తీసుకునే పరిస్థితి కానరాక పోవడంతో గడ్డు పరిస్థితి ఎదురయ్యింది. మూడున్నర ఏళ్ళుగా 269 మంది కార్మికులు కార్మిక కుటుంబాలు దయనీయస్థితిలో మగ్గుతున్నాయి. పనిలేదు, చేతిలో చిల్లి గవ్వలేదు. దీంతో ఆయా కుటుంబాలు ఆకలి పెనవేసుకున్న బతుకులను వెళ్ళదీస్తున్నాయి. యాజమాన్యం కోర్టు తీర్పుకి అనుకూలంగా వ్యవహరించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా తీర్పునకు మెలికపెట్టి కార్మికులకు కర్మాగారంలోకి అనుమతినిచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. మానవీయ కోణంలో ఆలోచించైనా ఆ శ్రమజీవులను విధుల్లోకి తీసుకోవాల్సిన యాజమాన్యం కాంట్రాక్టు విధానం తప్ప మరో విధానం అయితే ససేమెరా అంటోంది. దీంతో ఆ కార్మికుల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. యాజమాన్యంతో పోరాడే శక్తి కార్మికులకు లేదు. అయినా వారు కోర్టు తీర్పునకు అనుకూలంగా వారిని విధుల్లోకి తీసుకోవాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా యాజమాన్యం వ్యవహరించడం శోచనీయం. 2014 ఫిబ్రవరి 4 నుంచి ఫేకర్ లోడింగ్ కార్మికులు 269 మంది రోడ్డున పడ్డారు. పాతవిధానం ద్వారా అయితే విధులకు హాజరవుతామని, కాంట్రాక్టర్ విధానం అయితే అంగీకరించే ప్రశ్నే లేదని కార్మికులు కోర్టుకు వెళ్ళారు. కాంట్రాక్టర్ విధానం అయితే విధులకు తీసుకుంటామని యాజమాన్యం చెబుతోంది. కోర్టు గతంలో కార్మికులకు విధుల్లోకి తీసుకోవాలని తీర్పు ఇచ్చినా యాజమాన్యం మాత్రం ఆ తీర్పును ఖాతరు చేయలేదు. కార్మికులు కోర్టు దిక్కరణ కేసు పెట్టారు. దీంతో ఫేకర్ యాజమాన్యం ఈ నెల 18 లోపు కార్మికులను విధుల్లోకి తీసుకుంటామని కోర్టు ముందు అంగీకరించింది. మళ్ళీ కాంట్రాక్టు విధానమే అయితేనే ఆ కార్మికులను విధుల్లోకి తీసుకుంటామని యాజమాన్యం పాత పాటనే పాడుతోంది. దీని వల్ల కార్మికులు నష్టపోతారనే ఆందోళన ఫేకర్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజాన రమణ చెబుతున్నారు. కోర్టు తీర్పునకు విరుద్ధంగా యాజమాన్య వ్యవహరిస్తుందన్న ఆవేదన కార్మిక నేతలకు మిగులుతోంది తప్పా, కార్మికులకు యాజమాన్యం ఉపాధి కల్పించే చొరవ చూపకపోవడం విచారకరం.

కార్మికుల సమస్యపై ఫేకర్ సీఈ ఎంఎస్ఎస్ శర్మ వద్ద ప్రస్తావించగా కార్మికులను కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లోకి తీసుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని తన దైన శైలిలో జవాబిచ్చారు.

తెలుపు రేషన్‌కార్డుకు అర్హులు వీరే..

మీకోసం

(కొమరాడ)

తెలుపు రేషన్‌కార్డుల మంజూరుకు ప్రభుత్వం నిబంధనలు సడలించింది. దీంతో జిల్లాలో అధిక శాతం కుటుంబాలు వీటిని పొందే అవకాశం ఏర్పడనుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కళాశాలల్లో ఫీజు రాయితీ, రాయితీ రుణాలు వంటి వాటికి తెలుపు రేషన్‌కార్డే దిక్కు. దీంతో అర్హులైన వారికి కార్డులు అందించేందుకు పాలకులు రంగం సిద్ధం చేశారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం జీవో నెంబరు 8 జారీతో పలు నిబంధనలు సడలించింది. కొత్త నిబంధనల అనుసరించి అర్హులను ఎంపిక చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమవుతోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 25 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. నిబంధనల సడలింపుతో వీరికి తెలుపు రేషన్‌కార్డులు మంజూరయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.


నిబంధనల సడలింపు ఇలా..

పట్టణ ప్రాంతాల్లో..

- 750 చదరపు అడుగుల విస్తీర్ణం మించని సొంత ఇల్లు ఉండవచ్చు.
- ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండరాదు.
- ఫోర్ వీలర్ ఉండరాదు. (ట్యాక్సీ యజమానులకు మినహాయింపు)

గ్రామీణ ప్రాంతాల్లో..

- అర్హులకు పది ఎకరాలకు మించి పొలం ఉండరాదు.
- కార్డు పొందాల్సిన కుటుంబంలో వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగంలో ఉండరాదు.
- కాంట్రాక్టు ఉద్యోగులకు మినహాయింపు.
- ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారు అనర్హులు.
- ఫోర్ వీల్ ఉండరాదు. (ట్యాక్సీ యజమానులకు మినహాయింపు)
- 200 యూనిట్‌ల విద్యుత్ వినియోగం దాటరాదు.



పసుపు బుట్టలతో తెగుళ్ల నివారణ

ఎంపీఈవో మౌనిక

కృషి

(వేపాడ)

మండలంలోని వీలుపర్తి గ్రామానికి చెందిన శానాపతి నిర్సిబాబు పొలంలో పసుపు పల్లాలు, రెక్క పురుగులు నివారణకు బుట్టలు ఏర్పాటు చేయడంపై అవగాహన కల్పించామని ఎంపీఈవో మౌనిక తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సాగులో భాగంగా రసం పీల్చు పురుగుల నివారణకు నీమాస్త్రం తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. చేనులో వేర్ల వృద్ధికి తోడ్పడే విధంగా ద్రవజీవామృతం తయారు చేయడం, వినియోగంపై కూడా వివరించామని చెప్పారు.



రసం పీల్చే పురుగుల నివారణకు పసుపు బుట్టలు ఏర్పాటు చేస్తున్న వ్యవసాయాధికారులు



ద్రవ జీవామృతం తయారు చేస్తున్న దృశ్యం

నీమాస్త్రం తయారీ..

200 లీటర్ల నీరు, పది కిలోల వేపాకులు, రెండు కిలోల ఆవు పేడ కలిపి మూడు రోజుల తర్వాత పిచికారీ చేసుకోవాలి. దీని వల్ల రసం పీల్చు పురుగులు, ఆకు తొలుచు పురుగులను నివారించవచ్చు. ఈ ద్రావణం ఆరు నెలలు వరకు నిల్వ ఉంటుంది.

పేడ, మూత్రం, ఇంగువ ద్రావణం తయారీ..

ఐదు కిలోల పేడ, ఐదు లీటర్ల గోమూత్రం, 15 గ్రాముల సున్నం, 200 గ్రాముల ఇంగువ కలిపి మూడు రోజుల మురగబెట్టి అనంతరం ఈ ద్రావణాన్ని వడకట్టి వరి పొలంలో పిచికారి చేసుకోవాలి. దీని వల్ల అగ్గి తెగులు, పొడ తెగులు నివారించ వచ్చు. దీని వినియోగం వల్ల ఏ విధమైన హాని ఉండదు.

వరి పొలంలో కాలి బాటలు..

పొలంలో కాలిబాటలు తీయడం వల్ల గాలి, వెలుతురు పంటకు పుష్కలంగా తగలడమే కాకుండా ఎరువులు వేసుకునేందుకు అనువుగా ఉంటుంది. అలాగే చేనులో సాంద్రత ఒకే విధంగా ఉండి పంట ఎదుగుదలకు అనువుగా ఉంటుంది.

ద్రవ జీవామృతం తయారీ విధానం..

200 లీటర్ల ద్రవజీవామృతం తయారు చేయడానికి 200లీటర్ల నీరు, పది కిలోల దేశవాలి ఆవుపేడ, లీటరు ఆవు మూత్రం, రెండు కిలోల పప్పుల పిండి, అరకిలో పుట్టమట్టి కలిపి మూడు రోజులు మురగబెట్టాలి. అనంతరం ఈ ద్రవణాన్ని వడకట్టి పొలంలో పిచికారీ చేసుకోవాలన్నారు. దీంతో చేనులో వేర్లు వృద్ధిచెంది చేను ఆశాజనకంగా పెరుగేందుకు దోహదపడుతుంది. దీని వాడకం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు.

ప్రాథమిక వైద్యం మెరుగుకే కమ్యూనిటీ పారా మెడికల్

(కొత్తవలస)

రాష్ట్రంలో ప్రాథమిక వైద్యాన్ని మెరుగుపర్చేందుకు కమ్యూనిటీ పారా మెడికల్ ట్రైనింగ్ ప్రొగ్రాంను ప్రారంభించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే జీవో నెంబరు 465ను మంగళవారం విడుదల చేసింది. ఈ ప్రొగ్రాం కింద శిక్షణ పొందిన వారు గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యం చేసేందుకు అనుమతి ఉంటుంది. అలాగే ఈ ప్రొగ్రం కింద రిజష్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్/ ప్రైవేటు మెడికల్ ప్రాక్టిషనర్‌లకు శిక్షణ ఇస్తారు. వీరిని కమ్యూనిటీ పారా మెడికల్‌గా వ్యవహరిస్తారు. ప్రభుత్వం ద్వారా శిక్షణ పొందిన వీరు మాత్రమే గ్రామాల్లో ఇకపై ప్రాథమిక వైద్యం చేయడానికి అనుమతి ఉంటుంది. శిక్షణ పొందిన వారికి ప్రభుత్వమే సర్టిఫికెట్‌ను అందచేస్తుంది. ఇందుకు సంబంధించి కుటుంబ, ఆరోగ్య సంక్షేమ కమిషనర్ చైర్మన్‌గా, కమిషనర్ ఏపీవీవీపీ, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఏపీ పారా మెడికల్ బోర్డు కార్యదర్శి మెంబర్లుగా వ్యవహరిస్తారు.



భారీ ఇసుక నిల్వలు స్వాధీనం


ఇసుకనిల్వలను పరిశీలిస్తున్న ఎస్ఐ వరప్రసాద్

లోగిశ (గజపతినగరం రూరల్): మండలంలోని లోగిశ గ్రామంలో బుధవారం దాడి చేసి భారీ స్థాయిలో ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.వరప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని ఆయన వివరించారు. ముందస్తు సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామని ఆయన తెలిపారు. పట్టుబడిన ఇసుక సుమారు 200 ట్రాక్టర్ల వరకు నిల్వలు ఉంటాయని అంచనా వేశారు. గ్రామంలో ఇటీవల ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని సూచించామన్నారు. గ్రామాధికారులు పట్టించుకోవడంలేదన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక తరలించడం నేరమని ఆయన హెచ్చరించారు. తహసీల్దర్‌కు కూడా ఇసుక నిల్వల స్వాధీనం చేసుకున్నట్లు సమాచారమందించామన్నారు. ఈదాడిలో గ్రామ రెవెన్యూ అధికారి తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాలను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● కాంప్లెక్స్ ఎదుట ఘటన ● డ్రైవర్ నిర్లక్ష్యం

విజయనగరం క్రైం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్ గేట్ వద్ద బుధవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో కారు, వ్యాన్‌ను ఢీకొట్టినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. ఏపీ 35 ఎక్స్ 18 నెంబరుగల బస్సు కాంప్లెక్సు నుంచి విశాఖకు అవుట్‌గేట్ నుంచి బయటకు వెళ్తోంది. ఈబస్సు ఎత్తుబ్రిడ్జి మీద నుంచి కాంప్లెక్సు వైపు వస్తున్న తొలుత కారును, తర్వాత వ్యాన్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదానికి గురైన కంటోన్మెంట్ సీపీ కాలనీకి చెందిన కారు యజమాని గాబు లక్ష్మి భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బస్సు బ్రేక్ ఫెయిల్‌పై ప్రమాదం జరిగినట్లు డ్రైవర్ చెబుతున్నాడు. ఈ ప్రమాదంతో ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు కేసు నమోదు చేశారు.


ప్రమాదానికి గురైన కారు

పేకాట శిబిరంపై దాడి

మెంటాడ: మండల కేంద్రంలో రహస్య ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం ఆండ్ర ఎస్ఐ భాస్కరరావు దాడి చేశారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు. వారినుంచి రూ. 1400 స్వాధీన పర్చుకున్నారు.

మానవత్వం చాటిన పోలీసులు

● వృద్ధుడిని వృద్ధాశ్రమానికి తరలింపు

కొత్తవలస: స్థానిక పోలీసులు మానవత్వాన్ని చాటారు. తమకు భారంగా ఉన్నారని అనాథగా వదిలేసిన వృద్ధుడిని పోలీసులు ఆదుకుని వృద్ధాశ్రమంలో చేర్పించారు. వివరాలివి.. వారం కిందట సుమారు 65 ఏళ్ల వయసున్న వృద్ధుడిని ఆటోలో తీసుకొచ్చి కొత్తవలస పంచాయతీ శివారు అడ్డపాలెం గ్రామ జంక్షన్‌లో వదిలేసి గుర్తుతెలియని వ్యక్తులు వెళ్లిపోయారు. అప్పటినుంచి ఆ వృద్ధుడు జంక్షన్‌లో ఉంటూ నీరసించిపోయాడు. బిచ్చగాడిగా భావించి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఆటోలో తీసుకువచ్చి వదిలేయడాన్ని ప్రత్యక్ష్యంగా చూసిన స్థానికులు కొందరు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో బుధవారం ఎస్ఐ కె.నీలకంఠం సిబ్బందితో వెళ్లి వృద్ధుడిని పరిశీలించారు. ఆయనకు సపర్యలు చేసి పండ్ల రసాలు ఇచ్చారు. తీవ్ర అనారోగ్యంగా ఉన్న వృదుడిని విశాఖలోని కేజీహెచ్‌కు తరలించి చికిత్స చేయించాలని భావించారు. అయితే, విశాఖ జిల్లా, పెందుర్తిలో ఉన్న లయోలా వృద్ధాశ్రమం ప్రతినిధులకు సమాచారమివ్వడంతో వారు వృద్ధుడి ని తమ ఆశ్రమంలో చేర్పించుకొవడానికి అంగీకరించారు. తామే చికిత్సలు చేయిస్తామని వారు తెలిపారు. వృద్ధుడి ప్రస్తుతం తన వివరాలు చెప్పలేక పోతున్నాడని ఎస్ఐ తెలిపారు.


వృద్ధునికి సపర్యలు చేస్తున్న ఎస్ఐ నీలకంఠం, సిబ్బంది

చోరీల కేసులో నిందితుడు అరెస్టు

● బంగారు ఆభరణాలు స్వాధీనం

విజయనగరం క్రైం: పట్టణంలోని టూటౌన్ పరిధిలో చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు టూటౌన్ ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపారు. గుర్ల మండలం చింతలపేటకు చెందిన యడ్ల రామచంద్రరావు దాసన్నపేట విద్యుత్ భవన్, కొత్తపేటల్లో గత మార్చి, ఏప్రిల్‌ల్లో దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. వీటిపై అప్పట్లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. బుధవారం కొత్తపేట నీళ్లట్యాంకు వద్ద అనుమానాస్పందగా సంచరిస్తున్న రామచంద్రరావును పట్టుకుని స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామని తెలిపారు. దీంతో దాసన్నపేట, కొత్తపేట ప్రాంతాల్లో ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఇతని వద్దనుంచి రెండున్నర తులాల హారం, ముప్పావుతులం చైన్, పావుతులం ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

విజయనగరం క్రైం: పట్టణంలోని కొత్తపేట సాలివీధికి చెందిన జల్లెపల్లి సుజాత అనే వివాహిత అదృశ్యంపై భర్త సంతోష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. బుధవారం టూటౌన్ పోలీసులు అందించిన వివరాలివి.. ఈనెల 7న సుజాత తన అత్తవారింటికి వెళ్తానని ఆటో ఎక్కిందని భర్త పేర్కొన్నారు. ఆమె అప్పటినుంచి కనిపించలేదన్నారు. వెతికినా ప్రయోజనంలేకపోయింది. దీంతో భర్త బుధవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుజాత వయస్సు 21ఏళ్లు, చామనఛాయ, ఎత్తు 4.5, బ్లూకలర్ పంజాబీ డ్రెస్ ధరించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిస్తే టూ టౌన్ పోలీసు స్టేషన్ ఫోన్: 08922 -226422 ,94407 95916, 94407 95923 సమాచారమందించాలని పోలీసులు కోరారు.


అదృశమైన సుజాత (ఫైల్)

ముఠా కార్మికుల సమ్మె విరమణ

కొత్తవలస: వారం రోజులుగా కొత్తవలసలో ముఠా కార్మికులు చేస్తున్న సమ్మెకు తెరపడింది. స్థానిక వర్తక సంఘంతో సీఐటీయూ నేతల ఆధ్వర్యంలో బుధవారం జరిగిన చర్చలు ఫలవంతంకావడంతో కార్మికులు సమ్మె విరమించి విధులలోకి చేరారు. ముఠా కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న పీసు రేట్లపై 25 శాతం పెంచడానికి వర్తక సంఘం అంగీకరించింది. 2016 నుంచి అమలు చేయాలన్న నిబంధనను మాత్రం ముఠాకార్మికులు విరమించుకున్నారు. చర్చల్లో వర్తక సంఘం తరపున ముర్యాౄరి వెంకట అప్పారావు (నాని), ముర్యాౄరి సన్యాశిరావు (తాత) ద్వారపూడి అర్జునరావు, సీఐటీయూ నేతలు డేగల అప్పలరాజు, గాడి అప్పారావు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినికి అభినందన

పార్వతీపురం టౌన్: శ్రీకృష్ణ పాఠశాల విద్యార్థిని భవిరిశెట్టి జ్యోతి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు కరస్పాండెంట్ పి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం పాఠశాలలో జ్యోతిని ఆయన అభినందించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా పాఠశాల నుంచి ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. జ్యోతి 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 10కి10 పాయింట్లు సాధించినట్లు చెప్పారు. 10వ తరగతి విద్యార్థులు జ్యోతిని ఆదర్శంగా తీసుకొని ఉత్తీర్ణత సాధించాలన్నారు.



జ్యోతిని అభినందిస్తున్న దృశ్యం

యాగాలతో లోకశాంతి

● బ్రహ్మశ్రీ వేమకోటి

పార్వతీపురం టౌన్: యాగాదులతో లోకశాంతి కలుగుతుందని బ్రహ్మశ్రీ వేమకోటి శివప్రసాద్‌శర్మ అన్నారు. బుధవారం దుర్గగుడి వీధిలో హోమ సహస్ర చండీ యా గంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా శివ ప్రసాద్‌శర్మను శ్రీసర్వమంగళాదేవి పీఠాధి పతి మురపాక కాళిదాసుశర్మ, యజ్ఞకర్త మలిచేటి రాజీవ్‌రెడ్డి, రుత్వికుల వేదమం త్రాల మధ్య స్వాగతం పలికారు. హోమ సహస్ర చండీయాగంలో అమ్మవారి అభిషే కాలు, చండీ సప్తసతీ పారాయణాలు, త్రిచ పూర్వక సూర్యనమస్కారాలు, మన్యు సూక్త, సుదర్శణ పారాయణాలు, శ్రీచక్రనవావర ణార్చనలో ఆయన పాల్గొన్నారు. సాయంత్రం కాళిదాసుశర్మ, రుత్విలకు వేదమంత్రాల మధ్య అమ్మవారికి చండీ హోమాలు, సహస్ర లింగార్చన శత రుద్రీయం, రుద్ర, సుదర్శన హోమాలు, నీ రాజమంత్ర పుష్పాలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు.



పూజ చేస్తున్న కాళిదాసుశర్మ, శివప్రసాద్‌శర్మ

వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించండి

● ఉత్సవ కమిటీలకు ఎస్ఐ సూచన

పార్వతీపురం టౌన్: వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ ఎం.రాజేష్ పట్టణ ప్రజలకు సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉత్సవాల అనుమతి కోసం వచ్చిన కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడారు. వినాయక ఉత్సవాలను ఎన్ని రోజులు నిర్వహిస్తున్నారు. ఏఏ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎక్కడ నిమజ్జనం చేస్తున్నారో పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు. ఉత్సవ మండపాల్లో వినాయక విగ్రహాల ప్రతిష్ట, నిమజ్జనం సమయంలో కమిటీ సభ్యులు మద్యం సేవించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించరాదన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు బాణసంచాను కాల్చరాదన్నారు. అంతే కాకుండా చిన్న పిల్లలను నిమజ్జనం వద్దకు తీసుకువెళ్లరాదని సూచించారు. ఉత్సవాల సమయంలో నిషేధిత సాంసృతిక కార్యక్రమాలను నిర్వహించరాదన్నారు. వినాయక ఉత్సవాలను సజావుగా సాగించే కమిటీలకు పోలీస్‌శాఖ తరుపున సహాయ సహకారాలను అందించడానికి హామీ ఇచ్చారు.



ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజేష్

మట్టి బొమ్మలనే పూజించండి

పార్వతీపురం టౌన్: మట్టి వినాయకుల్ని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఐ.గోపాలరావు, బి.అప్పలనరసయ్య సూచించారు. బుధవారం లయన్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయకుల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల సభ్యులు మట్టి విగ్రహాలకు పూజించాలని ప్రచారం చేయాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలతో శాస్త్రీయ పద్ధతిలో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. మట్టి వినాయకుడ్ని పూజించడం ఆచార, సాంప్రదాయాల ప్రకారం మంచిదే కాకుండా నిమజ్జన సమయంలో నీటిలో కరుగుతుందని, దీనివల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పీవీ మణికుమార్, మాజీ అధ్యక్షుడు ఐ.గుంపస్వామి, సైకాలజిస్టు పి.శ్రీహరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దొగ్గ మోహన్ పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ధైర్య సాహసాలు టంగుటూరి సొత్తు

● ఎమ్మెల్యే చిరంజీవులు

పార్వతీపురం టౌన్: ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్య సాహసాలను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా టంగుటూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళర్పించారు.

సైమన్ కమిషన్‌కి తన గుండెలపై కాల్చమని చూపించిన ధైర్యశాలి అన్నారు. అందుకే ప్రకాశం పంతుల్ని ఆంధ్రకేసరి బిరుదుతో సత్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దొగ్గ మోహన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కోలా వెంకటరావు, కౌన్సిలర్లు సీహెచ్ వెంకటరమణ, బి.బార్నాల సీతారాం, పార్వతీపురం, కొమరాడ మండలాల పీహెచ్‌సీల అధ్యక్షులు జి.రామ్మూర్తి, పి.శంకరరావు పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటం ముందు నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

అసౌకర్యాలతో ఆర్టీసీ కాంప్లెక్సు

పాచిపెంట: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సు అసౌకర్యాలతో ఉంది. ప్రయాణీకులు కూర్చొనేందుకు బెంచీలు లేవు. విద్యుత్ సరఫరా లేదు. ప్రయాణీకుల సౌకర్యార్థం కాంప్లెక్సు ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఆర్టీసీ కాంప్లెక్సు వినియోగంలో లేకపోవడం వలన శిథిలావస్థకు చేరుకుంది. కాంప్లెక్సు ఆవరణలో తుప్పలు పెరిగిపోవడం వలన విషసర్పాలు సంచరిస్తున్నాయి. ప్రహరీ లేకపోవడం బహిర్భూమిగా మార్చేశారు. బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణీకులు ముక్కు మూసుకోవాల్సిందే. ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

పార్వతీపురం టౌన్: పట్టణంలోని కొత్తవలస శివారులో సారా రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకన్నట్టు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ ఏఎస్ దొర బు . దవారం తెలిపారు. కొత్తవలస శివారులో రూట్‌బీట్ చేస్తుండగా కొత్తవలసకు చెందిన మెండంగి రవి మోటార్ బైక్‌పై 40 లీటర్ల సారా రబ్బరు ట్యూబులో రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుబడ్డ వ్యక్తి తెస్తున్న సారాని కొత్తవలసలోని రాగోలు శంకరరావుకు అందజేయనున్నట్టు విచారణలో తేలిందన్నారు. ఇదిలాఉండగా కొమరాడ మండలం కళ్లికోటకి చెందిన పట్నాన వినోద్ గొలుసు దుకాణంపై దాడి చేసిన 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకు న్నట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో హెచ్‌సీలు బాలకృష్ణ, ప్రతాప్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారన్నారు.



పట్టబడ్డ నిందితుడితో ఎక్సైజ్ సిబ్బంది

వాడుకున్న వారికి.. వాడుకున్నంత

● మున్సిపాల్టీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆక్రమణలు

పార్వతీపురం టౌన్: మున్సిపాల్టీకి చెందిన స్థలాలను కొంతమంది దర్జాగా కబ్జా చేసి వాడుకుంటున్నారు. మున్సిపాల్టీ షాపింగ్ కాంప్లెక్స్‌ను ఇష్టం వచ్చినట్టు వ్యాపారులు వాడుకుంటున్నారు. ఇష్టానుసారం భవనాల నిర్మించి మున్సిపాల్టీ ఆదాయానికి గండి కొడుతున్నారు. మరి కొంతమంది వ్యాపారులు సాక్షత్తు ప్రజాప్రతినిధులు ఆవిష్కరించిన శిలాఫలకాలను కూడా వాడుకుంటున్నా మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారు. పట్టణంలోని 27వ వార్డు ప్రధాన రహదారి నుంచి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే ప్రారంభంలో నెల రోజుల క్రితం రహదారి నిర్మాణానికి వేసిన శిలాఫలకానికి మరో పక్క మందుల షాపు యజమాని చక్కగా వాడుకుంటున్నారు. ఈ విషయం అటువైపు వెళ్లే ప్రజాప్రతి నిధులకు గాని, మున్సిపల్ అధికారులకు గాని పట్టకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఇటువంటి ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



శిలాఫలకంపై మందుల షాపు బ్యానర్

మండుతున్న ఎండలు

పార్వతీపురం టౌన్: పట్టణ ప్రజలను రెండు రోజులగా ఎండలు కాగబెడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి తీవ్రమైన ఎండ వేడి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల నుంచి వచ్చే ప్రజలు, వ్యాపారులు, విద్యార్థులు ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలాన్ని తలపించే విధంగా సాయంత్రం 5 గంటల వరకు భానుడు భగ భగలతో రహదా రిపైకి రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. ప్రధాన రహదా రులు మధ్యాహ్నం 12 గంటల నుంచి నిర్మానుష్యంగా మారు తున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఎండలతో పాటు ఉక్క పోతతో ఇబ్బందులు పడుతున్నారు.



మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

గ్యాస్ సమాచారం

పార్వతీపురం పెంటపాటి కామరాజు గ్యాస్ ఏజెన్సీ పరిధిలో బుధవారం వరకు బుక్ చేసుకున్న కొమరాడ మండలం, గుమ్మలక్ష్మీపురం మండలం, పార్వతీపురం మండలం బాలగొడబ, పట్టణ వినియోగదారులకు గురువారం గ్యాస్ సరఫరా అవుతుంది. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేయదలచిన వారు 9666023456 నెంర్‌కు ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలి. ఫిర్యాదులు, సలహాల కోసం గ్యాస్ ఏజెన్సీ ల్యాండ్‌లైన్ 08963- 221425, 221345 నెంబర్లను సంప్రదించాలి.

సినిమా గైడ్

వెంకటేశ్వర కళామందిర్ ------- ఫిదా
పద్మశ్రీ -------- జయ జానకీ నాయక
సౌందర్య ------ నేనే రాజు నేనే మంత్రి

ఏటీవోకు ఘన సన్మానం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఏటీవో నాయుడు జగన్నాథంను జేపీసీ నాయకులు జీవీఆర్ఎస్ కిశోర్ ఆధ్వర్యంలో బుధవారం ఏటీవో కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జేపీసీ నాయకులు కిశోర్ మాట్లాడుతూ ఉత్తమ అధికారిగా ఐటీడీఏ పీవో చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకోవడం సంతోషదాయకమన్నారు. మరిన్ని అవార్డులను అందుకోవాలని ఆకాంక్షించారు. ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం అందుకున్న పెంకి పద్మను కిశోర్‌తో పాటు సంఘ నాయకులు, సభ్యులు సన్మానించారు.



జగన్నాథంను సన్మానిస్తున్న జేపీసీ నాయకులు

నిరుపయోగంగా రక్షితనీటి ట్యాంకు

బలిజిపేట: సురక్షితమైన నీరు అందించేందుకు వేలాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వం మంజూరు చేసిన నీటి ట్యాంకు మూలకు చేరింది. పాఠశాలలో వేలాది రూపాయలు ఖర్చు చేసి మంచినీటి ట్యాంకు మంజూరు చేస్తే నేటికి వినియోగంలోకి తేకపోవడం విశేషం. పలితంగా విద్యార్థు లు బోరు నీటిని, కలుషిత నీటిని వాడే పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పం దించి నిరుపయో గంగా ఉన్న నీటి ట్యాంకు వినియోగం లోకి తేవాలని విద్యా ర్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మూలకు చేరిన మంచినీటి ట్యాంకు


మృతి చెందిన గొర్రెలు

కుక్కల దాడిలో 14 గొర్రెల మృతి

తాళ్లబురిడి (పార్వతీపురం): తాళ్లబురిడిలో బొబ్బిలి శ్రీనుకు చెందిన గొర్రెలపై కుక్కలు దాడి చేయడంతో 14 గొర్రెలు మృతి చెందాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఈ సంఘటన చోటుచేసుకుంది. గొర్రెల యజమానిని ఆర్థికంగా ఆదుకోవాలని సర్పంచ్ జయలక్ష్మి అధికా రులను కోరారు. ఈ సంఘటన ఉన్నతాధికారులకు సమాచారం అందించి నట్టు పశు వైద్యాధికారి రమేష్ చెప్పారు.

మట్టి వినాయకులతో ప్రదర్శన

పార్వతీపురం/టౌన్: మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని పట్టణంలోని మార్క్స్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. బుధవారం పాఠశాల ఆవరణలో మట్టి వినాయకులను ప్రదర్శనకు ఉంచారు. రకరకాల ఆకులతో, కేక్ రూపంలో, బొప్పాయి, సుద్ధ ముక్కలతో తయారు చేసిన వినాయకుల ప్రతిమలను విద్యార్థులు తయారు చేశారు. ఈ ప్రతిమలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వి.సంధ్య మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణ పరిరక్షణకు సహకరించినట్టేనన్నారు.


వినాయక ప్రతిమలతో చిన్నారులు

'భోజనం'లో పరిశుభ్రత తప్పనిసరి

కురుపాం: మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో ఎన్.సత్యనారాయణ భోజన నిర్వాహకులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల బుధవారం సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పారిశుధ్యం లేకపోవడాన్ని చూసి నిర్వాహకులపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.జయరాజు పాల్గొన్నారు.


భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంఈవో

వేతన బకాయిలు తక్షణమే చెల్లించండి

పాచిపెంట: అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన నిర్వాహకుల వేతన బకాయిలు తక్షణమేచెల్లించాలని సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు టి.ప్రభావతి డిమాండ్‌చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె పాచిపెంటలో మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు గత మూడు నెలలగా వేతన బకాయిలున్నాయన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఆరు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. తక్షణమే బకాయిలు చెల్లించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పదవీ విరమణకు సంబందించిన రాయితీలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు జి.కల్యాణి, ఆశావర్కర్‌ల మండల కార్యదర్శి నిర్మల, సీఐటీయు మండల నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కిలిమంజారో అధిరోహకులకు సన్మానం

పార్వతీపురం /టౌన్: కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన గొర్లె రమణ, గేదెల చిన్నమ్మలను ఐటీడీఏ పీవో డాక్టర్ జి.లక్ష్మీశ బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చిరుద్యోగి కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడం రాష్ట్రానికే గర్వ కారణమన్నారు. 5,833 మీటర్ల ఎత్తు ఉన్న కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడం అత్యంత కష్టసాధ్యమైనప్పటికీ ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి లక్ష్యాన్ని సాధించారన్నారు. చిన్నమ్మలు పార్వతీపురం బీఈడీ హిందీ కళాశాలలో చదువుతూ పర్వతారోహణ చేయడం గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ నారాయణుడు, గురుకులం ఓఎస్‌డీ కవల్ భరత్, స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ ప్రిన్సిపాల్ ఎం.నరసింహులు, గిరిజన సంఘ నాయకులు పి.భగవాన్ ఉన్నారు.


రమణ, చిన్నమ్మలను సన్మానిస్తున్న పీవో లక్ష్మీశ

రహదారిపైనే చెత్త కుప్పలు

బూర్జ (సీతానగరం): బూర్జలో ప్రధాన రహదారి పక్కన చెత్తా చెదారం పేరుకుపోయింది. ఏ మాత్రం వర్షం కురిసినా దుర్వాసన వెదజల్లడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిపై బలిజిపేట, గరుగుబిల్లి మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం ఈ గ్రామంలో కానరావడంలేదు. డంపింగ్ యార్డులకు తరలించవలసి చెత్తా చెదారం ప్రధాన రహదారి ప్రక్కన కుప్పలుగా పేరుకుపోయింది. అంటురోగాలు ప్రబలక ముందే పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి చెత్తను తరలించాలని కోరుతున్నారు.


బూర్జ రహదారి పక్కన చెత్త

నిండని చెరువులు..రైతుల ఆందోళన

గరుగుబిల్లి: మండలంలో గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నా అంతంత మాత్రంగానే చెరువుల్లో నీటి నిల్వలు ఉన్నాయి. ఆగస్టులో చెరువులు నీటితో పూర్తిస్థాయిలో ఉండాల్సి ఉన్నప్పటికీ నేటికీ ఆ పరిస్థితి కనిపించలేదు. ఈ వర్షాలు మెట్ట ప్రాంతాల్లో వరి ఉభాలుకు కొంతమేర అవకాశం కల్పించింది. పూర్తిస్థాయిలో చెరువుల్లో నీరు లేకపోతే ఎలా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగావళి కుడి, ఎడమ కాల్వల ప్రాంతాల్లో మినహా వర్షాభావ ప్రాంతల్లో ఈ ఏడాది అంత ఆశాజనకంగా కనపడటం లేదు.


చెరువులో అంతంత మాత్రంగానే ఉన్న నీటి నిల్వలు

సాగునీటిని మళ్లించరూ

కింతలివానిపేట (సీతానగరం): వరి నాట్లు ముంపునకు గురిచేస్తున్న వీఆర్ఎస్ కాలువ నీటిని మళ్లించాలని బొబ్బిలి మండల కింతలివానిపేట రైతులు కోరుతున్నారు. లచ్చయ్యపేట, అంటిపేట, వెంకటాపురం గ్రామాల మీదుగా కింతలివానిపేట పంట పొలాలకు వీఆర్ఎస్ 19ఎల్ పిల్ల కాలువ ద్వారా సాగునీరందుతోంది. అయితే అంటిపేట పరిధిలో గల వాడాడ బంద, బేతముసలి బందలలో చెరువు గర్భాలను ఆక్రమించిన రైతులు కాలువ నీటిని మళ్లించడంతో పంట పొలాలు ముంపునకు గురైనట్టు కింతలివానిపేటకు చెందిన బొంతల కోటి తిరుపతిఢు, తప్పిట శ్రీనివాసరావు, మోపి గోపాలరావు, బొంతలకోటి త్రినాథ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వీఆర్ఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఇరిగేషన్ అధికారులు ముంపు నీటిని మళ్లించే ప్రక్రియ చేపట్టాలని కోరుతున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

రామభద్రపురం: ఉపాధ్యాయుల సాధారణ బదిలీల్లో భాగంగా స్థానిక శ్రీరామ నగర్ కాలనీ ఎంపీపీఎస్‌లో గత కొన్నేళ్లుగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం ఎంఈవో తిరుమల ప్రసాద్ పాఠశాల ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు వెన్నెల వెంకటరావు, రమణ సేవలను ఎంఈవో కొనియాడారు. తదనంతరం శాలువాతో వారిని సత్కరించి చిరుకానుకలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుందరీ, యూటీఎఫ్ నాయకులు విజయగౌరి, ప్రసన్నకుమార్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారులను కంటికి రెప్పలా చూసుకోండి

పార్వతీపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణిలు, బాలింతలను కంటికి రెప్పలా చూసుకోవాలని ఎంపీపీ హరిప్రియ థాట్రాజ్ కోరారు. బుధవారం సంగంవలస పంచాయతీ పరిధిలోని అడ్డూరువలస, ఆర్‌కే బట్టివలస, రావికోన, కొత్తవలస, మడకవానివలస అంగన్ వాడీ కేంద్రాలకు సర్పంచ్ అమరాపు రామకృష్ణ ఆధ్వర్యంలో వంట పాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.కృష్ణారావు, కార్యదర్శి ఎం.అప్పల నాయుడు, గ్రామ పెద్దలు బడే గౌరీశంకర్ పాల్గొన్నారు.


వంట పాత్రలు పంపిణీ చేస్తున్న హరిప్రియ థాట్రాజ్

అంగన్‌వాడీ కేంద్రాలకు వంట పాత్రల పంపిణీ

పాచిపెంట: మాతుమూరులో అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం స్థానిక ఎంపీడీవో .జి.వెంకటరావు వంటపాత్రలు అందజేశారు. ఒక్కొక్క-కేంద్రానికి రూ. 5 వేల విలువ చేసే వంట పాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరావు మాట్లాడుతూ సకాలంలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. సమయపాలన కూడా అంగన్‌వాడీ కార్యకర్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, స్థానిక సీడీపీవో డి.ఉమాభారతి, ఈవోపీఆర్‌డీ ఎం. మురళీకృష్ణ, సూపర్‌వైజర్ సుగుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోండి

కురుపాం: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఇందిరాకుమారి కోరారు. బుధవారం మొండెంఖల్-2 కేంద్రంలో సామూహిక సీమంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైద్య పరీక్షలు, పౌష్టికాహారం పంపిణీ, వైద్య సలహాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సులోచన పాల్గొన్నారు.


సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఒడిశా

విద్యుత్ సరఫరా అంతరాయంపై ధర్నా

పర్లాకిమిడి: పట్టణంలో నెలరోజులుగా తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో పర్లాకిమిడిలోని జిల్లా విద్యుత్ కార్యాలయం వద్ద బీజేపీ కార్యకర్తలు న్యాయవాది పీకే ప్రదాన్ పర్యవేక్షణలో బుధవారం ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రదాన్ మాట్లాడు తూ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు.


ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు

పర్లాకిమిడి కవులకు పుట్టినిల్లు

పర్లాకిమిడి: పర్లాకిమిడి కవులకు పుట్టినిల్లని, ఎంతో మంది కవులు విశిష్టతను చాటారని జగదీష్‌మహాపాత్రో అన్నారు. పర్లాకిమిడిలో కవితా దినోత్సవం పురస్కరిం చుకొని భక్తి సంగీత కార్యాలయంలో కవిసమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో పుష్పాంజలి, విచిత్రనందబెహరా, బాబాచరణ్ తదితరులు పాల్గొన్నారు.

కోఆప్టెక్స్‌లో రాయితీపై దుస్తుల విక్రయం

పర్లాకిమిడి: తమిళనాడు కోఆప్టెక్స్ కొనుగోలుదారులకు వినాయకచవితి, గురుపూజదినోత్సవం పురస్కరించుకొని 30 శాతం రాయితీ ఇచ్చే పథకాన్ని ఎస్‌డీపీవో ఉత్కళరంజన్ దాస్ బుధవారం ప్రారంభించారు. కోఆప్టెక్స్ దుస్తులను సి.రామకృష్ణ, స్థానిక సూర్యహాల్‌మార్క్ యాజమాన్య ప్రతినిధి మొదటి కొనుగోలుచేసి ప్రారంభించారు. ఈ అమ్మకాలు సెప్టెంబర్ 14వ తేదీ వరకూ కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బాలాజీరాజు, పి.రామకష్ణ, స్థానిక కోఆప్టెక్స్ మేనేజర్ శ్రీకాంత్, ఎం.కృష్ణారావు, డి.అప్పారావు పాల్గొన్నారు.


కోఆప్టెక్స్ పథకం ప్రారంభిస్తున్న ఎస్‌డీపీవో

లక్ష్యసాధనకు కృషి చేయండి

పర్లాకిమిడి ఎమ్మెల్యే సూర్యారావు

నెహ్రూనగర్(పలాస): లక్ష్యసాధనకు కృషి చేయాలని పర్లాకిమిడి నియోజకవర్గ ఎమ్మెల్యే కె.సూర్యారావు పిలుపునిచ్చారు. బుధవారం పలాసలోని టీకేఆర్ కళ్యాణమండపంలో శ్రీమేధా కళాశాలలో ఫ్రెషర్స్‌డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సూర్యారావు మాట్లాడుతూ దేశానికి సేవ చేయడం అదృష్టంగా భావించాలన్నారు. రాజకీయాల్లోకి రావాలంటే నిస్వార్థం అవసరమన్నారు. సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బమ్మిడి చంద్రశేఖరరావు, కరస్పాండెంట్ చాపర వేణుగోపాల్, మేధా స్కూల్ డైరక్టర్ ఐ.సోమేశ్వరరావు, గౌతమ్ స్కూల్ కరస్పాండెంట్ దుర్గాప్రసాద్‌పాత్రో, టెక్కలిపట్నం సాయికాన్వెంట్ స్కూల్‌కరస్పాండెంట్ ఉన్నారు.


మాట్లాడుతున్న పర్లాకిమిడి ఎమ్మెల్యే సూర్యారావు


ఆర్టీవోకు వినతిపత్రం అందజేస్తున్న అధ్యక్షుడు కృష్ణ, కార్మికులు

మోటారు కార్మికుల సమస్యలు పరిష్కరించండి

పర్లాకిమిడి: తమ సమస్యలు పరిష్కరించాలని మోటారు కార్మికుల సంఘ అధ్యక్షుడు పి.కృష్ణ నేతృత్వంలో పలువురు కార్మికులు కార్మికశాఖాకార్యాలయం ఆర్టీవో బీకే మహాపాత్రోను బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధవృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులకు పలుసౌకర్యాలు కల్పిస్తోందని, పనిముట్లుకూడా అందజేస్తోందని, అదేమాదిరిగా సౌకర్యాలు కల్పించాలని కోరారు.

582 మంది వైద్యుల నియామకం

పర్లాకిమిడి:రాష్ట్రంలో 582 మంది వైద్యులను ప్ర భుత్వం నియమించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ కొత్తగా నియమితులైన వైద్యులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో ప జలకు మెరుగై న వైద్య సేవలందజేసి రోగుల మన్ననలు పొందాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి ఆరోగ్యసేవలను మెరుగుపరిచేందుకు కొత్తగా నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో 169 హోమియో, 50 ఆయుర్వేద వైద్యులను నియమించనున్నట్లు చెప్పారు.

తపాలా సిబ్బంది ధర్నా

పర్లాకిమిడి:తమ సమస్యలు పరిష్కరించాలని బుధవారం గ్రామీణ తపాలా సిబ్బంది పర్లాకిమిడిలో ధర్నా నిర్వహించారు. తమను ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు పలు సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా సమ్మెలో భాగంగా ఇక్కడి తపాలా సిబ్బంది నిరసన తెలిపారు.

మరుగుదొడ్ల నిర్మాణంపై దృష్టి సారించండి

● **కలెక్టర్ వివేక్ యాదవ్**

కలెక్టరేట్: జిల్లాలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకానికి సంబంధించి సరైన ప్రగతి లేదని కలెక్టరు వివేక్ యాదవ్ అసహనం వ్యక్తం చేశారు. ఆయా శాఖ అధికారులతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. నిర్మాణంలో తగిన ప్రగతి చూపని గుర్ల, మెరకముడిదాం, భోగాపురం, గజపతినగరం, సీతానగరం, మక్కువ మండలాలకు చెందిన ఏఈలు ఆదివారం సాయంత్రం వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఆన్‌లైన్ ధ్రువ పత్రాలు జారీ చేయాలని అన్నారు. 11 రకాల సేవలను అందజేయాలని చెప్పారు. లక్ష మరుగుదొడ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 20 నాటికి నిర్మించే మరుగుదొడ్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంపై కలెక్టరు అసంతృప్తి వ్యక్తం చేశారు. మక్కువ, కొమరాడ తదితర మండలాల్లో గతంలో మరుగుదొడ్లు కోసం నిధులు పొందినప్పటికీ ఇప్పటికీ నిర్మించని సంస్థల నుంచి రకవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణానికి నిధుల సమస్య లేదన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కాని ఈవోఆర్డీలపై అసహనం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని డీపీవోని ఆదేశించారు. అంగన్‌వాడీలకు 14వ ఆర్థిక సంఘం నిధులు నుంచి వంట పాత్రలు కొనుగోలు చేయాలన్నారు. గ్రామాల్లో నివసించే కుటుం బాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయాల్సి ఉందని, గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఒక ఎన్యూమరేటర్‌ను నియమించుకుని ఈ సమాచారాన్ని సేకరించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో అనిత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వివేక్ యాదవ్

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

టెన్నిస్, వాలీబాల్ పోటీలకు..

సాలూరు రూరల్: రాష్ట్రస్థాయి వాలీబాల్, టెన్నిస్ పోటీలకు బొడ్డవలస సాంఘిక గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కేఎంపీ నారాయణరావు తెలిపారు. ఈనెల 26 నుంచి 28 వరకు చినగంజాం, ఒంగోలుల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఎస్.నవీన్, పి.నరేంద్రలు ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ నారాయణరావుతోపాటు పీడీ రాంబార్కి ఆదినారాయణ, లెక్చలర్ మూడడ్ల తిరుపతిరావు, గులిపల్లి శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు..

ఆరికతోట(రామభద్రపురం): ఒంగోలులో సెప్టెంబర్ 1, 2, 3, 4 తేదీల్లో జరగబోయే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్స్ పోటీలకు ఆరికతోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ శ్రీను, కావ్య ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎల్.రామకృష్ణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

● **డీఆర్‌ఎం మాతూర్**

బొబ్బిలి: రైల్వేస్టేషన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రైల్వే డీఆర్‌ఎం మాతూర్ తెలిపారు. ఈమేరకు రైల్వే స్టేషన్ పనితీరును బుధవారం పరిశీలించారు. రైల్వే పట్టాల గేర్లను పర్యవేక్షించారు. అనంతరం రైల్వేస్టేషన్‌లో పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి రైల్వే డీఆర్‌ఎంకు సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. బొబ్బిలి స్టేషన్ మీదుగా వెళ్తున్న పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు కల్పించాలన్నారు. అండర్ గ్రౌండ్ బ్రిడ్జీని నిర్మించాలని, హతియా యశ్వంత్‌పూర్‌తో పాటు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ప్రతిరోజు నడపాలని కోరారు. సీపీఎం నాయకుడు రెడ్డి వేణు కూడా సమస్యల వినతి పత్రాన్ని డీఆర్‌ఎంకు అందించారు. బొబ్బిలి, సాలూరు రైలు బస్సును పునరుద్ధరించాలని రైల్వే ప్లాట్‌పాం పక్కన గూడ్సు షెడ్‌ను మార్పు చేయాలని, మెటల్ రాయి లోడింగ్‌ను మార్చాలని కోరారు. పలువురు విద్యార్థులు కూడా రైల్వే బస్సును పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. ఇందుకు ఆయన సానుకూలం గా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చోడిగంజి రమేష్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తూముల భాస్కరరావు, సీపీఎం నాయకులు శంకరరావు, రెడ్డి ఇందిరతో పాటు పట్టణ ప్రముఖులు నంబియార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


డీఆర్‌ఎంకు వినతి పత్రాన్ని అందజేస్తున్న చైర్‌పర్సన్ అచ్యుతవల్లి

జూనియర్ సివిల్ జడ్జి రాజీనామా ఆమోదం

విజయనగరం (లీగల్): ఎస్‌కోట జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న విజయ్ గౌతమ్‌కుమార్ పట్నాయక్ రాజీనామాను ఆమోదిస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర హైకోర్టు నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి తొలుత 2016లో జిల్లాలో ఎస్‌కోట న్యాయస్థానం జూనియర్ జడ్జిగా విజయ్‌గౌతమ్ కుమార్ నియమితులయ్యారు. 2016 సంవత్సరంలో బాధ్యతలు చేపట్టారు. అయితే వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తూ రాష్ట్ర హైకోర్టుకు వినతి పత్రం దాఖలు చేసుకున్నారు. హైకోర్టు తన అభ్యర్థనను పరిశీలించి ఈమేరకు రాజీనామాను ఆమోదించినట్లు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అంగన్‌వాడీలతోనే 'లింక్'



జియ్యమ్మవలస అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తతో కలిసి పిల్లలకు బోధిస్తున్న లింక్ వర్కర్

● వర్కర్లను కొనసాగించే యోచనలో ప్రభుత్వం
● ఇప్పటికే ఐసీడీఎస్ పీడీలకు స్పష్టం చేసిన కమిషనర్
● బకాయిలు చెల్లిస్తూ మరికొంత గౌరవ వేతనం ఇచ్చేలా త్వరలో నిర్ణయం

(జియ్యమ్మవలస)

అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న లింక్, క్రషీ వర్కర్లకు త్వరలో శుభవార్త రానుంది. గతంలో వీరిని ప్రభుత్వం నియమించింది. కానీ ఏడాదిన్నరగా గౌరవ వేతనం ఇవ్వకపోవడంతో ఐసీడీఎస్ పీవోలు, సూపర్‌వైజర్లు వీరి విషయంలో ఏమీ చెప్పలేక సతమతమవుతూనే ఉన్నారు. దీంతో విధులకు హాజరుకావాలని చెప్పేందుకు కూడా ఐసీడీఎస్ పీవోలకు, సూపర్‌వైజర్లకు అవకాశం లేకుండా పోయింది. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ మాటలను బట్టి లింకు వర్కర్ల ఆశలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు మళ్లీ లంకె పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జిల్లాలోని 34 మండలాలు, 4 మున్సిపాలిటీల పరిధిలో 17 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 2987 అంగన్‌వాడీ కేంద్రాలు, 742 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 2014 అక్టోబరులో లింక్, క్రషీ వర్కర్ల పోస్టులు భర్తీ చేశారు. జిల్లాలో 1169 లింక్‌వర్కర్ల పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేస్తే 904 మందిని ఎంపిక చేశారు. ఇంకా 265 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. వీరికి నెలకు రూ.750 గౌరవ వేతనం ఇస్తామనే ఒప్పందంతో విధుల్లోకి తీసుకున్నారు. ఇక జిల్లావ్యాప్తంగా 196 క్రషీవర్కర్ల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తే 161 పోస్టులు అధికారులు భర్తీ చేశారు. ఇంకా 35 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. వీరికి నెలకు రూ. 3 వేలు చొప్పున గౌరవ వేతనం ఇస్తామని విధుల్లోకి తీసుకున్నారు. అప్పటి నుంచి వీరికి ఆరు నెలలకో, సంవత్సరానికో గౌరవ వేతనం ఇస్తూ వస్తున్నారు. అయితే వీరికి మార్చి 2016 నుంచి ఇంతవరకు గౌరవ వేతనం ఇవ్వలేదు. దీంతో వీరు చాలా ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికైతే వీరికి 17 నెలల గౌరవ వేతనం అందించాల్సి ఉంది. అంటే లింక్ వర్కర్లకు రూ.1,15,26,000, క్రషీ వర్కర్లకు రూ.82.11 లక్షలు కలిపి మొత్తం రూ. 1,97,37,000లు చెల్లించాల్సి ఉంది.

ఇవీ వీరి విధులు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో లింక్ వర్కర్లు, క్రషీ వర్కర్లు చాలా జాగ్రత్తగా పనిచేయాల్సి ఉంది.

● ఆయా అంగన్‌వాడీల పరిధిలోని చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న సేవలు వినియోగించుకొనేలా చేయాలి.

● ఇంటింటికి వెళ్లి వీరు చిన్న పిల్లలను, గర్భిణులను అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలి.

● మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ వర్కరు ఒక్కరే ఉంటారు. కావున కొన్నిసార్లు వీరే అంగన్‌వాడీ వర్కరు పని కూడా చేయాల్సి ఉంది.

కొనసాగిస్తారా..?

ప్రభుత్వ ఉద్యోగం అంటే ఎంత తక్కువ జీతమైనా ముందడుగు వేసేందుకు పోటీ పడతారు. అలాగే ఇప్పుడు విధులు నిర్వర్తిస్తున్న లింక్, క్రషీవర్కర్లలో కొంతమంది ఆమ్యామ్యాలు, రికమండేషన్ల రూపంలో ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకొనే చేరారు. ప్రస్తుతం వీరి పరిస్థితి దినదినం గండం - ప్రాణ సంకటం అనే చందాన ఉంది. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని సంతోషపడాలో, మధ్యలో ఆపేస్తున్నారని దుఃఖించాలో తెలియక సతమతమవుతున్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం తీసుకోబోతున్న నిర్ణయమే వీరి పాలిట వరమో లేక శాపమో అనేది తేలాల్సి ఉంది. అయితే ఉన్నతాధికారులు చెప్పిన దాని ప్రకారం వీరికి వరమే అన్నట్టు కనిపిస్తోంది. ఇటీవల జరిగిన రాష్ట్ర కమిషనర్ సమావేశంలో లింక్ వర్కర్ల గౌరవ వేతనం బకాయి చెల్లిస్తూ, అదనంగా మరికొంత సొమ్ము ఇస్తూ, కొనసాగించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. ఇలా అయితే వీరికి మంచి రోజులు వచ్చినట్టే.

కొనసాగించే అవకాశం ఉంది



లింక్, క్రషీ వర్కర్లను కొనసా గించే అవకాశం ఉంది. ఇటీవల అన్ని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లతో జరిగిన సమావేశంలో కమిషనర్ ఈ విషయం సూచనప్రాయంగా తెలియజేశారు. వీరికి ఇవ్వాల్సిన గౌరవ వేతనం బకాయిలతో పాటు మరికొంత ఇస్తూ వీరి సేవలు వినియోగించుకోవడానికి ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు త్వరలో నిర్ణయం తీసుకుంటారు.

-ఏఈ రాబర్ట్స్, ఐసీడీఎస్ పీడీ

భావితరాలకు ఆంధ్రకేసరి ఆదర్శం

● కలెక్టర్ వివేక్‌యాదవ్
● టంగుటూరికి ఘన నివాళి



టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

కలెక్టరేట్ (విజయనగరం) : భావితరాలు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ వివేక్‌యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో టంగుటూరి 146వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వివేక్‌యాదవ్... ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు టంగుటూరిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. నీతి, నిజాయతీలతో విధులు నిర్వహిస్తూ, సామాన్య ప్రజలకు మెరుగైన సేవలందించాలని పిలుపునిచ్చారు. ప్రకాశం పంతులు స్వాతంత్ర్య ఉద్యమంలో సైమన్ కమిషన్ వ్యతిరేక ర్యాలీలో బ్రిటీష్ తుపాకీలకు ఎదురొడ్డి నిలిచారని కొనియాడారు. ఆంధ్రకేసరిగా పేరు గాంచారన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. ఉపాధ్యాయులు టంగుటూరి జీవిత కథను విద్యార్థులకు బోధించాలని సూచించారు. టంగుటూరి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం అభినందనీయమన్నారు. ప్రకాశం పంతులు తన ఆస్తులను పత్రికల స్థాపనకు, ప్రజలకు దానం చేసిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో జేసీ శ్రీకేశ్ బీలత్కర్, జేసీ -2 నాగేశ్వరరావు, డీఆర్వో కేఎస్ రాజ్‌కుమార్, వ్యవసాయ, పశు సంవర్థక శాఖ జేడీలు లీలావతి, డాక్టర్ వై.సింహాచలం, డీఈవో అరుణకుమారి, ఉద్యాన శాఖ డీడీ పీఎన్‌వీ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ తాడ్డి గోవిందరావు, డీపీఆర్వో డి.రమేష్, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

31లోగా ఆదర్శ వసతిగృహాలు ప్రారంభం

మరుపల్లి (గజపతినగరం రూరల్): జిల్లాలోని ఆదర్శ పాఠశాలల వసతిగృహాలను ఈ నెలాఖరులోగా ప్రారంభించనున్నట్టు రాష్ట్ర ఇంజినీరింగ్ శాఖ అధికారి సీహెచ్ అప్పారావు అన్నారు. బుధవారం ఆయన.. మరుపల్లిలోని ఆదర్శ పాఠశాల వసతిగృహాన్ని పరిశీలించారు. స్కూలులోని విద్యార్థుల సంఖ్య, మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఫర్నీచర్ పూర్తిస్థాయిలో లేదని, ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని ప్రత్యేక అధికారిణి ఎం.ప్రసన్నలక్ష్మి ఆయనకు తెలియజేశారు.

అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు పెంపొందించే లా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దీనిలో భాగంగానే పాఠశాలలను పరిశీలిస్తున్నామని చెప్పారు. అసంపూర్తి భవనాలను వేగవంతం చేస్తామన్నారు. ఆయన వెంట జిల్లా మోడల్ స్కూళ్ల కన్వీనర్ కె.అప్పాజీ, డీఈవో కార్యాలయ అధికారి బాలభాస్కరరావు ఉన్నారు.



మరుపల్లి ఆదర్శ పాఠశాల సమస్యలను తెలుసుకుంటున్న అధికారి అప్పారావు

అదనపు సాగునీటికి సర్వే

తోటపల్లి (గరుగుబిల్లి) : తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాలువ ప్రాంతం నుంచి అదనపు ఆయకట్టుకు సాగునీరుకు ప్రాజెక్టు అధికారులు బుధవారం సర్వే ప్రారంభించారు. కాలువకు ఆనుక్ను గ్రామాల భూములకు సాగునీటి సౌకర్యం లేక రైతులు పలు అవస్థలు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు దృష్టికి మాజీ మంత్రి శత్రుచర్ల తీసుకెళ్లారు. దీంతో ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించాలని ప్రాజెక్టు ఎస్ఈ డి.తిరుమలరావుకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మథరావు, డీఈ ఎస్.పాండు, జేఈ కె.శ్రీనివాసరావు ప్రాంతాన్ని పరిశీలించారు. ఎడమ కాలువ నుంచి గ్రావిటీ పథకం, ఎత్తిపోతల పథకానికి సంబంధించిఏ మేర దిగువకు వెళ్లిందన్న దానిపై సర్వే నిర్వహించి తగు నివేదికలను అందిస్తామని డీఈ తెలిపారు. ఈ పరిశీలనలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ డొంకాడ రామకృష్ణ, నాగూరు సర్పంచ్ మధుసూదనరావు, రైతులు పాల్గొన్నారు.



తోటపల్లి ఎడమ కాలువ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్న డీఈ ..తదితరులు

ఎస్.కోటకు తరలివచ్చిన నవ గణేషులు



ఊరేగింపుగా గణనాథులను తీసుకొస్తున్న శోభా హైమావతి తదితరులు, ఎస్.కోట నవగణేష్ మండపంలో ఏర్పాటుచేయనున్న వినాయకుని విగ్రహం

శృంగవరపుకోట : ఎస్.కోటలో నిర్వహించనున్న గణేష్ ఉత్సవాల్లో భాగంగా మండపానికి వినాయక విగ్రహాలను బుధవారం సాయంత్రం తరలించారు. తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు శోభా హైమవతి ఆధ్వర్యంలో వీటిని తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు విజయనగరం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఎస్.కోటలోకి రాగానే మేళతాళాలు, బాణసంచాలతో విశాఖ-అరకు రోడ్డులో ఊరేగించారు. దేవీ మాత విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆకుల డిపో వద్ద నిర్మించిన మండపంలో ప్రతిష్ఠకు సిద్ధం చేశారు. ఈనెల 25నుంచి జరగనున్న వినాయక నవరాత్రుల్లో ఈ విగ్రహాలకు పూజలు చేస్తారు. ఈ మండపంలో ఏర్పాటు చేయబోయే వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. ప్రధాన వినాయకుడి విగ్ర హం చుట్టూ చెట్టు ఆకారంలో విగ్రహాలను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి వెంకన్న, జడ్పీటీసీ సభ్యురాలు సుకూరు రామలక్ష్మి, వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, సర్పంచ్‌లు అంబటి లక్ష్మి, రెడ్డి భవానీ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా వనమూలికలు

● గిరిజనులకు ప్రోత్సాహం కరువు ● కొనుగోలు చేయని జీసీసీ ● సేకరణపై నిర్లిప్తత


ఏజెన్సీలో లభ్యమవుతున్న వివిధ రకాల వనమూలికలు

(కొమరాడ)

అటవీ ప్రాంతంలో విలువైన వనమూలికలు విరివిగా లభిస్తాయి. వీటిని సేకరించడానికి గిరిజనులను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అటవీ ఫలసాయాల సేకరణపై ఆధారపడి బతుకుతున్న గిరిజనులకు వనమూలికల సేకరణ తోడైతే ఈ కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కకోగలుగుతాయి. ఐటీడీఏ, వెలుగు, జీసీసీ వంటి సంస్థలు గిరిజనుల నుంచి వన మూలికలు కొనుగోలు చేసిమార్కెటింగ్ చేయాలి. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ ఏజెన్సీల్లో 45 రకాల వనమూలికలు లభ్యమవుతున్నట్లు గతంలో అటవీశాఖ, జీసీసీ అధికారులు గుర్తించారు. వీటి వివరాలు .. ఏయే అడవుల్లో విరివిగా లభ్యమవుతాయన్న అంశాలతో పుస్తకాన్ని కూడా ప్రచురించారు. పాతాలగిరిడి, సర్పగంధి, సరస్వతి ఆకు, మారేడు, గులివింద, నేలవేము, తాడికాయ, కరక్కాయ, ఇండుగ, ఉసిరి, ఉమ్మెత్త, శతావధి, కొండ పిండి ఆకు, గుచ్చిమి తదితర వనమూలికలున్నాయి. 1994లో అప్పటి జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ టి.విజయ్‌కుమార్ వనమూలికలను జీసీసీ ద్వారా కొనుగోలు చేశారు. వీటిని జండూబామ్, డాబర్, హిమాలయ తదితర ఆయుర్వేద కంపెనీలకు సరఫరా చేశారు. ఈయన బదిలీ తరువాత జీసీసీ ద్వారా వనమూలికల కొనుగోలు నిలిచిపోయింది. వెలుగు వంటి సంస్థలు కూడా దృష్టి పెట్టలేదు. అటవీ ప్రాంతంలోని విలువైన వనమూలికలు మట్టిలో కలిసిపోతున్నాయి తప్ప ఉపయోగంలోకి రావడం లేదు.ఐటీడీఏ, జీసీసీ అధికారులు స్పందించి వనమూలికల సేకరణపై గిరిజనులకు తగిన అవగాహన కల్పించాల్సి ఉంది. సేకరించిన ఉత్పత్తులను తగిన మద్దతు ధరకు కొనుగోలు చేసి వారిని ఆర్థికంగా ఆదుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియలో వారికి కలిగే లాభాన్ని వివరిస్తే వనమూలికలు వృథా కాకుండా వినియోగంలోకి వస్తాయి.



ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

అడవిలో గిరిజనులు సేకరించిన వన మూలికలను ప్రభుత్వం కొనుగోలు చేసి గిరిజనులను ఆదుకోవాలి. అనేక రకాల వన మూలికలు ఏజెన్సీ ప్రాంతంలో విరివిరిగా దొరుకుతున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వృథాగా పోతున్నాయి. తక్షణమే కొనుగోలు జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా వీటి సేకరణపై అధికారులు గిరిజనులకు తగిన ప్రోత్సాహాన్నందించాలి.

- ఎస్.పావని, జడ్పీటీసీ సభ్యురాలు, కొమరాడ





కొనుగోలుకు జీసీసీ చర్యలు చేపట్టాలి

గిరిజన సహకార సంస్థ గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఫలసాయాలు కొనుగోలు చేస్తుంది. వీటితో పాటు వనమూలికలు కూడా కొనుగోలు చేయాలి. ప్రపంచ మార్కెట్‌లో ఆయుర్వేద మందులు వాడకం పెరుగుతుంది. ఈ ప్రాంతంలో ఏఏ వనమూలికలు ఉన్నాయి. వాటి ప్రాధాన్యతపై గిరిజనుల్లో అవగాహన కల్పించి వీటి సేకరణకు ప్రోత్సహించాలి.

- వి.లావణ్యలత, ఎంపీడీవో, చినఖేర్జిల





● తొమ్మిది కూడళ్ల అభివృద్ధికి కార్యాచరణ
● తొలుత ఆక్రమణల తొలగింపు
● అనంతరం అభివృద్ధి, సుందరీకరణ

నగరానికి నవకళ

(విజయనగరం టౌన్)

కార్పొరేషన్ దిశగా అడుగులు వేస్తున్న విజయనగరానికి మరింత కొత్త శోభ సంతరించేందుకు వీలుగా పురపాలక సంఘం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఆరు నెలల కిందటే విజయనగరం పట్టణంలోని 14 ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేసేందుకు కలెక్టరు వివేక్‌యాదవ్ అధ్యక్షతన అధికారుల సమావేశం జరిగింది. అయితే వీటి అభివృద్ధి ఏ విధంగా చేయాలన్న దానిపై మహారాజా ఇంజినీరింగు కళాశాల విద్యార్థులతో ప్రాజెక్టు రిపోర్టు సిద్ధం చేయించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం తొలుత గుర్తించిన 14 కూడళ్లు కాకుండా, ప్రస్తుతం తొమ్మిది ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. ఇవి కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పట్టణంలోకి ప్రవేశించే ప్రధాన కూడళ్లను గుర్తించారు. పురపాలక సంఘం అధికారులు గుర్తించిన ఈ కూడళ్లలో చాలా కాలం నుంచి పెద్ద ఎత్తున ఆక్రమణలు వున్నాయి.. వీటి తొలగింపు ప్రక్రియ ముందుగా చేపట్టి ఆ తరువాత కూడళ్లను అభివృద్ధి చేసేందుకు ముందుకు సాగాలని పట్టణ ప్రణాళిక అధికారులు భావిస్తున్నారు. ఒక్కో కూడలి అభివృద్ధికి ఎంత మేర వ్యయం అవుతుందన్న దానిపై మున్సిపల్ ఇంజినీరింగు అధికారులు ఒకవైపు ప్రతిపాదనలు సిద్ధం చేస్తుండగా, మరోవైపు పట్టణ ప్రణాళిక అధికారులు ఆయా కూడళ్లలో ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపడుతున్నారు.



మయూరి కూడలి


అంబేద్కర్ కూడలి

కూడళ్లను అభివృద్ధి పరిచేదిలా...

పట్టణంలోని కలెక్టరేట్, ఆర్‌టీవో కార్యాలయం, జేఎన్‌టీయు జంక్షన్, మయూరి కూడలి, అంబేద్కర్ కూడలి, కోట, మూడు లాంతర్లు, పూల్‌బాగ్, గంటస్తంభం కూడళ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ కూడళ్లలో తొలుత ఆక్రమణలు గుర్తించి, తొలగించిన అనంతరం పెద్దసర్కిల్ ఏర్పాటు చేస్తారు.. ఆ సర్కిల్ చుట్టూ గ్రిల్స్ వేస్తారు. అందమైన పూలమొక్కలు నాటుతారు.. ఎల్‌ఈడీ వెలుగులు ఏర్పాటు చేస్తారు.. అసవరమైన చోట వాటర్ ఫౌంటేన్స్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా అధికారులకు వుంది. పొరుగున వున్న విశాఖపట్టణంలో ఇప్పటికే ఈ తరహా అభివృద్ధి జరిగింది. తొలుత పట్టణంలోని తొమ్మిది కూడళ్లను అభివృద్ధి పరచిన తరువాత మరో ఐదు కూడళ్ల అభివృద్ధికి రంగం సిద్ధం చేయనున్నారు. వీటిలో రింగురోడ్డు రైతు బజారు, కొత్తపేట, జమ్ము, వైఎస్సార్ జంక్షన్, కంటోన్మెంట్ గణేష్ కోవెల జంక్షన్ ఇలా.. దశలవారీగా అభివృద్ధి చేయనున్నారు. ఒకవైపు ట్రాఫిక్ సమస్య నుంచి గట్టెక్కడంతో పాటు, పట్టణాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు వీలుగా ఈ జంక్షన్‌ల అభివృద్ధి చేపట్టనున్నా రు. అక్టోబరు నుంచి ఈ అభివృద్ధి కార్యక్రమం చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

చినబోరబందకు...

● ఏళ్లు గడుస్తున్నా నెరవేరని హామీ
● ఐటీడీఏ పరిధిలో లేకపోవడమే కారణం

రహదారి గ్రహణం

(బొబ్బిలి)

గిరిజన గ్రామాలకు రహదారులు వేసేందుకు సిద్ధమని చెబుతున్న ప్రభుత్వాలు ఏళ్లుగా నిరీక్షిస్తున్నా చర్యలకు ఉపక్రమించడం లేదు. రాజకీయ నాయకులు ఎన్నికల ముందు ఓట్లు దండుకునేందుకు బొబ్బిలి నుంచి సాలూరును కలిపే చినబోరబంద రోడ్డు నిర్మిస్తామని వాగ్దానాలిచ్చి తరువాత అటువైపు చూడడం లేదు. దీంతో గిరిజనులు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బొబ్బిలి నుంచి చినబోరబందకు వెళ్లే రోడ్డునను సరించి డొంగురువలస, చిలకమ్మవలస, ఎరకందరవలస, మోసూరువలస, జోగిందరవలస, కరిందరవలస ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో ఎవర్కైనా అనారోగ్యం చేస్తే వారిని బొబ్బిలి ప్రభుత్వాసుత్రికి వైద్యం కోసం తీసుకురావాలంటే డోలీలు కట్టాల్సిందే. వర్షాలు కురిసినప్పుడు రోడ్డుపై 108 వాహనాలు కూరుకుపోతుండటంతో సిబ్బంది వచ్చేందుకు విముఖత చూపుతున్నారు. ప్రధానంగా ఈ గిరిజన గ్రామాలు పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో లేకపోవడమే కారణం. ఐటీడీఏకు వస్తున్న కోట్లాది రూపాయలు షెడ్యూల్డ్ పరిధిలో ఉన్న గ్రామాలకు అవసరం ఉన్నా లేకున్నా ఖర్చు చేస్తున్నా ఆ పరిధిలో లేని గ్రామాలను కనీసం పట్టించుకోవడం లేదు. వీటిని షెడ్యూల్డ్ గ్రామాలుగా ప్రకటించాలని ఏళ్లుగా గిరిజనం కోరుతున్నప్పటికీ ఫలితం కనిపించలేదు. డొంగురువలస సమీపంలోని కోటి చెరువు గెడ్డ కల్వర్టు ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయింది. ఈ పనులు చేపట్టకపోవడంతో వాహనాలు వెళ్లడం ఇబ్బందికరంగా మారింది. కేవలం 8 కిలోమీటర్లు రోడ్డు వేస్తే సుమారు పది గిరిజన గ్రామాల వారి ప్రాణాలను ప్రభుత్వం కాపాడినట్టేనని గిరిజనులు అంటున్నారు. గ త ఏడాది డొంగురువలస వచ్చిన జడ్పీ చైర్‌పర్సన్ స్వాతీరాణికి గిరిజనులు సమస్యల ను ఏకరువు పెట్టారు. ఇప్పుడు మంత్రి సుజయకృష్ణరంగారావుపైనే ఆశలు పెంచుకుంటున్నారు.


గోతులమయమైన బొబ్బిలి, చినబోరబంద రోడ్డు



ఐటీడీఏలో కలపాలి

బొబ్బిలి మండల పరిధిలోని గిరిజన గ్రామాలను పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో చేర్పించాలి. ఐటీడీఏ పరిధిలో లేక గిరిజన గ్రామాలాభివృద్ధికి వస్తున్న నిధులు ఇవ్వడంలేదు. బొబ్బిలి నుంచి చినబోరబంద వరకు తారురోడ్డు నిర్మించాలి. లేదంటే రోగులను ఆసుపత్రికి తరలించేందుకు డోలీలు కడుతున్నాం.

- పాడి శంకరరావు, డొంగురువలస


డొంగురువలస వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు



చినుకుపడితే చిత్తడి

బొబ్బిలి నుంచి చినబోరబంద వరకు 5 కిలోమీటర్లు బాగున్నా, గిరిజన గ్రామాల మీదుగా వచ్చే 7కిలోమీటర్ల రోడ్డు బాగాలేకపోవడంతో గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చినుకుపడితే వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నా యి. దీంతో కనీస వైద్యం అందడం లేదు. ఎంతో మంది ప్రాణాలు పో తున్నాయి.

- జి.సత్యనారాయణ, చినబోరబంద

ఆ గ్రామం.. రెండు పంచాయతీల పరిధిలో ఉంటుంది. ఇలా ఉంటే అభివృద్ధిలో పోటీ పడి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతారని భావిస్తే మీరు పప్పులో కాలేసినట్టే... ఎందుకంటే ఈ గ్రామాన్ని ఇద్దరు సర్పంచులు... ఉన్న ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు పట్టించుకోవడం లేదు. దీంతో కనీసం గ్రామంలో పరిశుభ్రత కూడా కనిపించదు. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంటుంది. వీధి కాలువలు పూడుకుపోయి దోమల నిలయాలుగా మారుతున్నాయి. రెండు పంచాయతీల పరిధిలో ఉన్నా ఇదేం దుస్థితి భగవంతుడా... అని గ్రామవాసులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. ఈ దుస్థితి కొత్తవలస మండలం మంగళపాలెంలో కనిపిస్తుంది.

అభివృద్ధికి... మంగళం

● ఆ గ్రామానికి ఇద్దరు సర్పంచులు
● పట్టించుకునే వారే కనిపించరు
● మంగళపాలెంలో విచిత్ర పరిస్థితి

(కొత్తవలస)

మండలంలోని ఈ గ్రామం పరిస్థితి విచిత్రంగా ఉంటుంది. ఈ గ్రామానికి ఇద్దరు సర్పంచ్‌లు, ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు ప్రాతినిథ్యం వహిస్తుంటారు. అయినా సమస్యలు మాత్రం ఎక్కడివి అక్కడే ఉంటాయని గ్రామస్థులు వ్యంగ్యంగా విమర్శిస్తుంటారు. ఇద్దరు సర్పంచ్‌లు ఉండడం వలనే ఎవరూ పట్టించు కోవడం లేదంటున్నారు. మండలంలోని మంగళపాలెం పరిస్థితి మిగిలిన గ్రామాలకంటే భిన్నంగా ఉంటుంది. గ్రామం అంతా కలసి ఉన్నా సగం గ్రామం ఈ గ్రామానికి సుమారు మూడు కిలో మీటర్లు దూరంలో నున్న దేశపాత్రునిపాలెం పంచాయతీలో ఉండగా మిగిలిన సగభాగం మంగళపాలెం పంచాయతీలో కలిసి ఉంటుంది. విశాఖపట్టణం- అరకు రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో కొంతభాగం, రోడ్డుపక్కన ఉన్న రెల్లికాలనీ దేశపాత్రునిపాలెం పంచాయతీలో విలీనమై ఉన్నాయి. గ్రామంలో ఏప్రాంతం ఎక్కడ నుంచి మంగళపాలెం పంచాయతీలోకి వస్తుంది, ఏగ్రామం దేశపాత్రునిపాలెం పంచాయతీలో ఉందనే నిర్దిష్టమైన సరిహద్దులున్నా అన్ని ఇళ్లు కలిసే ఉంటాయి.గ్రామానికి ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు కూడా ఉన్నారు. వీరిలో ఒకరు దేశపాత్రునిపాలెం పంచాయతీకి ప్రాతినిధ్యం వహిస్తుండగా, మరొకరు మంగళపాలెం పంచాయతీకి ప్రాతినిధ్యం వహిస్తారు. దీంతో ఒక పంచాయతీ పరిధిలో చేపడుతున్న పారిశుధ్యం పనులు మరో పంచాయతీ చేపట్టకపోవడంతో గ్రామంలో ఏ వీధిలో చూసినా అపరిశుభ్రత తాండవిస్తుంటుంది. ఎక్కడ చెత్త అక్కడే నిలచి ఉంటుంది. గ్రామంలో ముఖ్యంగా తాగునీరు ప్రధాన సమస్య. దీనిపై మంగళపాలెం పంచాయతీగాని, దేశపాత్రునిపాలెం పంచాయతీగాని పట్టించుకోవడం లేదంటున్నారు స్థానికులు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మాత్రం నానా హడాహుడి చేసే నాయకులు ఎన్నికలు అయిపోయిన తరువాత పట్టించు కోరంటున్నారు. దేశపాత్రునిపాలెం పంచాయతీ పరిధిలో కొంత భాగం ఉండటంతో ఆ పంచాయతీ సర్పంచ్ చేయాల్సిన పనులను తమకెందుకని మంగళపాలెం పంచాయతీ చేయడం లేదు. ఈగ్రామానికి వెళ్లాలంటే రైల్వేగేటును దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. రైల్వేగేటుకు సంబంధించి ఫుట్ ఓవర్‌బ్రిడ్జి మంజూరైందని అధికారులు చెప్పడమే తప్ప పనులు జరగడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఏ చిన్న పనికైనా గేటు దాటి రావలసిందేనని, అలా వచ్చే సమయంలో ప్రమాదాలు సంభవించి మృత్యువాత పడుతున్నామంటున్నారు.


పెంటకుప్పలతో స్వాగతం పలుకుతున్న మంగళపాలెం

ఒకే పంచాయతీలో ఉంచితే మేలు



మంగళపాలెం గ్రామమంతా ఒకే పంచాయతీ పరిధిలో ఉంటే ఎవరో ఒక్కరు పట్టించుకుంటారు. రెండు భాగాలుగా విడిపోవడంతో పరస్పరం ఇద్దరు సర్పంచులు ఒకరిపై ఒకరు నెపం నెట్టేస్తున్నారు. దీంతో సమస్యలు తీరక గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా గ్రామాన్ని ఏదో ఒక పంచాయతీలో పూర్తిగా విలీనం చేయాలని కోరుతున్నాం.

-ఐతంశెట్టి శ్రీనివాసరావు, లోక్‌సత్తా మండల కన్వీనర్

పరిశ్రమలు రావు....

● గ్రోత్ సెంటర్‌లో కానరాని కంపెనీల ఏర్పాటు
● భూములను సాగుకు వినియోగిస్తున్న రైతులు

ఆశలు తీరవు!

(బొబ్బిలి)

పరిశ్రమల ఏర్పాటుతో బొబ్బిలి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమల రాక కలగానే మిగులుతోంది. భారీ కంపెనీలు ఏర్పాటు చేస్తామంటూ భూములు తీసుకున్న యాజమాన్యాలు ఒక్కొక్కటిగా ముఖం చాటేస్తున్నాయి. దీంతో ఇటు భూములు పోయి,,, అటు పరిశ్రమలు ఏర్పాటు కాక... ఉపాధి అవకాశాలపై ఆశలు పెంచుకున్న స్థానికులు తీవ్ర నిరాశలో కూరుకుపోతున్నారు. బీకేసంస్థకు అప్పట్లో 42 ప్లాట్‌లో 280 ఎకరాల భూమిని కేటాయించారు. ఏళ్లు గడుస్తున్నా యాజమాన్యం పరిశ్రమ స్థాపించడానికి ముందుకు రాకపోవడంతో అనేకసార్లు ఏపీఐఐసీ నోటీసులు ఇచ్చింది. తీరా ఇంతకాలం అయ్యాక తాజాగా యాజమాన్యం చేతులెత్తేసి పరిశ్రమలు స్థాపించలేమని చెప్పడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న ఈ ప్రాంత యువత నిరుత్సాహానికి గురవుతున్నారు. బీకే స్టీల్స్‌కు కేటాయించిన స్థలంలో ఏపీఐఐసీ అధికారులు రోడ్లు, డ్రైన్‌లు వంటి అభివృద్ధి పనులు చేపట్టి 280 ఎకరాలను చిన్న చిన్న ప్లాట్‌లుగా విడదీసి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ భూముల్లో పరిశ్రమలు రాకపోవడంతో సమీప రైతులు పారిశ్రామిక భూముల్లో వివిధ రకాల పంటలను సాగుచేస్తున్నారు. 1150 ఎకరాల్లో ఏర్పాటు చేసిన బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో 876.58ఎకరాల్లో ప్లాట్‌లు వేసి మిగతాది అంతా రోడ్డు, డ్రైన్‌లకు కేటాయించారు. ప్రస్తుతం గ్రోత్ సెంటర్‌లో 310 సంస్థలు నిర్మాణం చేపట్టగా ఇందులో 137 పరిశ్రమలు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నాయి.బీకేస్టీల్స్ ఎక్సేంజ్ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన మాయిల్ సంస్థ స్థాపించకపోవడంతో వీటికి అనుబంధంగా ఏర్పాటు చేసిన 24 ఇంజినీరింగ్ సంస్థలు మూతపడ్డాయి. దీంతో వందలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోయారు. మరో 83 పరిశ్రమలకు వివిధ స్థాయిలో పనులు జరుగుతుండగా 66 పరిశ్రమలు ప్రారంభానికి నోచుకోలేదు. ఇంకా 36 ప్లాట్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా అవసరమైనంత మేర ఖాళీ స్థలాలున్నాయి. అయితే ఇక్కడా ఎవరూ ముందుకు రాకపోవడంతో పరిశ్రమల ఏర్పాటు కలగానే మిగులుతోంది. ఈ పరిస్థితిలో ఆ భూములను ఖాళీగా వదిలేయ లేక, అటు పరిశ్రమలు రాకపోవడంతో రైతులు సాగుకు వీలుగా మలుచుకుంటున్నారు. తమ భూములు తీసుకున్న మాట వాస్తవమే గానీ, అవి ఎందుకూ కొరగాకుండా బీడుగా మారుతుంటే చూడలేకపోతున్నామని, అయితే పరిశ్రమలు ఏర్పాటు చేయండి, లేదంటే అప్పటివరకు సాగుకు అనుమతించండి అంటూ భూములిచ్చిన రైతులు డిమాండ్ చేస్తున్నారు. పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తే ప్లాట్‌లు కేటాయిస్తామని ఏపీఐఐసీ మేనేజర్ ఎంవీ కరుణాకర్ తెలిపారు. స్క్వేర్ మీటర్ రూ.1064 ఇస్తామన్నారు. మౌలిక వసతుల కల్పన అని పారిశ్రామిక వేత్తలు అంటుండగా పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు ఏపీఐఐసీ సిద్ధంగా ఉందని అధికారులు చెబుతున్నారు.



విఘ్నాలు తొలగించు... వినాయకా!

● పెరిగిన ముడిసరుకు ధరలు ● భారమైన విగ్రహాల తయారీ ● నష్టం వస్తున్నా వృత్తిని వీడని కుమ్మర్లు


రంగులు వేస్తున్న తయారీదారు



కొత్తవలస రూరల్: ఏటా వినాయక చవితి సంబరాలు వైభవంగా నిర్వహించేందుకు గాను వివిధ ఆకృతుల్లో భారీ గణనాథుల విగ్రహాలను రూపొందిస్తూ మన్ననలు పొందుతున్న కుమ్మరి కుటుంబాలు మాత్రం ఆకలితో అలమటిస్తున్నారు. విగ్రహ తయారీ, విక్రయాలతో ప్రతీ సంవత్సరం నష్టాలు వస్తున్నా వృత్తిని మాత్రం విడవడం లేదు. విఘ్నాలు తొలగించి ఆదుకుంటాడనే ఉద్దేశంతో విఘ్నేశ్వరుడి ప్రతిమలను కుమ్మరి కులస్థులు తయారుచేస్తున్నారు. ఈవృత్తినే నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఏటా వేసవిలో ఇటుకలు, కుండలు, ప్రమిదలు, ఈ సీజన్‌లో గణపతి విగ్రహాలు తయారుచేస్తున్నారు. మండలంలో సుమారు 100 కుటుంబాలు ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు.

పెరిగిన ముడిసరుకు ధరలు...

మండలంలోని కొత్తవలస, తుమ్మికాపల్లి, చింతలపాలెం వద్ద కేంద్రాలను నెలకొల్పి గణనాథుల విగ్రహాలను తయారుచేస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు ఒడిశాతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, పాడేరు, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి వస్తుంటారు. గణనాథుల తయారీకి సుమారు రూ.5లక్షలు వరకు పెట్టుబడులు పెడుతుంటారు. వీటి నిర్వహణకుగానూ ప్రత్యేకంగా షెడ్డులను ఏర్పాటు చేసుకుంటున్నారు. విగ్రహాల తయారీలో వినియోగించే కొబ్బరి పీచు, ప్లాస్టర్ ఆఫ్ పారీస్, రసాయనాలు కలవని పెయింట్ల ధరలు పెరగటంతో మదుపులు పెరిగాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 కేజీల కొబ్బరిపీచు బ్యాగ్ రూ.1100, ప్లాస్టర్‌ఆఫ్‌పారీస్ 25 కేజీ బ్యాగ్ రూ.230, తయారీలో ఆకర్షణగా నిలిచేందుకుగానూ ఉపయోగించే పెయింట్లను హైదరాబాద్ నుంచి తీసుకువస్తున్నారు.


విగ్రహానికి రంగులు అద్దుతున్న ఓ కుటుంబం

నష్టం వస్తున్నా...

విగ్రహాలు తయారీ చేసిన తర్వాత వర్షాలు పడితే కొనుగోలుదారులు రాక నష్టపోవాల్సివస్తోందని కుమ్మర్లు వాపోతున్నారు. నష్టాలు వస్తున్నా వృత్తిని వీడలేక, మరో పనిచేయలేక జీవన పోరాటం సాగిస్తున్నామని కుమ్మరి కులస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం కొందరు మట్టి గణనాథులు కావాలని ముందుకు వస్తున్నారని, వీటిని సైతం తయారు చేసి విక్రయిస్తున్నామని చెప్పారు.

ఖర్చులు పెరిగాయి



వినాయక విగ్రహాల తయారీలో వినియోగించే ముడిసరుకుల ధరలు పెరిగాయి. రవాణా ఖర్చులు సైతం వీటికి అదనం. ఖర్చులు రెట్టింపయ్యింది. తయారు చేసిన విగ్రహాలు అమ్ముడుకాకపోతే అప్పుల్లో కూరుకుపోవాల్సిన పరిస్థితి.

-జి.ఏడుకొండలు, కుమ్మరిబంజరి గ్రామం

ప్రభుత్వం ఆదుకోవాలి

చేతివృత్తుల వారికి ప్రభుత్వం ఆదుకోవాలి. ఈ సీజన్‌లో విగ్రహాల తయారీకి వినియోగించే ముడిసరుకులను ప్రభుత్వం పంపిణీ చేస్తే మేలు కలుగుతుంది. ప్రభుత్వం రుణాలు అందించి ఆదుకోవాలి.

- గంగారపు రాము, కుమ్మరిబంజర గ్రామం


ఫుట్‌బాల్ ఆడుతున్న విజయనగరం, నెల్లిమర్ల జట్లు

ఫుట్‌బాల్ మ్యాచ్ విజేత విజయనగరం

నెల్లిమర్ల: నెల్లిమర్లలోని తామస్‌పేట ఫుట్‌బాల్ మైదానంలో బుధవారం ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్ నిర్వహించారు. విజయనగరం టౌన్ స్పోర్టింగ్ క్లబ్ జట్టు నెల్లిమర్ల ఎన్‌ఆర్‌ఎఫ్‌సీ జట్టుపై 2-1 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బొమ్మన రామారావు, శివాజీ, సురేష్‌బాబు, గురుమూర్తి తదితరులు విజేతలను అభినందించారు.

ఐటీడీఏ పీవోకు సీనియర్ టైమ్‌స్కేల్

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లక్ష్మీశా 2013 ఐఏఎస్ బ్యాచ్ కావడంతో ఆయనకు సీనియర్ గ్రేడ్ పాయింట్‌ను ప్రభుత్వం కల్పించింది. ఆయనకు ఈ ఏడాది జనవరి నుంచి జీతం పెరగటంతో పాటు గ్రేడ్ పాయింట్ లభిస్తుంది. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి సీనియర్ టైమ్ స్కేల్‌ను ప్రభుత్వం మంజూరు చేస్తూ జీవో నెంబర్ 1859ని ఇటీవల విడుదల చేసింది.

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోండి

కలెక్టరేట్: ఆర్మీ ర్యాలీలో పాల్గొనున్న అభ్యర్థులు వచ్చే నెల 20వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సెట్విజ్ సీఈవో సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడ్మిట్ కార్డులు వచ్చేనెల 20 తర్వాత జారీ చేస్తామన్నారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. వివరాలకు 08922-273768 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సమస్యలపై 11 ఫిర్యాదులు

రింగురోడ్డు:జిల్లాలో విద్యుత్ సమస్యలపై దాసన్నపేటలోని విద్యుత్ భవనంలో బుధవారం విద్యుత్ అదాలత్‌ను ఎస్‌ఈ ఎన్.గంగాధర్ నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల నుంచి పలు సమస్యలపై 11 ఫిర్యాదులు స్వీకరించారు. నెల్లిమర్ల, గుర్ల మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేయాలని, డెంకాడ మండలం మోదవలస గ్రామంలో సర్వీసు పునరుద్ధరణ, డి2 సెక్షన్‌లో కరెంటు బిల్ ఎక్కువ వచ్చిందని, మీటరు కాలిపోయిన స్థానంలో కొత్తది మంజూరు చేయాలని, జమ్ము నారాయణపురంలో ప్రైవేటు భూమిలో విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని, గంట్యాడ సెక్షన్‌లో కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందంటూ ఫిర్యాదులు అందాయి. వీటిని ఎస్‌ఈ గంగాధర్ తీసుకుని సంబంధిత అధికారులకు చర్యల నిమిత్తం ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి లోపాలు వచ్చినా ప్రతి బుధవారం నిర్వహించే విద్యుత్ అదాలత్‌కు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయాలని, తక్షణం సమస్యలు పరిష్కరిస్తామని ఎస్‌ఈ తెలిపారు.

బీజేఎంఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా 'కోరాడ'

పార్వతీపురం టౌన్: భారతీయ జనతా మజ్దూర్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పార్వతీపురం పట్టణానికి చెందిన జిల్లా టెలికాం డైరెక్టర్, బీజేఎంఎం జిల్లా అధ్యక్షుడు కోరాడ సత్యనారాయణ ఎంపికయ్యారు. కోరాడ సత్యనారాయణ అన్నవరం నుంచి బుధవారం విలేఖరులతో ఫోన్‌లో మాట్లాడారు. అన్నవరంలో జరిగిన రాష్ట్ర భారతీయ జనతా మజ్దూర్ మెర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తనను బీజేఎంఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ సుబ్బారావులు నియామకపత్రాన్ని అందజేశారని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా భారతీయ జనతా మజ్దూర్ మోర్చా అధ్యక్షుడిగా ఉంటూ విస్తృతంగా సేవలందించినందుకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించినట్లు తెలిపారు. ఇక నుంచి భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్న బీజేఎంఎం అధ్యక్షుడు సుబ్బారావు, ఎమ్మెల్సీ మాధవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


సత్యనారాయణకు నియామక పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

● ఏయూ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పర్యాటక అభివృద్ధిపై పూర్తిస్థాయి దృష్టి సారించి ఆదాయ వనరులు పెరిగేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళిక తయారు చేస్తున్నామని ఆంధ్రాయూనివర్శిటీ రిజిస్ట్రార్ వి.ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం ఏయూ కళాశాల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు 1980 నుంచి ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఏటా సెప్టెంబరు 27న నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఏయూ ఆధ్వర్యంలో ఔత్సాహిక విద్యార్థులకు పోస్టర్ పెయింటింగ్, పేపర్ ప్రజెంటేషన్, క్విజ్ కాంపిటేషన్, టూరిజం, ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఏయూకు అప్పగించిన బాధ్యతలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పర్యాటక రంగంపై అభివృద్ధికి పాటు పడతామన్నారు. ఇప్పటి వరకూ డెంపిల్ టూరిజంపై ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం మాదిరిగానే పర్యాటక టూరిజానికి ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 1972 కిలోమీటర్లు మేర సముద్ర తీరం ఉందన్నారు. జిల్లాలోని పలు ప్రదేశాల్లో ఉన్న చారిత్రాత్మక కట్టడాలను గుర్తించి అభివృద్ధి చేసేందుకు ఎటువంటి కార్యక్రమాలు చేపట్టాలన్నా దానిపై అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి చర్చిస్తున్నామన్నారు. కార్యక్రమం అనంతరం వరల్డ్ టూరిజం సెలబ్రేషన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కామర్స్ ప్రొఫెసర్ ఎన్.సాంబశివరావు, సైకాలజిస్టు సూర్యనారాయణ, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్, తదితరులు

ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించండి

● కలెక్టర్ వివేక్‌యాదవ్ ● కలెక్టరేట్‌లో చేనేత వస్త్ర విక్రయ కేంద్రం ప్రారంభం


విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్:కలెక్టరేట్‌లో చేనేత వస్త్ర విక్రయ కేంద్రాన్ని కలెక్టరు వివేక్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రభుత్వ ఉద్యోగులు చేనేత వస్త్రాలు ధరించాలని సర్క్యులర్ జారీ చేశామన్నారు. విక్రయ కేంద్రాన్ని 34 శాఖలకు చెందిన అధికారులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ దుస్తుల వినియోగం వల్ల 32 రకాలు ప్రాణాంతక రసాయనాల నుంచి తప్పించుకోవచ్చన్నారు. భారతీయ సంస్కృతిని, సంప్రదాయలను భావి తరాలకు అందజేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్లు లఠ్కర్, నాగేశ్వరరావు, డీఆర్వో ఆర్ఎస్ రాజకుమార్, కలెక్టరేట్ ఏవో రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్:జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న మత్స్యకార బాలుర గురుకులంలో 5,6 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు అందజేయాలని నెల్లిమర్ల బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జిల్లా కన్వీనర్ కె.గణేష్ తెలిపారు. ఈవిద్యా సంవత్సరంలో ఈ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని తెలిపారు. 5,6 తరగతుల్లో ప్రవేశాలకు మత్స్యకార బాలుర నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. దరఖాస్తులను నెల్లిమర్ల బీసీ గురుకులు పాఠశాలలో పొందవచ్చని, పూర్తి చేసినవి ఈనెల 30లోగా అందజేయాలన్నారు. వివరాలకు 9866559616 గల ఫోన్ నెంబరుకు సంప్రదించాలని కోరారు.

‘బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017’విజేత?

1. 2017కి గాను ‘మాలతి చందూర్’ సాహిత్య పురస్కారానికి ఎంపికైనది?
ఎ) రంగనాయకమ్మ బి) కనపర్తి వరలక్ష్మి
సి) శివరాజు సుబ్బలక్ష్మి
డి) యద్దనపూడి సులోచనరాణి

2. కమ్యూనికేషన్ రంగంలో విశిష్ఠ సేవలందించి నందుకు ‘మార్కోని సొసైటీ జీవన సాఫల్య పురస్కారం-2017’కి ఎంపికైన ఇండో అమెరికన్?
ఎ) థామస్ కైలత్ బి) శంకర్ సుబ్రమణ్యం
సి) వెంకట్రామన్ రామకృష్ణన్
డి) పురుషోత్తందాస్ మహర్

3. ఎకనమిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ 140 దేశాలపై నిర్వహించిన సర్వేలో 2017కిగాను అత్యంత నివాసయోగ్య నగరంగా తొలిస్థానంలో నిలిచింది?
ఎ) వాంకోవర్(కెనడా) బి) గ్విమాసున్(చైనా)
సి) వియన్నా(ఆస్ట్రియా) డి) మెల్‌బోర్న్(ఆస్ట్రేలియా)

4. షాంఘై ర్యాంకింగ్ కన్సల్టెన్సీ 2017కిగాను ప్రకటించిన ‘అకడమిక్ ర్యాంకింగ్స్ ఆఫ్ వరల్డ్ యూనివర్సిటీ’ నివేదికలో తొలిస్థానం పొందింది?
ఎ) హార్వర్డ్ యూనివర్సిటీ(అమెరికా)
బి) సింగువా యూనివర్సిటీ(చైనా)
సి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అమెరికా)
డి) టోక్యో యూనివర్సిటీ(జపాన్)

5. 2017 ఆగస్టు 17న రక్షణ శాఖ రూ.4168 కోట్లతో ఆరు అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. వీటి తయారీ సంస్థ బోయింగ్ ఏ దేశానికి చెందింది?
ఎ) ఇటలీ బి) జర్మనీ సి) అమెరికా డి) ఫ్రాన్స్

6. ‘బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017’ పురుషుల సింగల్స్ విజేత?
ఎ) పీటర్ గేడ్(డెన్మార్క్) బి) లక్ష్యసేన్(ఇండియా)
సి) లిన్‌డాన్(చైనా)
డి) జ్వోనిమిర్ దుర్కిన్‌జాక్(క్రొయేషియా)

7. ఫోర్బ్స్ పత్రిక-2017కిగాను ప్రకటించిన అత్యధిక రెమ్యూనరేషన్ పొందుతున్న హీరోయిన్ల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) జెన్నిఫర్ లోపెజ్ బి) జెన్నిఫర్ అనిస్టోన్
సి) అలిసియ వికెండర్ డి) ఎమ్మాస్టోన్

8. ఇండియాటుడే ఇటీవల భారత ప్రధానుల సమర్థతపై ‘మూడ్ ఆఫ్ ద నేషన్’ పేరిట నిర్వహించిన సర్వేలో 33 శాతం ఓట్లతో అత్యంత సమర్థుడైన ప్రధానిగా నిలిచింది?
ఎ) అటల్ బిహారి వాజ్‌పేయి
బి) జవహర్‌లాల్ నెహ్రూ
సి) ఇందిరాగాంధీ డి) నరేంద్రమోదీ

9. మదర్సాల ఆన్‌లైన్ నమోదుకు ఇటీవల ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) గుజరాత్ బి) ఉత్తరప్రదేశ్
సి) బిహార్ డి) కేరళ

10. ఇన్ఫోసిస్ ఎం.డి. విశాల్‌సిక్కా రాజీనామాతో తాత్కాలిక ఎం.డి.గా ఎవరు నియమితులయ్యారు?
ఎ) ప్రవీణ్‌రావు బి) సంజయ్ బంగా
సి) సబీర్ భాటియా
డి) విజయ్ శేఖర్ శర్మ

11. తెలంగాణలో తొలి స్మార్ట్ పోలీస్‌స్టేషన్‌ను 2017 ఆగస్టు 18న ఎక్కడ ప్రారంభించారు?
ఎ) జమ్మికుంట(కరీంనగర్) బి) బెజ్జంకి(సిద్దిపేట)
సి) నవిపేట(నిజామాబాద్)
డి) దోమకొండ(నిజామాబాద్)

12. 2017 ఆగస్టు 19న మహిళ భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన టోల్‌ఫ్రీ నంబరు?
ఎ) 181 బి) 1551 సి) 112 డి) 999

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

13. ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ అందించే ‘వ్యవసాయ నాయకత్వ అవార్డు-2017’కి ఎంపికైనది?
ఎ) శివరాజ్‌సింగ్ చౌహాన్(మధ్యప్రదేశ్)
బి) నితిష్ కుమార్(బీహార్)
సి) కె.చంద్రశేఖర్‌రావు(తెలంగాణ)
డి) విజయన్(కేరళ)

14. 2017కి గాను ఫోర్బ్స్ పత్రిక ప్రకటించిన అత్యధిక ఆదాయం గల మహిళ క్రీడాకారుల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) సెరెనా విలియమ్స్(టెన్నిస్)
బి) మరియ మజుచిక్(చెస్)
సి) పి.వి.సింధు(బ్యాడ్మింటన్)
డి) స్మృతి మందన(క్రికెట్)

15. ‘ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్- 2017’కి ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) కౌలాలంపూర్(మలేషియా)
బి) గ్లాస్గో(బ్రిటన్) సి) బ్యాంకాక్(థాయ్‌లాండ్)
డి) హంగ్జే(చైనా)

16. ఎవరి జయంతిని పురస్కరించుకొని ఆగస్టు 20ని ‘సద్భావన దివస్’గా నిర్వహిస్తారు?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) రాజీవ్‌గాంధీ
సి) ఇందిరాగాంధీ డి) పండిట్ రవిశంకర్



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

17. భారత నౌకా దళానికి చెందిన ఆరుగురు మహిళ అధికారులు ప్రపంచ యాత్ర లక్ష్యంగా చేపట్టిన ‘నావికా సాగర్ పరిక్రమ’ ప్రాజెక్టులో ఉపయోగిస్తున్న నౌక?
ఎ) ఐఎన్ఎస్‌వి తరిణి
బి) ఐఎన్ఎస్‌వి మహదేవి
సి) ఐఎన్ఎస్‌వి సింధురక్షక్
డి) ఐఎన్ఎస్‌వి తలాష్

18. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా విడుదల చేయనున్న రూ.50 నోటుపై ఉన్న చిహ్నం ‘సాంస్కృతిక రథాన్ని’ ఎక్కడి నుంచి గ్రహించారు?
ఎ) జైపూర్(రాజస్థాన్) బి) హంపి(కర్ణాటక)
సి) శ్రావణబెళగొళ(కర్ణాటక) డి) పింప్రి(మహారాష్ట్ర)

19. ‘నికోలాయ్ కుదాషెవ్’ ఇటీవల ఏ దేశం తరపున భారత్‌లో రాయబారిగా నియమితులయ్యారు?
ఎ) రష్యా బి) మంగోలియా
సి) కజకిస్థాన్ డి) ఇజ్రాయెల్

20. భారత్‌లో పాకిస్తాన్ నూతన హైకమిషనర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
ఎ) అబ్దుల్ బాసిత్ బి) మలీహాలోధి
సి) సోహైల్ మహమ్మద్ డి) రియాల్ షరీఫ్

21. పి.ఆర్.శేషాద్రి ఇటీవల ఏ బ్యాంక్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు?
ఎ) కెనరా బ్యాంక్ బి) లక్ష్మీవిలాస్ బ్యాంక్
సి) బ్యాంక్ ఆఫ్ బరోడా డి) కరూర్ వైశ్యా బ్యాంక్

22. 2017కిగాను ‘స్పానిష్ సూపర్ కప్’ ఫుట్‌బాల్ టోర్నీ విజేత?
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్ బి) బార్సిలోనా క్లబ్
సి) ఇంగ్లీష్ ప్రీమియర్ క్లబ్ డి) రివర్ప్లేట్ క్లబ్

23. 2017 ఆగస్టులో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏ దేశాన్ని ‘పోలియో రహిత దేశం’గా ప్రకటించింది?
ఎ) సెనెగల్ బి) కాంగో
సి) సోమాలియా డి) పాకిస్తాన్

24. ‘అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీ-2018’కి ఆతిథ్యం ఇస్తున్న దేశం?
ఎ) ఆస్ట్రేలియా బి) న్యూజిలాండ్
సి) ఇండియా డి) శ్రీలంక

25. భారత వ్యవసాయ శాఖ 2016-17కి గాను విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి(మిలియన్ టన్నుల్లో)
ఎ) 110.15 బి) 384.76 సి) 314.16 డి) 275.68

26. భారత్ ఏ దేశంతో కుదుర్చుకొన్న మేథోహక్కుల పరస్పర అవగాహన ఒప్పందాన్ని కేంద్ర కేబినెట్ ఇటీవల ఆమోదించింది?
ఎ) ఆస్ట్రియా బి) స్వీడన్ సి) ఫ్రాన్స్ డి) అమెరికా

27. హిందుస్తాన్ కాపర్ లిమిటెడ్ నూతన చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్?
ఎ) సంతోష్‌శర్మ బి) మన్నెల్లి లక్ష్మీకాంతం
సి) సంజయ్‌గుప్తా డి) హర్షకుమార్ భన్వాల్

28. ఇటీవల విడుదలైన ‘ఇండియా ఎట్ 70; స్నాప్ షాట్ సిన్స్ ఇండిపెండెన్స్’ పుస్తక రచయిత?
ఎ) ఎన్.సి.ఉల్లేఖ్ బి) రోషెన్ దలాల్
సి) అమృత పర్గీస్ డి) అరుంధతిరాయ్

29. మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ‘నమో యువ రోజ్‌గార్ కేంద్ర’ ప్రధాన ఉద్దేశం?
ఎ) యువ పారిశ్రామికవేత్తలకు రుణసౌకర్యం
బి) ఆర్గానిక్ కూరగాయలను తక్కువ ధరకు ప్రజలకు చేరువ చేయడం
సి) యువజన సంఘాల ఏర్పాటు ద్వారా ఐక్యత పెంపొందించడం
డి) రాష్ట్ర నిర్మాణంలో యువత నైపుణ్యాల వినియోగం

30. 2017 ఆగస్టు 18న దోమలను నిరోధించే ప్రత్యేక రైలును ప్రవేశపెట్టిన నగరం?
ఎ) ఢిల్లీ బి) బెంగళూరు
సి) చెన్నై డి) కోయంబత్తూర్

31. కేంద్రమంత్రి స్మృతి ఇరాని ప్రారంభించిన చేనేత ఉత్పత్తి, ఎగుమతి సంస్థ ‘ఒరియంట్ క్రాఫ్ట్ లిమిటెడ్’ ఏ రాష్ట్రానికి చెందింది?
ఎ) ఛత్తీస్‌గఢ్ బి) జార్ఖండ్ సి) మధ్యప్రదేశ్ డి) కేరళ

32. ‘ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సెల్ 2017 ఆగస్టులో ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో తొలిస్థానం పొందిన బ్యాట్స్‌మన్?
ఎ) కేన్ విలియమ్సన్ బి) షకిబుల్ హసన్
సి) విరాట్ కోహ్లి డి) ఎవరూ కాదు

33. శ్రీలంక నేవీ చీఫ్‌గా నియమితులైన తమిళ సంతతి వ్యక్తి?
ఎ) కదిరగామర్. ఆర్ బి) డబ్ల్యూ.హెచ్.పెరెర
సి) పెరియార్ మురుగన్ డి) ట్రావిస్ సిన్నిహ్

34. ఎదగకుండా జన్మించిన శిశువుల పరిరక్షణ కోసం కృత్రిమ గర్భసంచిని రూపొందించింది?
ఎ) యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా
బి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా
సి) టోక్యో యూనివర్సిటీ, జపాన్ డి) ఎ, సి

35. స్కూల్ టీచర్ల కోసం ‘మేఘశాల’ అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) రాజస్థాన్ బి) తమిళనాడు
సి) కర్ణాటక డి) హర్యానా

క్రీడా పురస్కారాలు

36. 2017కిగాను ‘రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, అర్జున’ అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) ఎస్.కె.శర్మ బి) సి.కె.ఠక్కర్
సి) మేరీకోం డి) కరణం మల్లీశ్వరి

37. 2017కిగాను ‘ధ్యాన్‌చంద్, ద్రోణాచార్య’ అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) మేరీకోం బి) కరణం మల్లీశ్వరి
సి) అభినవ్ బింద్రా డి) పుల్లెల గోపీచంద్

38. 2017కిగాను ‘రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న’కి ఎంపికైన పారా అథ్లెట్ దేవేంద్ర ఝఝూరియ ఏ క్రీడకు చెందిన వ్యక్తి?
ఎ) హైజంప్ బి) టెన్నిస్
సి) జావెలిన్ త్రో డి) షాట్‌పుట్

39. దేవేంద్రతోపాటు 2017కిగాను ‘ఖేల్‌రత్న’ పొందిన మరో క్రీడాకారుడు?
ఎ) ఎస్.ఎస్.పి.చౌరాసియా - గోల్ఫ్
బి) సర్దార్‌సింగ్ - హాకీ
సి) జ్యోతిసురేఖ - షూటింగ్
డి) విరాట్ కోహ్లి - క్రికెట్

40. 2017కిగాను ‘ధ్యాన్‌చంద్’ అవార్డుకి ఎంపికైన ముగ్గురిలో లేనిది?
ఎ) సత్తిగీత - అథ్లెటిక్స్
బి) భూపేందర్‌సింగ్ - అథ్లెటిక్స్
సి) సయ్యద్ షాహిద్ హకీం - ఫుట్‌బాల్
డి) సుమరయి టెటె - హాకీ

41. 2017కిగాను ‘ద్రోణాచార్య’ అవార్డుకి ఎంపికైన ఏడుగురిలో మరణానంతరం పొందిన వ్యక్తి?
ఎ) హీరానంద్ కటారియా - కబడ్డీ
బి) బ్రిజ్‌భూషణ్ మహంతి - బాక్సింగ్
సి) పి.ఎ.రాఫెల్ - హాకీ
డి) డాక్టర్ ఆర్.గాంధీ - అథ్లెటిక్స్

42. 2017కిగాను ‘అర్జున’ అవార్డు పొందిన 17 మందిలో సరైన వారిని గుర్తించండి?
1. ప్రశాంతసింగ్ - బాస్కెట్ బాల్
2. చటేశ్వర్ పుజారా - క్రికెట్
3. ఎస్.వి. సునీల్ - హాకీ
4. మరియప్పన్ తంగవేలు - పారా అథ్లెట్
5. వరుణ్ సింగ్ బాటి - పారా అథ్లెట్
6. సాక్షి మాలిక్ - రెజ్లింగ్
ఎ) అన్నీ సరైనవే
బి) 6 మినహా అన్నీ సరైనవే
సి) 1, 2, 4 సరైనవి డి) 2 మాత్రమే సరైనది

సమాధానాలు

1) సి	7) డి	13) సి	19) ఎ	27) ఎ	35) సి
2) ఎ	8) డి	14) ఎ	20) బి	28) బి	36) బి
3) డి	9) బి	15) బి	21) డి	29) బి	37) డి
4) ఎ	10) ఎ	16) బి	22) ఎ	30) ఎ	38) సి
5) సి	11) ఎ	17) ఎ	23) సి	31) బి	39) బి
6) బి	12) ఎ	18) బి	24) బి	32) సి	40) ఎ
			25) డి	33) డి	41) డి
			26) బి	34) డి	42) బి

JOBS ఉద్యోగాలు

బిసిపిఎల్

గెయిల్ ఇండియా లిమిటెడ్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, న్యూమలీఘర్ రిఫైనరీ లిమిటెడ్, అసోం ప్రభుత్వం ఉమ్మడిగా నిర్వహిస్తున్న బ్రహ్మపుత్ర క్రాకర్ & పాలిమర్ లిమిటెడ్ (బిసిపిఎల్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 14

పోస్టులు - ఖాళీలు: సీనియర్ మేనేజర్(హెచ్ఆర్)2, మేనేజర్(కెమికల్ 2, ఎఫ్& ఎ 1), డిప్యూటీ మేనేజర్(కెమికల్ 2, హెచ్ఆర్ 1), సీనియర్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్ 1, ఇన్‌స్ట్రుమెంటేషన్ 1, మెకానికల్ 1), సీనియర్ ఆఫీసర్(లా 1, మార్కెటింగ్ 2)

అర్హత: పోస్టును అనుసరించి 50 శాతం మార్కులతో డిగ్రీ/ ఎంబిఏ/(పీజీ/ పీజీ డిప్లొమా)(పర్సనల్ మేనేజ్‌మెంట్/ పర్సనల్ మేనేజ్‌మెంట్& ఇండస్ట్రియల్ రిలేషన్స్)/ ఎల్ఎల్‌బి/ ఎల్ఎల్ఎం/ బిటెక్(కెమికల్/ పెట్రో కెమికల్/ కెమికల్ టెక్నాలజీ/ పెట్రో కెమికల్ టెక్నాలజీ/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్/ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్/ మెకానికల్/ ప్రొడక్షన్/ ప్రొడక్షన్ & ఇండస్ట్రియల్/మాన్యుఫ్యాక్చరింగ్/ మెకానికల్ & ఆటోమొబైల్)/ సీఏ/ ఐసిడబ్ల్యుఏ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: పోస్టును అనుసరించి 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.200

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 21

వెబ్‌సైట్: www.bcplonline.co.in

ఎన్‌బిసిసి

ఎన్‌బిసిసి ఇండియా లిమిటెడ్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 94

పోస్టులు - ఖాళీలు: జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 1, అడిషనల్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 2, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 6, ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్) 5, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్ 10, ఎలక్ట్రికల్ 5), డిప్యూటీ మేనేజర్(లా) 2, అసిస్టెంట్ మేనేజర్(లా 2), సీనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్(సివిల్ 10, ఎలక్ట్రికల్ 3), అసిస్టెంట్ మేనేజర్(హెచ్ఆర్ఎం 2, రాజ భాష 2), జూనియర్ ఇంజనీర్(సివిల్ 40, ఎలక్ట్రికల్ 4)


ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 26

వెబ్‌సైట్: www.nbccindia.com

సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?

ఆధునిక భారతదేశ చరిత్ర

1. 'నాకు రక్తమివ్వండి. మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అని ప్రకటించిన జాతీయోద్యమ నేత?
ఎ) భగత్‌సింగ్ బి) చంద్రశేఖర్ అజాద్
సి) సుభాష్ చంద్రబోస్ డి) ఖుదీరాంబోస్
2. 1897 జనవరి 23న సుభాష్ చంద్రబోస్ జన్మించిన ప్రాంతం?
ఎ) కలకత్తా బి) కాన్పూర్ సి) ఢాకా డి) కటక్
3. సుభాష్ చంద్రబోస్ జన్మించిన భవనం నేడు చారిత్రక ప్రాధాన్యత పొందింది. దాని పేరు?
ఎ) ప్రగతి భవన్ బి) జానకీనాథ్ భవన్
సి) జననీ భవన్ డి) జాగృతి భవన్
4. ఐసిఎస్ ఉద్యోగాన్ని వదులుకొని సుభాష్ చంద్రబోస్ జాతీయోద్యమంలోకి ప్రవేశించిన సంవత్సరం?
ఎ) 1919 బి) 1920 సి) 1921 డి) 1922
5. సుభాష్ చంద్రబోస్ వ్యక్తిత్వంపై ప్రభావం చూసిన జాతీయోద్యమ నేత?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) చిత్తరంజన్ దాస్
సి) బిపిన్ చంద్రపాల్ డి) గాంధీజీ
6. గాంధీజీని జాతిపితగా అభివర్ణించిన జాతీయ నాయకుడు?
ఎ) గోపాలకృష్ణ గోఖలే బి) రవీంద్రనాథ్ ఠాగూర్
సి) సిఆర్.దాస్ డి) సుభాష్ చంద్రబోస్
7. సుభాష్ చంద్రబోస్ ఏ ఉద్యమం ద్వారా జాతీయోద్యమంలో ప్రవేశించారు?
ఎ) చంపారన్ సత్యాగ్రహం
బి) ఖిలాఫత్ ఉద్యమం
సి) సహాయనిరాకరణ ఉద్యమం
డి) ఉప్పు సత్యాగ్రహం
8. గాంధీజీ ఏ ఉద్యమంలో చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రను సుభాష్ చంద్రబోస్ నెపోలియన్స్ ఎల్బాదీవి నుంచి చేపట్టిన యాత్రతో పోల్చారు?
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) ఉప్పు సత్యాగ్రహం సి) వ్యక్తి సత్యాగ్రహం
డి) క్విట్ ఇండియా ఉద్యమం
9. సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?
ఎ) గాంధీజీ బి) నెహ్రూ
సి) సి.ఆర్.దాస్ డి) బిపిన్ చంద్రపాల్
10. ఏ జాతీయ కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షుడిగా బోస్ 1938లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు?
ఎ) కలకత్తా బి) లక్నో
సి) బొంబాయి డి) హరిపురి
11. ప్రణాళిక సంఘాన్ని స్థాపించి, భారతదేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సూచించింది?
ఎ) గాంధీజీ
బి) మోక్షగుండం విశ్వేశ్వరయ్య
సి) సుభాష్ చంద్రబోస్
డి) నెహ్రూ


ఎస్. రాజా చక్రధర్
సీనియర్ ఫ్యాకల్టీ

12. గాంధీజీ బలపర్చిన భోగరాజు పట్టాభి సీతారామయ్యను బోస్ ఏ కాంగ్రెస్ సమావేశంలో ఓడించారు?
ఎ) త్రిపురి బి) హరిపురి
సి) కలకత్తా డి) లక్నో
13. సుభాష్ చంద్రబోస్ 'ఫార్వర్డ్ బ్లాక్' రాజకీయ పార్టీని ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1937 బి) 1938 సి) 1939 డి) 1940



14. ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టేందుకు బోస్ గృహనిర్బంధం నుంచి తప్పించుకొని భారత్‌ను వదిలిన సంవత్సరం?
ఎ) 1939 బి) 1940 సి) 1941 డి) 1942
15. కాబూల్, మాస్కో మీదుగా బోస్ ఏ నగరానికి చేరుకొన్నాడు?
ఎ) బెర్లిన్ బి) పారిస్ సి) లిస్బన్ డి) జెనీవా
16. సుభాష్ చంద్రబోస్ ఏ దేశంలోని రేడియో కేంద్రం ద్వారా భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు?
ఎ) రష్యా బి) ఫ్రాన్స్ సి) జర్మనీ డి) జపాన్
17. భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి సాయం చేస్తామని బోస్‌కు హామీ ఇచ్చిన దేశం?
ఎ) జర్మనీ బి) జపాన్ సి) రష్యా డి) ఏదీకాదు
18. టోక్యోలో సుభాష్ చంద్రబోస్‌తో చర్చలు జరిపిన 'టోజో' ఏ పదవిలో ఉన్నారు?
ఎ) జపాన్ అధ్యక్షుడు బి) ప్రధాన మంత్రి
సి) సైన్యాధికారి డి) విదేశాంగ మంత్రి
19. 1943 నుంచి సుభాష్ చంద్రబోస్ ఏ దేశంలో తన సైనిక కార్యక్రమాలు ప్రారంభించారు?
ఎ) జర్మనీ బి) జపాన్
సి) సింగపూర్ డి) ఇండోనేషియా
20. 'భారత జాతీయ సైన్యం' ఏర్పాటుకు పునాది వేసింది?
ఎ) కెప్టెన్ మోహన్‌సింగ్
బి) రాజ్‌బిహారీ బోస్
సి) ఖుదీరాంబోస్ డి) ఎవరూ కాదు
21. 1942లో టోక్యోలో ప్రవాస భారతీయ సమావేశాన్ని ఏర్పాటు చేసింది?
ఎ) కెప్టెన్ మోహన్‌సింగ్ బి) లాల్ హరిదయాళ్
సి) సుభాష్ చంద్రబోస్ డి) రాజ్‌బిహారీ బోస్
22. సుభాష్ చంద్రబోస్ 'అజాద్ హింద్ ఫౌజ్'ను ఎక్కడ వ్యవస్థీకరించారు?
ఎ) టోక్యో బి) బెర్లిన్ సి) సింగపూర్ డి) మాస్కో

జనరల్ స్టడీస్ - ఇండియన్ హిస్టరీ

23. అజాద్ హింద్ ఫౌజ్‌లోని మహిళ రెజిమెంట్‌కి గల పేరు?
ఎ) ఝూన్సీరాణి రెజిమెంట్
బి) దుర్గావతి రెజిమెంట్
సి) రాణి అబ్బక్క రెజిమెంట్
డి) మహిళశక్తి రెజిమెంట్
24. భారత జాతికి సుభాష్ చంద్రబోస్ అందించిన నినాదాలు?
ఎ) జైహింద్ బి) చల్లో ఢిల్లీ సి) డూ ఆర్ డై డి) ఎ, బి
25. మొట్టమొదటి భారత ప్రభుత్వాన్ని నేతాజీ ఎక్కడ ఏర్పాటు చేశారు?
ఎ) టోక్యో బి) రంగూన్
సి) సింగపూర్ డి) మలేషియా
26. నేతాజీ ఏర్పాటు చేసిన భారత ప్రభుత్వాన్ని గుర్తించిన తొలి దేశం?
ఎ) రష్యా బి) జర్మనీ సి) జపాన్ డి) ఏదీకాదు
27. 1943లో టోక్యోలో జరిగిన తూర్పు ఆసియా దేశాల సమావేశానికి సుభాష్ చంద్రబోస్ ఏ హోదాలో హాజరయ్యారు?
ఎ) భారత సైన్యాధినేత బి) విదేశాంగ ప్రతినిధి
సి) భారత ప్రభుత్వాధినేత డి) ఏదీకాదు
28. అజాద్ హింద్ ఫౌజ్ పాలన కిందకి వచ్చిన తొలి భారత భూభాగం?
ఎ) అండమాన్ నికోబార్ దీవులు బి) నాగాలాండ్
సి) మణిపూర్ డి) సిక్కిం
29. అండమాన్ నికోబార్ దీవులకు సుభాష్ చంద్రబోస్ పెట్టిన పేరు?
ఎ) స్వరాజ్ దీవులు బి) షాహీద్ దీవులు
సి) అజాదీ దీవులు డి) ఎ, బి
30. సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో జాతీయ సేనకు, బ్రిటీష్‌వారికి మధ్య ప్రత్యక్ష యుద్ధం జరిగిన సంవత్సరం?
ఎ) 1943 బి) 1944 సి) 1945 డి) 1946
31. బ్రిటీష్‌వారిని ఓడించి ఆజాంద్ హింద్‌ఫౌజ్ జాతీయ పతాకాన్ని ఎక్కడ ఎగురవేసింది?
ఎ) మౌఢక్ బి) మయన్మార్
సి) అండమాన్ దీవులు డి) ఏదీకాదు
32. ఆంగ్లేయుల నుంచి జాతీయ సైనం స్వాధీనం చేసుకొన్న ప్రాంతాలు?
ఎ) మౌఢక్ బి) కోహిమా సి) ఇంఫాల్ డి) పైవన్నీ
33. భారత జాతీయ సైన్యం సాగించిన సమరం ఆగిపోవడానికి కారణం?
ఎ) జపాన్‌పై అమెరికా అణుదాడి
బి) బ్రిటీషర్లు రంగూన్‌ను ఆక్రమించడం
సి) జపాన్ సైనికుల తిరోగమనం
డి) పైవన్నీ
34. తైవాన్ దీవుల్లో సుభాష్ చంద్రబోస్ ప్రయాణించే విమానం ప్రమాదానికి గురైన సంవత్సరం?
ఎ) 1945 ఆగస్టు 15 బి) 1946 ఆగస్టు 16
సి) 1946 ఆగస్టు 17 డి) 1946 ఆగస్టు 18
35. బ్రిటీషర్లకు బంధీలుగా చిక్కి ఎర్రకోటలో న్యాయ విచారణ ఎదుర్కొన్న జాతీయ సైన్యం ప్రతినిధులు?
ఎ) షాన్‌వాజ్‌ఖాన్ బి) కల్నల్ టి.కె.షెనగల్
సి) బి.ఎస్.ధిల్లాన్ డి) పైవారందరూ
36. భారత సైనికాధికారుల తరపున వాదించి, వారి విడుదలకు తోడ్పడినవారు?
ఎ) బల్లూభాయ్ దేశాయ్ బి) అసఫ్ అలీ
సి) తేజ్ బహదూర్ సప్రూ డి) పైవారందరూ

సమాధానాలు

1) సి	6) డి	11) సి
2) డి	7) సి	12) ఎ
3) బి	8) బి	13) సి
4) ఎ	9) ఎ	14) సి
5) బి	10) డి	15) ఎ

16) సి	23) ఎ	30) బి
17) బి	24) డి	31) ఎ
18) బి	25) సి	32) డి
19) సి	26) సి	33) డి
20) ఎ	27) సి	34) డి
21) డి	28) ఎ	35) సి
22) సి	29) డి	36) డి

JOBS ఉద్యోగాలు

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ - **గ్రౌండ్ డ్యూటీ** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఖాళీలు: 28 **కాంట్రాక్ట్ వ్యవధి:** అయిదేళ్లు
పోస్టులు - ఖాళీలు: మేనేజర్(ఫ్లయిట్ డిస్పాచ్) 14, మేనేజర్(ఆపరేషన్ ఎక్స్‌ప్యాట్ సెల్) 1, సీనియర్ ఆఫీసర్(ఫ్లయిట్ డిస్పాచ్) 6, ఆఫీసర్ - కాక్ పిట్ 1, అసిస్టెంట్ టెక్నికల్ (లైబ్రరి) 1, డిప్యూటీ మేనేజర్(ఫ్లయిట్ సేఫ్టీ) 1, సీనియర్ ఆఫీసర్(ఫ్లయిట్ సేఫ్టీ) 1, సింథటిక్ ఫ్లయిట్ (ఇన్‌స్ట్రక్టర్) 2, అసిస్టెంట్ ట్రైనింగ్ 1
వయసు: 21 ఏళ్లు
అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్(ఎంపిసి) / డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అదనపు అర్హతల వివరాలకోసం వెబ్‌సైట్‌లోని ప్రకటన చూడవచ్చు.
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపాలి
దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ: ఆగస్టు 31
చిరునామా: The Chief of HR, Air India Express Limited, Airlines House, Durbar Hall Road, Near Gandhi Square, Kochi 682016
వెబ్‌సైట్: www.airindiaexpress.in

సిఇఐఎల్

సర్టిఫికేషన్ ఇంజనీర్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(సిఇఐఎల్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
మొత్తం ఖాళీలు: 23
పోస్టులు - ఖాళీలు: ఇంజనీర్స్(క్యూసీ/ క్యూఏ) 4, సీనియర్ ఇంజనీర్స్ (క్యూసీ/ క్యూఏ) 5, డిప్యూటీ మేనేజర్ (క్యూసీ/ క్యూఏ) 5, ఇంజనీర్ స్పెషలిస్ట్ 6, సీనియర్ ఇంజనీర్ స్పెషలిస్ట్ 2, ఆఫీసర్ 1
అర్హత: పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో బిఇ/ బిటెక్(మెకానికల్/ ప్రొడక్షన్/ మెటలర్జికల్)/ఎంబిఏ(హెచ్‌ఆర్)/ పీజీ(పర్సనల్ మేనేజ్‌మెంట్ & లేబర్ వెల్ఫేర్) ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి
వెబ్‌సైట్: www.ceil.co.in

ఎన్ఐసిఇడి

కోల్కతాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలరా & ఎంటరిక్ డిసీజెస్(ఎన్ఐసిఇడి)- కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 19
మెడికల్ ఎపిడెమియోలజిస్ట్(సైంటిస్ట్ సి)
ఖాళీలు: 1
అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణతతోపాటు పబ్లిక్ హెల్త్ రీసెర్చ్ విభాగంలో ఆరేళ్ల అనుభవం ఉండాలి.
సీనియర్ రీసెర్చ్ ఫెలో(మెడికల్) **ఖాళీలు:** 12
అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణులై ఉండాలి
సీనియర్ రీసెర్చ్ ఫెలో(నాన్ మెడికల్) **ఖాళీలు:** 1
అర్హత: 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.
ఫీల్డ్ కన్సల్టెంట్ / మేనేజర్ **ఖాళీలు:** 1
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
డేటా మేనేజర్ **ఖాళీలు:** 1
అర్హత: (డిగ్రీ/ పీజీ)(కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి/ కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో అయిదేళ్ల అనుభవం ఉండాలి.
అసిస్టెంట్ డేటా మేనేజర్/ డేటా సెక్రటరీ
ఖాళీలు: 1
అర్హత: డిగ్రీ(కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి/ కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణత + కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలి.
అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ / అకౌంటెంట్ **ఖాళీలు:** 2
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత విభాగంలో అయిదేళ్ల అనుభవం ఉండాలి.
ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 5
వేదిక: National Institute of Cholera & Enteric Diseases, (NICED II Building within ID & BG Hospital Campus), 57, Beliaghata Main Road, Kolkata - 700010
వెబ్‌సైట్: www.niced.org.in/

ఎన్‌సిఇఆర్‌టి - డిఇఇ

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సెల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ & ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఇఇ)- తాత్కాలిక ప్రాతిపదికన **జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో**ల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. **ఖాళీలు: 6**
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో పీజీ(ఎడ్యుకేషన్/ ఇంగ్లీష్/ మేథమెటిక్స్/ మేథమెటిక్స్ ఎడ్యుకేషన్/ ఇంగ్లీష్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 40 ఏళ్లలోపు ఉండాలి.
వేతనం: నెట్ అర్హత పొందిన అభ్యర్థులకు నెలకు రూ.16,000 కాగా నెట్ స్కోరు లేని అభ్యర్థులకు రూ.14000
ఇంటర్వ్యూ తేదీ: ఆగస్టు 29
వేదిక: Department of Elementary Education(DEE), 4th Floor, Room No. 415, G.B Pant Block, NCERT, Sri Aurobindo Marg, New Delhi- 110016
వెబ్‌సైట్: www.ncert.nic.in

సూక్తి

సేవను మించిన ఆనందం లేదు
సంతోషాన్ని మించిన సంపద లేదు

టంగ్ ట్విస్టర్స్

1. Rory the warrior and Roger the worrier were reared wrongly in a rural brewery.
2. Chester Cheetah chews a chunk of cheep cheddar cheese.
3. Real rock wall, real rock wall, real rock wall
4. A gazillion gigantic grapes gushed gradually giving gophers gooey guts.

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : ఏ రోజు పని ఆ రోజే చేయడం ఉత్తముల లక్షణం. అర్థమైందా?
బంటు : అర్థమైంది టీచర్. రేపటి హోంవర్క్ రేపే చేయాలి. ఈ రోజు కాదు!
టీచర్ : !!!!!!!!

ఓటమే లేకుండా..

ఏ ఆటలోనైనా గెలుపు-ఓటములు తప్పవు. కానీ కెరీర్ మొదలుపెట్టిన నాటి నుంచి ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా విజయాలు సాధించడం మామూలు విషయం కాదు. పుణేకు చెందిన జూనియర్ గోల్ఫర్ ఆర్యమన్ సింగ్ అదే చేసి చూపించాడు . నాలుగేళ్లుగా విజయాలే సాధిస్తూ దూసుకుపోతున్నాడు. 'ఇండియన్ గోల్ఫ్ యూనియన్- వెస్ట్ జోన్' అందించే 'ఆర్డర్ ఆఫ్ మెరిట్'ను వరుసగా మూడు సార్లు సాధించాడు. జోనల్ లెవల్‌లోనూ, జాతీయ స్థాయిలోనూ ఈ జూనియర్ గోల్ఫర్‌కు తిరుగులేదు. జూనియర్ గోల్ఫ్ చరిత్రలో 1,266 రోజులుగా ఓటమి ఎరుగని అజేయుడిగా నిలిచి సరికొత్త రికార్డు సాధించాడు.



ఆర్యమన్ సింగ్ వయసు పదేళ్లు. ప్రొఫెషనల్ ప్లేయర్‌గా గోల్ఫ్ ఆడటం మొదలెట్టి నాలుగేళ్లు అవుతోంది. జోనల్ లెవల్‌లో ఇంతవరకు ఆర్యమన్‌కు తిరుగులేదు. ఈ ఛోటా గోల్ఫర్ తన కెరీర్‌లో ఒక్క మ్యాచ్‌ను కూడాచేజార్చుకోలేదు. 1,266 రోజులుగా తన విజయ యాత్ర కొనసాగిస్తూ జూనియర్ లెవల్ గోల్ఫ్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు.

'నా నాలుగో ఏట నుంచి గోల్ఫ్ ఆడటం మొదలుపెట్టాను. రెండు సంవత్సరాల పాటు గోల్ఫ్ సాధన చేశాను. ఆట గురించే ఎప్పుడూ ఆలోచించేవాడిని. జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయుల్లో జరిగే ప్రతి గోల్ఫ్ టోర్నమెంట్‌లో పాల్గొనేవాడిని. అహ్మదాబాద్‌లోని 'కెన్స్‌విల్లే గోల్ఫ్ కోర్సు'లో జరిగిన మ్యాచ్‌లో తొలిసారిగా విజయం సాధించాను. ఆనాటి నుంచి ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తూ వస్తున్నాను. మూడేళ్లుగా 'జస్టిన్ పార్కన్స్' నాకు కోచింగ్ ఇస్తున్నాడు. గోల్ఫ్ క్రీడలో పేరుగాంచిన మార్క్ రోయ్, డేవిడ్ స్టాక్టన్, విజయ్ దివెచ వంటి దిగ్గజాల దగ్గర ఎన్నో మెలకువలు నేర్చుకున్నాను. నేనింకా గోల్ఫ్ నేర్చుకునే దశలోనే ఉన్నాను. భవిష్యత్తులో ఈ క్రీడలో మరింత రాణించాలని అనుకుంటున్నాను. నాకు గోల్ఫ్‌తో పాటు క్రికెట్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నిస్ క్రీడలంటే కూడా ఎంతో ఇష్టం. సమయం చిక్కితే అవి కూడా ఆడుతుంటాను. టీవీ చూస్తాను. స్కూల్‌వర్క్ కంప్లీట్ చేసుకున్న తర్వాతే ఆటలు ఆడతాను'

- ఆర్యమన్



ఔనా!

ఉడుము ఊపిరి తీసుకోకుండా నీటిలో అరగంట పాటు ఉండగలదు.



చుక్కలు కలపండి



మీకు తెలుసా?




58 శాతం మంది మహిళలు ప్రతిరోజూ నెయిల్ పాలిష్ వేసుకుంటారని ఓ అధ్యయనంలో తేలింది.

రంగులు వేయండి



బొమ్మ గీయండి



జంబ్లింగ్ వర్డ్స్


ఈ కింది పదాలను సరిచేయండి

1. KJOE ....
2. HAET ....
3. THBA ....
4. RSHU ....

చెప్పగలరా?

నాడిలో ఉన్నా కానీ కోడిలో లేను
జూలులో ఉన్నా కానీ జూన్‌లో లేను
గుడిలో ఉన్నా కానీ బడిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

దారి కనుక్కోండి



జవాబులు

చెప్పగలరా? : నాలుగు
జంబ్లింగ్ వర్డ్స్ :
1. JOKE 2. HATE/HEAT 3. BATH 4. RUSH



దోమల మందును పిచియారీ చేస్తున్న దృశ్యం

ముమ్మరంగా దోమల నివారణ మందు పిచికారీ

పెదగుడబ (గరుగుబిల్లి): వర్షా కాలంలో దోమలు విజృంభించకుండా గ్రామాల్లో ముమ్మరంగా యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దోమలపై దండయాత్ర కార్యక్రమంలో భాగం గా మురుగు కాల్వల్లో మందును పిచికారీ చేస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే దోమలతో పాటు వ్యాధులు దరిచేరవన్నారు. గృహాలకు ఆనుకుని కొబ్బరిబోండాలు, వాడిన టైర్లు, నిల్వ నీటి ప్రాంతాలు ఉండకూడదన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ఎన్.రజని సూచించారు. బుధవారం మండల ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న దృష్ట్యా సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. గ్రామ పరిధిలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి జ్వరాలు ఉన్నట్లయితే తక్షణమే చికిత్సలు అందించాలన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఎమ్మార్ టీకాలు వేసుకోని వారు ఉంటే గుర్తించి విధిగా టీకాలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కుమార్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



ఏఎన్ఎంలకు సూచనలిస్తున్న వైద్యాధికారి రజని

వేరుశనగ దిగుబడులకు కృషి

నర్సాపురం(రామభద్రపురం): వేరుశనగ పంటను జాగ్రత్తగా కాపాడుకుని అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులు శ్రద్ధ తీసుకోవాలని వ్యవసాయాధికారి అనురాధ పండా తెలిపారు. పొలం పిలుస్తోందిలో భాగంగా బుధవారం నర్సాపురం, దుప్పలపూడి గ్రామాల్లో వేరుశనగ రైతుల వ్యవసాయ క్షేత్రాలను సిబ్బందితో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ పూతదశలో జిప్సం వేయడం వలన ఊడలు బాగా దిగి నాణ్యత పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. తదుపరి వరినాట్లు పరిశీలించారు. 40 రోజులు దాటిన నారును ఉడిచేటప్పుడు ఆకు చివర్లను తుంచి నాటుకోవాలన్నారు. దీని వలన కాండం తొలుచు పురుగులు, ఆకుముడత రాకుండా రాదని తెలిపారు. కార్యక్రమంలో గ్రామాల రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



వేరుశనగ పంటలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

వేతనదారుల ఖాతాలు ఆన్‌లైన్ చేయండి

బాడంగి: పెండింగ్‌లో ఉన్న 2,972 కూలీలకు సంబంధించిన వేతనాలు, ఆధార్ లోపం వలన జమకావడం లేదని ఉపాధి ఏపీవో పెదప్పలనాయుడు అన్నారు. బుధవారం క్షేత్ర సహాయకులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న వేతనదారుల వివరాలు అందజేశారు. సోమవారం లోపు ఆధార్‌తో బ్యాంకు ఖాతాలు సరిచేయాలని సూచించారు. ప్రస్తుతం వ్యవసాయ పనుల వలన కూలీలు ఉపాధి పనులు లేవని, నెలాఖరు నుంచి మళ్లీ పూర్తిస్థాయిలో ఉపాధి పనులకు వేతనదారులు హాజరవుతారని తెలిపారు.

మహనీయుల త్యాగాలు మరువరాదు

నారాయణప్పవలస(బొబ్బిలి రూరల్): దేశం కోసం జీవితాలను త్యాగం చేసిన మహనీయుల సేవలను నిరంతరం స్మరించుకుని వారి బాటలో నడవాలని నారాయణప్పవలస పాఠశాల హెచ్ఎం జెసీ రాజు తెలిపారు. నారాయణప్పవలస ప్రాథమికోన్నత పాఠశాల్లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీలకు ఎదురుగా గుండె వడ్డి ఆంధ్రకేసరి అని పేరు పొందారన్నారు.

ఎత్తిపోతలపై కదలిక

● సర్వేకు నీటి పారుదలశాఖ బృందం

కుదమ (జియ్యమ్మవలస): గిజబ సమీపంలో ఎత్తిపోతల పథకానికి కదలిక వచ్చింది. బుధవారం నీటి పారుదలశాఖ డీఈ ఎస్.పాండురంగారావు ఆధ్వర్యంలో బృందం వచ్చి సర్వే చేసింది. ఈ సందర్భంగా డీఈ పాండురంగారావు మాట్లాడుతూ గ్రావిటీ పథకం ద్వారా నీరు ఎంత ఇవ్వగలం, ఎత్తిపోతల పథకం ద్వారా అయితే ఏ మేరకు సాగునీరు అందించగలం అనేది సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. తోటపల్లి బ్యారేజీ ద్వారా గిజబ వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తే జియ్యమ్మవలస మండలంలో పెదకుదమ, చినకుదమ, గౌరీపురం, టీఎన్ వలస గ్రామాలతో పాటు గరుగుబిల్లి మండలంలో నాగూరు, సంతోషపురం, ఖడ్గవలస, తోటపల్లి గ్రామాలకు చెందిన 8 వేల ఎకరాలకు సాగునీరందనుంది. ఈ బృందంలో ఏఈలు శ్రీనివాసరావు, ఎస్.మధుసూదనరావు, రాకేశ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంతోషపురం సర్పంచ్ అంబటి గౌరునాయుడు, పల్ల శివున్నాయుడు, రైతులు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న నీటి పారుదలశాఖ బృందం

పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటుపై దృష్టి

● పశు సంవర్ధకశాఖ ఏడీ ప్రసాద్

నాగూరు (గరుగుబిల్లి): పశుగ్రాసం కొరత ఉన్న గ్రామాల్లో క్షేత్రాలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ కె.ప్రసాద్ అన్నారు. బుధవారం నాగూరులో రైతులకు అవగాహన కల్పిస్తూ క్షేత్రాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఔత్సాహికులను ఎంపిక చేసి సామాజిక పశుగ్రాస సాగుకు అనువైన భూములను గుర్తిస్తున్నామన్నారు. ప్రస్తుతం మేర కొరత కారణంగా పశువులను కబేళాలకు తరలిస్తున్నారన్నారు. మండలంలో 27 ఎకరాల్లో, జియ్యమ్మవలస మండలంలో 4 ఎకరాల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గరుగుబిల్లికి ఎకరాకు రూ. 18 వేలు, జియ్యమ్మవలసలో రూ. 15 వేలు చొప్పున లీజు ధర నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో నాగూరు పశు వైద్యాధికారి ఎస్.సురేష్ కుమార్ పాల్గొన్నారు.



పశుగ్రాసం పెంపకానికి భూమిని పరిశీలిస్తున్న దృశ్యం

రైతులకు అందుబాటులో మైక్రో ఇరిగేషన్ పథకం

● పథక సంచాలకులు పాండురంగ

గరుగుబిల్లి: రైతులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు జిల్లా సూక్ష్మ నీటిసాగు పథకం ప్రాజెక్టు డైరెక్టర్ బి.పాండురంగ అన్నారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండేందుకు ప్రతి సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో సమస్యలు తెలుసుకొనేందుకు, అలాగే సూచనలు, సలహాలు అందించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. రెవెన్యూశాఖ నిర్వహిస్తున్న రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమంలో ప్రతి గురు, శుక్రవారాల్లో ఏర్పాటు చేసిన గ్రామాల్లో సిబ్బంది పాల్గొనేలా చర్యలు చేపడుతున్నామన్నారు. బిందు, తుంపర సేద్య పరికరాలు నిర్వహణపై అవగాహన, పరికరాలు కావలసిన వారికి అర్హత ప్రకారం మంజూరు ఉంటుందన్నారు. పథకాన్ని పూర్తిస్థాయిలో రైతులకు చేరువయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

సామూహిక సీమంతాల నిర్వహణ

కొట్టక్కి(రామభద్రపురం): కొట్టక్కి పంచాయతీలో ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు అయిన గర్భిణిలకు సాలూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గొడుగుల సావిత్రమ్మ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను గర్భిణిలు, బాలింతలు వినియోగించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు తీసుకోవాలన్నారు. కాయగూరలు, పప్పు దినుసులు బాగా వాడాలన్నారు.

పొలం పిలుస్తోందికి విశేష స్పందన

పీటీ మండ (జియ్యమ్మవలస): పీటీ మండ పంచాయతీ కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మండల వ్యవసాయాధికారి మూడడ్ల శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఈవో శ్రావణ్‌కుమార్, ఎంపీఈవోలు అప్పలనాయుడు రైతులకు వరి పండించడంలో మెలకువలు చెప్పారు. ముఖ్యంగా జింక్ లోపంతో ఆకులపైన మచ్చలు ఏర్పడతాయని, దీనిని నివారించడానికి లీటరు నీటికి 2 గ్రాముల జింక్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలని ఏఈవో శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆకు ముడత పురుగు నివారణకు ఎకరానికి 400 మిల్లీ లీటర్ల క్లోరోపైరిఫాస్‌ను వేసుకోవాలని అన్నారు. పురుగు ఆశించినప్పుడు యూరియా వేయరాదని, అలా చేస్తే పురుగు ఉధృతి ఎక్కువవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధర్మారావు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రావణ్‌కుమార్

మొండెంఖల్‌లో పారిశుధ్య పనులు

మొండెంఖల్ (కురుపాం రూరల్): మొండెంఖల్‌లో పారిశుధ్య పనుల చురుగ్గా సాగుతున్నాయి. వర్షాకాలం కావడంతో సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకరరావు ఆధ్వర్యంలో కాలువల్లో పూడికలు తీస్తున్నారు. అన్ని బోర్లు, నూతుల ప్లాట్‌ఫారాల వద్ద ఉండే చెత్తను తొలగిస్తున్నారు. దోమలు విజృంభించకుండా కాలువల్లో పిచికారీ చేస్తున్నారు. ప్రజలు వేడిచేసిన మంచినీటిని వినియోగించాలని, ఆహార పదార్థాలపై మూతలు వేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ ప్రజలను చైతన్యపరుస్తున్నారు.



మొండెంఖల్‌లో కాలువల్లో పూడికలు తీయిస్తున్న సర్పంచ్ గౌరీశంకర్

సర్వేను వేగవంతం చేయండి

గరుగుబిల్లి: గ్రామాల్లో గృహాలకు కొత్త కొలతలు వేసి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఎంపీడీవో జి.పార్వతి సూచించారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సర్వేకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. గృహాల పొడవు, వెడల్పును తీసి జియోట్యాగింగ్ చేయాలన్నారు. దీని ప్రకారం గృహాలకు ఇంటి నెంబర్‌ను కేటాయించనున్నట్టు చెప్పారు. అలాగే స్వచ్ఛభారత్‌లో ఓడీఎఫ్‌గా ఎంపిక చేసిన గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను అక్టోబర్ 2 నాటికి శత శాతం పూర్తికి దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శులు రంభ శశిభూషణరావు, కె.గౌరీశ్వరి, బి.భవాని, సాయి, కూర్మినాయుడు, వైకుంఠరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పార్వతి

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 7

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు భాగస్వామి సహకారం లభిస్తుంది. కృషి రంగంలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. సంకల్పం నెరవేరుతుంది. ప్రియతములతో విందు వినోదాల్లో పాల్గొంటారు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. క్యాటరింగ్, వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి అనుకూలం.

మిథునరాశి: (మే21-జూన్21): ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల రాకతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. బంధుమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ప్రోత్సాహకరం. సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): రవాణా, ఏజెన్సీలు, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. వ్యక్తిగత సౌకర్యాల కోసం ఖర్చు చేస్తారు. ఆర్థిక వ్యవహారాల్లో కొత్త ప్రయోగాలకు తగిన సమయం. సంకల్పం నెరవేరుతుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. రాజకీయ, సినీరంగాల వారికి ఉల్లాసంగా ఉంటుంది. ఒక సమాచారం ఆహ్లాదం కలిగిస్తుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం. సినీ, రాజకీయ, ఫొటోగ్రఫీ, ఎగుమతుల రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఒక సమాచారం ఉత్సాహం కలిగిస్తుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు సంబంధించిన పనులు పూర్తవుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరం సమావేశాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): వేడుకలు, సమావేశాల్లో ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బంధుమిత్రులతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పూర్వమిత్రులను కలుసుకుంటారు. లక్ష్య సాధనలో గత అనుభవం తోడ్పడుతుంది. ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం లభిస్తుంది. భాగస్వామి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆరోగ్యంపై దృష్టి సారించాలి. స్పెక్యులేషన్లు, పందాలు, పోటీల్లో పాల్గొంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

మొదటి పేజీ తరువాయి

ఇక అండర్ డ్రైనేజీ

ప్రాంతాల్లో కొత్తగా భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో విజయనగరం మినహా మిగిలిన ఎనిమిది నియోజవర్గాల్లోని ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి .. ప్రయోగాత్మకంగా భూ గర్భ మురుగు కాల్వల వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి ఏ గ్రామంలో ఎన్ని కిలోమీటర్ల పరిధిలో కాల్వ నిర్మాణం, అంచనా వ్యయం ఎంత వంటి అంశాలను ఉత్తర్వుల్లో పొందుపర్చింది. మొత్తంగా 82 కిలోమీటర్ల పొడవున్న కాల్వలు నిర్మించనుంది. ఇందుకోసం జిల్లా నుంచి వెళ్లిన అంచనాల మేర రూ.20.70 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఇందులో 70 శాతం నిధులు ఉపాధి హామీ నుంచి చెల్లిస్తారు. 10శాతం పంచాయతీలోని 14వ ఆర్థిక సంఘ నిధులు నుంచి.. మిగిలిన 20 శాతం నిధులు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ప్రభుత్వం మంజూరు చేయనుంది. ఎంపిక చేసిన గ్రామాల వివరాల్లోకి వెళితే..

● బొబ్బిలి నియోజకవర్గంలోని కారాడ గ్రామంలో ఐదు కిలోమీటర్ల భూగర్భ డ్రైనేజీ కాల్వలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి రూ.1.25 కోట్లు ఖర్చు కానుంది. ఇందులో ఉపాధి హామీ నుంచి రూ.87.50 లక్షలు, ఆర్థిక సంఘం నిధులు రూ.12.5 లక్షలు, పంచాయతీ రాజ్ నుంచి రూ.25 లక్షలు కేటాయిస్తారు.

● చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లిలో 9.23 కిలోమీటర్లు పొడవునా నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.1.64 కోట్లు ఉపాధి హామీ నిధులు, 23.5 లక్షల ఆర్థిక సంఘం నిధులు, రూ.47 లక్షలు పీఆర్ నుంచి మంజూరయ్యాయి.

● గజపతినగరం నియోజకవర్గం గజపతినగరంలో 7.5 కిలోమీటర్ల కాలువ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందులో రూ.1.33 కోట్లు ఉపాధి హామీ నిధులు, రూ.19 లక్షలు ఆర్థిక సంఘం, పీఆర్ నుంచి రూ.38 లక్షలు మొత్తంగా రూ.1.9 కోట్లు ఖర్చు చేయనున్నారు.

● కురుపాం నియోజకవర్గంలోని గుమ్మలక్ష్మీపురం ఎల్విన్‌పేటలో 12 కిలోమీటర్ల పొడవునా రూ.3 కోట్లు వ్యయంతో డ్రైనేజి నిర్మాణం చేపట్టనున్నారు. ఇందులో రూ.2.10 కోట్లు ఉపాధి హామీ, రూ.30 లక్షలు ఆర్థిక సంఘం, రూ.60 లక్షలు పీఆర్ నుంచి కేటాయిస్తారు.

● నెల్లిమర్ల నియోజవర్గంలోని పూసపాటిరేగ మండలం రెల్లివలస గ్రామంలో ఏడు కిలోమీటర్ల పొడవునా కాల్వ నిర్మాణం చేపడతారు. ఇందులో రూ.1.22 కోట్లు ఉపాధి హామీ, 17.5 లక్షలు 14వ ఆర్థిక సంఘ నిధులు, రూ.37.5 లక్షలు పీఆర్ నుంచి విడుదల చేస్తారు.

● పార్వతీపురం నియోజకవర్గంలోని నర్సిపురం గ్రామంలో ఆరు కిలోమీటర్ల పొడవునా కాల్వ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందు కోసం రూ.1.5 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో రూ.1.05 కోట్లు ఉపాధి హామీ, రూ.15 లక్షల ఆర్థిక సంఘ నిధులు, రూ.30 లక్షలు పీఆర్ నుంచి అందిస్తారు.



● సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ మండల కేంద్రంలో తొమ్మిది కిలోమీటర్ల భూ గర్భ డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం రూ.2.3 కోట్లు ఖర్చుకానుంది. రూ.1.61 కోట్లు ఉపాధి హామీ నుంచి, రూ.23లక్షలు ఆర్థిక సంఘ నిధుల నుంచి, రూ.46 లక్షలు పీఆర్ నుంచి సమకూర్చుస్తారు.

● ఎస్.కోట నియోజవర్గ పరిధిలోని ఎస్.కోటలో 26.5 కిలోమీటర్ల పొడవునా భూ గర్భ డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఇందుకు రూ.6.65 కోట్లు ఖర్చు కానుంది. రూ.4.67 కోట్లు ఉపాధి హామీ నుంచి, రూ.66లక్షలు ఆర్థిక సంఘ నిధుల నుంచి, రూ.1.33 కోట్లు పంచాయతీ రాజ్ శాఖ నుంచి సమకూర్చుస్తారు. ఇలా మొత్తంగా రూ.20.70 కోట్లతో 82 కిలోమీటర్ల మేర భూ గర్భ మురుగు కాల్వల నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

125 వసంతాల కన్యాశుల్కం

ఎంతో గుర్తింపు వచ్చిందన్నారు. ఈ గ్రంథం ఎంతోమందిలో సామాజిక చైతన్యం తీసుకువచ్చిందన్నారు. ఈ గ్రంథాన్ని రచించి ఆగస్టు నెలతో 125 సంవత్సరాలు పూర్తయ్యాయన్నారు. అందుకు గుర్తుగా ఈ నెల 26 నుంచి 28 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 26, 27 తేదీల్లో విశాఖపట్టణంలో వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 28న విజయనగరంలో సంస్కృతిక ప్రదర్శనలు, గురజాడ గృహం నుంచి ర్యాలీలు చేపడ్తామన్నారు. అదే రోజు గురజాడ రజత విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. గురజాడ కుటుంబీకులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని చెప్పారు.

పసిపాపపై అక్కృత్యం

గంట్యాడలో దారుణం

(గంట్యాడ)

గంట్యాడ మండలం కొత్తవెలగాడ గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎస్ఐ నారాయణరావు అందించిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన కె.శ్రీను(25) ఇంటిలో ఉన్న పసిపాపను ఆడించేందుకు పక్క ఇంటిలోని తొమ్మిదేళ్ల చిన్నారి రోజూ వెళ్లేది. ఈ నెల 20న (ఆదివారం)కూడా పాపను ఆడించేందుకు బాలిక వెళ్లింది. మద్యం మత్తులో ఉన్న యజమాని శ్రీను ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఆ చిన్నారి రెండు రోజుల పాటు ఎవరికీ చెప్పలేదు. బాలిక తీవ్రమైన నొప్పితో బాధ పడుతుండడంతో తల్లిదండ్రులు గుర్తించి...ఆరా తీశారు. దీంతో ఆ చిన్నారి తల్లిదండ్రులకు విషయం తెలియజేసింది. ఇది బయటకు పొక్కకుండా చేసేందుకు శ్రీను ప్రయత్నించాడని.. ఈ క్రమంలో నిందితుడి బంధువు ఒకరు బాలికకు చికిత్స అందించినట్టు తెలిసింది. బాధితురాలి తల్లిదండ్రులు ఈ దారుణాన్ని తమ బంధువుల దృష్టికి తీసుకువెళ్లడంతో అసలు విషయం బయటకు పొక్కింది. బాలిక తల్లి బుధవారం గంట్యాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ నారాయణ రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారిని చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాధితురాలికి న్యాయం చేయండి

అత్యాచారానికి గురైన బాలిక తండ్రికి రెండు కళ్లు కనిపించవు. తల్లిదండ్రులిద్దరూ అమాయకులు. కూలిపని చేసుకుని పిల్లలను పోషిస్తున్నారు. చిన్నారిపై దారుణానికి ఒడిగట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలి.

- కె. వెంకటరమణ, దివ్యాంగుల హక్కుల పోరాటం సంఘం నాయకులు.

సెప్టెంబర్, అక్టోబర్‌లో జాతీయ సర్వే పరీక్ష

శృంగవరపుకోట రూరల్: సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాల్లో 3,5,8 తరగతులకు జాతీయసాధిక సర్వేపరీక్ష ఉంటుందని విద్యాశాఖ సహాయసంచాలకులు రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం ధర్మవరం ఉన్నతపాఠశాలలో కొట్టాం పాఠశాలల పరిధిలో వున్న పాఠశాలలకు స్కూల్‌కాంప్లెక్స్ జరిగింది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు పలు అంశాలపై శిక్షణతోపాటు సర్వశిక్ష అభియాన్,రాష్ట్రవిద్యాపరిశోధన శిక్షణ మండలి ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ పరీక్ష విధానం గురించి రాజ్యలక్ష్మి వివరిస్తూ ఈపరీక్షను పిల్లలు పుస్తకాల ఆధారంగా కాకుండా వారి అవగాహన, అనువర్తనం, నైపుణ్యాలను పరీక్షించే విధంగా వుంటుందని తెలిపారు. విద్యాహక్కు చట్టాలను సవరించి అందులో గుణత్మక విద్యను చేర్చినట్టు తెలిపారు. ఇకనుంచి విద్యార్థుల్లో సామర్థ్యం ఆధారంగా బోధన జరపాలని సూచించారు.అనంతరం విద్యసంబంధిత విషయాలపై పలు సూచనలను, సలహాలను అందించారు. కార్యక్రమం అనంతరం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జన్మదిన వేడుకలను నిర్వహించారు.

గ్రామీణ వైద్యులకు గుర్తింపు హర్షణీయం

రింగురోడ్డు : గ్రామీణ వైద్యులకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపునివ్వడం ద్వారా గ్రామీణులకు వైద్య సేవలను మరింత చేరువ చేస్తోందని తెలుగునాడు ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేరి రామయ్యపంతులు అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామీణ వైద్యుల శిక్షణా తరగతులకు సంబంధించి జీవోను విడుదల చేయడం హర్షణీయమన్నారు. చట్టపరమైన అవరోధాలు తలెత్తకుండా ఉండేందుకు తొమ్మిది మంది సభ్యులతో కమిటీ కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఆరుమాసాల పాటు వైద్య కళాశాలలో ప్రతీ ఒక్కరికీ శిక్షణ ఇచ్చి మూడు నెలల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లోను, 104 సంచార వైద్య కేంద్రంలో పనిచేశాక ప్రత్యేకంగా నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ధ్రువ పత్రాలను కూడా మంజూరు చేసి విధి విధానాలను ప్రకటించాలన్నారు. ఈ మేరకు తెలుగునాడు కమ్యూనిటీ పారామెడికల్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సివిల్ వెంకటరావు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జనార్దన్‌లు గ్రామీణ వైద్య సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయడంపై కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అంకిత భావంతో పని చేసి వైద్యవృత్తికి మరింత గుర్తింపు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు పి.వి. గిరి, కె.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామయ్యపంతులు

చికెన్ ధరలు

	బాయిలర్	ఫారం
రిటైల్‌ధర	85	75
విత్‌స్కిన్	140	125
స్కిన్‌లెస్	150	147

కోడి గుడ్లు (నెక్)

విశాఖపట్నం	రూ.360
విజయనగరం	రూ.364
శ్రీకాకుళం	రూ.364

త్వరితగతిన పనులు పూర్తి చేయండి!

కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశం

విజయనగరం కలెక్టరేట్ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద వివిధ శాఖల అనుసంధానంతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని 13 జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం గ్రామీణ భివృద్ధిశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జవహర్‌బాబు, కమిషనర్ రామాంజనేయులుతో కలిసి ఆయన కార్యాలయం నుంచి కలెక్టర్ వివేక్‌యాదవ్‌తో వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద చేపట్టిన మరుగుదొడ్లు, ఉపాధి హామీ అనుసంధానంతో చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్లు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, శాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లతో పాటు జాతీయ రహదారి విస్తరణ భూసేకరణ, ఎన్టీఆర్ గ్రామీణ, పట్టణ గృహ నిర్మాణం తదితర పనుల ప్రగతిపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ పంచాయతీలో నర్సరీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ పరిధిలోని రహదారులకు ఇరువైపులా మొక్క లు నాటించాలని సూచించారు. విజయనగరంలో రాజపులోవ నుంచి రాయగడ్ నాలుగు రోడ్ల జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే.. తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలందరికీ సెప్టెంబరు 8లోగా తట్టు, రుబెల్లా టీకాలు వేయించే చర్యలు చేపట్టాలని సూచించారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేపట్టిన పనులను కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సీఎస్ ఆదేశించారు. వీడియో కాన్ఫెరెన్స్‌లో జేసీ శ్రీకేశ్ లఠ్కర్, జేసీ-2 కె.నాగేశ్వరరావు, జడ్పీ సీఈవో అనిత, ప్రత్యేక ఉపకలెక్టర్ శ్రీలత, సీపీవో విజయలక్ష్మి, డ్వామా, హౌసింగ్ పీడీలు కె.రామచంద్రరావు, రమణమూర్తి.. జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ, ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రమణమూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ, ఐసీడీఎస్ పీడీ ఎ.రాబర్ట్స్, మున్సిపల్ కమిషనర్ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్...హాజరైన కలెక్టర్ వివేక్‌యాదవ్ తదితరులు

ఆర్మ్‌డ్ సిబ్బంది 'సమస్యల పరిష్కారానికి కృషి'



మాట్లాడుతున్న ఎస్పీ పాలరాజు

విజయనగరం క్రైం: జిల్లాలో ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగరీత్యా ఇబ్బందులను తెలుసుకునేందుకు పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్ సిబ్బందితో జిల్లా ఎస్పీ పాలరాజు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్మ్‌డ్ సిబ్బంది పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. దూరప్రాంతాలకు సబ్‌జైల్, సెంట్రల్ జైల్ నుంచి ముద్దాయిలను విచారణ నిమిత్తం కోర్టులో హాజరు పర్చేందుకు తీసుకువెళ్లడం... మళ్లీ వారిని ఆయా జైల్‌కి అప్పగించడంలో శారీరక, భద్రతా దృష్ట్యా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఎస్పీకి వివరించారు. దీనిపై స్పందించిన ఎస్పీ... కోర్టు విచారణలను త్వరలో వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కొన్ని చోట్ల గార్డు డ్యూటీలు నిర్వహించే సిబ్బంది నిద్రించేందుకు కనీస సదుపాయాలు లేవని ఫిర్యాదు చేశారు. ఎస్కార్టు వాహనాలు బాగులేకపోవడంవల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోందని వివరించారు. ఇందుకు ఆయన.. సామర్థ్యం గల వాహనాలను ఉపయోగించాలని ఎంటీఆర్‌ఐను ఆదేశించారు. ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బంది, ఎఆర్ హెచ్‌సీలు, ఎఆర్ ఎస్‌ఐలకు విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక డార్మెటరీలను త్వరలో నిర్మించనున్నట్లుగా ఎస్పీ హామీ ఇచ్చారు. సమావేశంలో ఏఎస్పీ అడ్మిన్ ఎ.వి.రమణ, ఎఆర్ డీఎస్పీ హనుమంతు, ఆర్‌ఐలు ఎస్.వి. అప్పారావు, గురునాథరావు, శ్రీహరిరావు, రామకృష్ణ, జిల్లా పోలీసు అధ్యక్షుడు ఎం.వి.ఆర్. సింహాచలంతో పాటు పలువురు ఎఆర్ ఆర్ఎస్‌ఐలు , హెచ్‌సీలు, పీసీలు పాల్గొన్నారు.

పాల్తేరులో రైతు సేవలో రెవెన్యూ సదస్సు నేడు

బాడంగి: పాల్తేరులో గురువారం రైతుసేవలో రెవెన్యూ శాఖ గురువారం జరుగుతుందని తహసీల్దార్ జనార్దన రావు తెలిపారు. రెండురోజుల పాటు పాల్తేరులో గ్రామసభ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భూ సమస్యలపై రైతులు నేరుగా.. దరఖాస్తులు అందజేయవచ్చునని సూచించారు. భూమికి సంబంధివచిన సమస్యలు కాకుండా రేషన్‌కు సమస్యలు కూడా నివేదించవచ్చునని తహసీల్దార్ పేర్కొన్నారు. గ్రామసభకు వీఆర్వోలతో పాటు ఆర్ఐ చంద్రశేఖర్, సర్వేయర్లు అందుబాటులో ఉంటారని వివరించారు.

‘మట్టి వినాయకుడినే పూజిద్దాం..’



మాట్లాడుతున్న బేబినాయన

బొబ్బిలి: మట్టి వినాయకుడినే పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని బొబ్బిలి పురపాలక సంఘ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి, మాజీ చైర్మన్ బేబినాయన పిలుపునిచ్చారు. స్పార్క్, అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆరి గంగయ్య మున్సిపల్ కాంప్లెక్స్‌లో వారు వెయ్యి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పర్యావరణానికి ముప్పు లేకుండా మట్టితో కూడిన వినాయకులను అందరూ వినియోగించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వాడకం వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని వివరించారు. ఈనేపథ్యంలో వివిధ స్వచ్ఛంధ సంస్థలు పంపిణీ చేస్తున్న మట్టి విగ్రహాలకు పూజలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చోడిగంజి రమేష్ నాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్, అభిమాని ఫౌండేషన్ అధ్యక్షుడు రాజగోపాలనాయుడు, స్పార్క్ నిర్వాహకుడు పద్మనాభరాజుతో పాటు వార్డు కౌన్సిలర్ సాయిరమేష్, పార్వతీ, హైమావతి, నంబియార్ వేణుగోపాలరావు, శారద, తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక వేణుగోపాలస్వామి మండపంలో బుధవారం చెలికాని ట్రస్టు ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ ట్రస్టు చైర్మన్ చెలికాని అచ్యుతరావు మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలు పూజించి కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని ఆయన కోరారు.

● స్థానిక ఎమ్మార్సీ భవనంలో వనమిత్ర అధ్యక్షుడు కృష్ణదాస్ ఆధ్వర్యంలో బుధవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.జగన్నాథరావు మాట్లాడుతూ.. మట్టి విగ్రహాలకు పూజ చేయడం పవిత్రం.. పర్యావరణ హితం అన్నారు. జనవిజ్ఞాన అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ.. పర్యావరణం కాలుష్యం వల్ల వాతావరణంలో అనూహ్యమైన మార్పులు వచ్చి సకాలంలో కురవాల్సిన వర్షాలు దూరమవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను పూజ చేయాలని కోరారు. ఎంఈవో చల్లా లక్ష్మణరావు మాట్లాడుతూ... విద్యార్థులు తమ తల్లిదండ్రులకు మట్టి విగ్రహాలనే పూజించమని చెప్పాలని సూచించారు.

కార్యక్రమంలో వనమిత్ర కార్యదర్శి చుక్క శ్రీనివాసరావు, పీఆర్‌టీయు నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొట్టక్కిలో సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొట్టక్కి(రామభద్రపురం): కొట్టక్కి పంచాయతీలో ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సాలూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గొడుగుల సావిత్రమ్మ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా సావిత్రమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని గుర్తుచేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు జరిపించుకోవాలని హితవు పలికారు. బాలింతలకు, చంటి బిడ్డలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వేరుశనగ దిగుబడికి కృషి చేయండి



రైతులకు సూచనలిస్తున్న ఏవో

నర్సాపురం(రామభద్ర పురం): వేరుశనగ పంట జాగ్రత్తగా కాపాడుకుని అధిక దిగుబడులు సాధించే దిశగా వేరుశనగ రైతులు శ్రద్ధ తీసుకోవాలని వ్యవసాయాధికారి అనురాధ పండా సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం నర్సాపురం, దుప్పలపూడి గ్రామాల్లో వేరుశనగ రైతుల వ్యవసాయ క్షేత్రాలను సిబ్బందితో ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ పూతదశలో జిప్సం వేయడం వల్ల ఊడలు బాగా దిగి నాణ్యత పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. తదుపరి వరినాట్లు పరిశీలించారు. 40 రోజులు దాటిన నారును నాటేటప్పుడు ఆకు చివర్లను తుంచి నాటుకోవాలన్నారు. దీని వలన కాండం తొలుచు పురుగులు, ఆకుముడత తెగులు బాధ తప్పుతుందన్నారు.

గడ్డి విత్తనాల కోసం దరఖాస్తులు చేసుకోండి

బాడంగి: పాడిరైతులకు ప్రభుత్వం గడ్డి విత్తనాలను మంజూరు చేస్తోందని కావాల్సిన రైతులు దరఖాస్తులు చేసుకుంటే మంజూరు చేస్తామని పశువైద్యాధికారి కె.వెంకటరమణ తెలిపారు. గతేఏడాది బాడంగి, ముగడ, గొల్లాది, గజరాయనివలస గ్రామాలకు చెందిన రైతులకు గడ్డివిత్తనాలను అందజేయడం జరిగిందని గుర్తుచేశారు. ఈ ఏడాది ఎవరు దరఖాస్తు చేసినా మంజూరు చేస్తామని వివరించారు. పచ్చగడ్డి పాడి పశువులకు వేస్తే పాల దిగుబడి అధికంగా ఉండడంతో పాటు పశువులు ఆరోగ్యంగా ఉంటాయ ని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

1172 హెక్టార్లలో ఉభాలు

బాడంగి: బాడంగి మండలంలో 1172 హెక్టార్ల మేర ఇప్పటి వరకు వరినాట్లు పడ్డాయని వ్యవసాయాధికారి గోకులకృష్ణ తెలిపారు. గత వారంలో కురిసిన వర్షాల వల్ల రైతులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని వివరించారు. మెట్టుపంటలైన చెరకు, గోగు, వేరుశనగ పంటలు కూడా అనుకూలంగా ఉన్నాయని ఏవో పేర్కొన్నారు.

గ్యాస్ సమాచారం

ఈనెల 21న బుక్ చేసుకున్న బొబ్బిలి శ్రీవెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ పరిధిలో బొబ్బిలి రూరల్, బాడంగి, మక్కువ, తెర్లాం, సీతానగరం, రామభద్రపురం, బలిజిపేట మండలాల వినియోగదారులకు, ఈనెల 22న బుక్ చేసిన బొబ్బిలి పట్టణ వినియోగదారులకు బుధవారం గ్యాస్ సరఫరా చేస్తారు.

బొబ్బిలిలో సినిమాలు

సాయిగణపతి	- ఆనందో బ్రహ్మ
శ్రీవాసవి	- జయ జానకి నాయక
వెంకటకృష్ణ	- ఫిదా
వెంకటేష్	- ప్రేమించే పనిలో ఉన్నా
శ్రీలక్ష్మి	- నేనే రాజు నేనే మంత్రి

ఘనంగా ‘టంగుటూరి’ జయంతి



టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం

నారాయణప్పవలస (బొబ్బిలి రూరల్): నారాయణప్పవలస ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం జేసీ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో టంగుటూరి ప్రముఖ పాత్ర పోషించారని గుర్తుచేశారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీలకు ఎదురుగా గుండె ఎదురొడ్డి ఆంధ్రకేసరి గా పేరొందారని కొనియాడారు. టంగుటూరి ధైర్య సాహసాలు, పట్టుదల, కార్యదీక్షత విద్యార్థులు అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉపాధ్యాయులు కె.రమణమ్మ, జి.నాగరాజు, మురళీ, రాజు, సూర్యనారాయణతో పాటు అధికసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

‘మరుగుదొడ్లకు జియోట్యాగింగ్ తప్పనిసరి’

బొబ్బిలి రూరల్: వ్యక్తిగత మరుగుదొడ్లకు జియోట్యాగింగ్ తప్పనిసరి అని ఎస్ఈఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కెవీఎస్ఎస్ఎస్ఎన్ రమేష్ స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో పద్మజ ఆధ్వర్యంలో ఆరు మండలాలకు చెందిన ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇండియా యాప్ ఏర్పాటు చేసిందనీ.. అందులో ప్రతి మండలంలో మరుగుదొడ్ల వివరాలు నమోదు కావాల్సి ఉందన్నారు. దీనిపై క్షేత్ర సహాయకులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో కె.సుశీల, ఏపీఎం ఈశ్వరరావు, ఆయా మండలాలకు చెందిన ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

టెన్నీకాయిట్‌లో ‘యశ్వంత్’ ప్రతిభ

బొబ్బిలి: సబ్ జూనియర్ 32వ ఇంటర్ డిస్ట్రిక్ టెన్నీకాయిట్ టోర్నమెంట్‌లో గురుకుల పాఠశాల విద్యార్థి యశ్వంత్‌కుమార్‌న రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మిశ్రా తెలిపారు. ఈనెల 19 నుంచి 21 వరకు అనంతపురం జిల్లా కదిరి మండలంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొని విజేతగా నిలిచాడని పేర్కొన్నారు. ఈమేరకు యశ్వంత్‌కుమార్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

జింక్ పంపిణీ

బొబ్బిలి రూరల్: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధ వారం ఏవో ఎం.శ్యాంసుందరరావు ఆధ్వర్యంలో రైతులకు జింక్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరినాట్లు వేసిన 20 రోజుల్లోపు జింక్ స్ప్రే చేయాలని సూచించారు.

వేతనదారుల ఖాతాలను ఆన్‌లైన్ చేయండి

బాడంగి: మండలంలో పెండింగ్‌లోని 2972 ఉపాధి వేతనదారుల ఖాతాలు త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలని ఏపీవో పెదప్పలనాయుడు సిబ్బందిని ఆదేశించారు. ఈమేరకు బుధవారం ఆయన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సోమవారం లోపు ఆధార్ నెంబరుతో బ్యాంకు ఖాతాలు సరిచేయాలని ఆయన సూచించారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న ఎంఈవో

రామభద్రపురం: శ్రీ రామనగర్ కాలనీ ఎంపీపీఎస్ నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఎంఈవో తిరుమల ప్రసాద్,తో పాటు అక్కడి ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈమేరకు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు వెన్నెల వెంకటరావు, రమణ సేవలను ఎంఈవో తిరుమల ప్రసాద్ కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుందరీ, యూటీఎఫ్ నాయకులు విజ యగౌరి, ప్రసన్న కుమార్, ఎమ్మార్పీ కొల్లి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

వైసీపీ అభ్యర్థి గెలవాలని పూజలు



చిన్నమ్మతల్లికి ప్రత్యేక పూజలు

రామభద్రపురం: నంద్యాల ఉపఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శిల్పా మోహనరెడ్డి గెలవాలని స్థానిక వైసీపీ నాయకులు చిన్నమ్మతల్లి గుడిలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు పైడిరాజు మాట్లాడుతూ నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికలో కచ్చితంగా వైసీపీ గెలుస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మరిపి శ్రీనివాసరావు, పూడి సత్యం, వసంతల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

గుర్ల: లవిడాం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. వారితో పాటు రూ.12వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిసరాల్లో పేకాట ఆడుతున్నాను సమాచారం మేరకు దాడి చేశామని పోలీసులు తెలిపారు. ఇటీవల ఈ ప్రాంతంలో పేకాట, కోడి పందాలు ఎక్కువగా జరుగుతున్నట్లు సమాచారం ఉందని ఈ సందర్భంగా పోలీసులు పేర్కొన్నారు. ఈ తరహా అసాంఘిక కార్యకలాపాలను వీటిని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు వారు వెల్లడించారు.

25న అష్టగణపతి యాగ మహోత్సవం

గరివిడి: గరివిడిలోని సూర్యసదనంలో 25న అష్టగణపతి యాత్ర (యాగ) మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గురుపుత్రులు వేమకోటి సూర్యనారాయణ శర్మ తెలిపారు. శుక్రవారం ఉదయం 7:15 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

చంద్రన్న బీమా చెక్కుల పంపిణీ


బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

చీపురుపల్లి: చంద్రన్న బీమా చెక్కులను లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే కిమిడి మృణాళిని అందజేశారు. ఈమేరకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో 18 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద ప్రజలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో చంద్రన్న బీమా పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ బలగం కృష్ణమూర్తి, గరివిడి ఎంపీపీ పైల సింహాచలం, ఆర్ఈసీఎస్, ఏఎంసీ ఛైర్మన్లు దన్నాన రామచంద్రుడు, పేరిచర్ల సీతారామరాజు, టీడీపి గరివిడి మండల పార్టీ అధ్యక్షుడు పైల బలరాం తదిరులు పాల్గొన్నారు.

బీమా రెన్యువల్స్‌పై దృష్టి సారించండి..


చంద్రన్న బీమా పథకం రెన్యువల్స్‌పై బీమా మిత్రులు దృష్టి సారించాలని వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ ఎల్.రాజ్యలక్ష్మి సూచించారు. ఈమేరకు బుధవారం వెలుగు కార్యాలయంలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల, తెర్లాం, నెల్లిమర్ల మండలాల బీమా మిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గతంలో బీమా పరిధిలో లేనివారిని గుర్తించి వారికి విధిగా బీమా చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎంలు వై.ఎర్రినాయుడు, పి.నారాయణరావు, సిహెచ్.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

'మిలియన్ మార్చ్' విజయవంతం చేయండి


బైక్ ర్యాలీలో ఉద్యోగులు

చీపురుపల్లి: కంట్రిబ్యూటరీ పింఛన్ విధానానికి వ్యతిరేకంగా విజయవాడలో వచ్చేనెల 1 చేపట్టనున్న మిలియన్ మార్చ్‌ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయ సంఘాలు ఆధ్వర్యంలో 150 మంది ఉద్యోగులు బుధవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారుతుందని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సం ఘాల నాయకులు మీసాల అప్పలనాయుడు, గంగుపల్లి సత్యనారాయణ, వలిరెడ్డి రవీంద్రనాయుడు, లెంక చిరంజీవులు, సత్యనివాస్, పి.నరసింగ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఆంధ్ర కేసరి' జయంతి


టంగుటూరి చిత్రపటం ఎదుట నివాళి

చీపురుపల్లి రూరల్: పేరిపి ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలుత టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మీసాల అప్పలనాయుడుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సేంద్రియ ఎరువులపై ప్రభుత్వం దృష్టి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మృణాళిని

చీపురుపల్లి రూరల్: సేంద్రియ ఎరువులపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని చీపురుపల్లి ఎమ్మెల్యే డా. కిమిడి మృణాళిని తెలిపారు. కర్లాంలో ఘన వ్యర్థ నిర్వహణ కేంద్ర శిక్షణ తరగతులను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై దృష్టి సారించిందన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక శిక్షణ కేంద్రాన్ని ఆదర్శ కేంద్రంగా తయారు చేయడం జరుగుతుందన్నారు. మిగిలిన పంచాయతీలో సంపద తయారీ కేంద్రాలను నెలకొల్పి, శిక్షణ అందించడానికి ఏర్పాట్లు చేస్తోందన్నారు. శిక్షణ ఇచ్చేందుకు కర్లాం గ్రామం ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ పథకాలు విజయవంతం కావడానికి క్షేత్ర స్థాయిలో అందరి సహాయ సహకారాలు అవసరమన్నారు. అంతకు ముందు వ్యర్థాల సేకరణ, సేంద్రీయ ఎరువుల తయారీ తదితర అంశాలపై రిసోర్సు పర్సన్ సుప్రియ ఎమ్మెల్యే మృణాళినికి వివరించారు. ఈ సందర్భంగా సంపద కేంద్ర వద్ద ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ బలగం కృష్ణమూర్తినాయుడు, జడ్పీటీసీ సభ్యుడు మీసాల వరహాలనాయుడు, ఆర్ఈసిఎస్ ఛైర్మన్ దన్నాన రామచంద్రుడు, వైస్ ఛైర్మెన్ సారేపాక సురేష్ కుమార్, డీఎల్‌పీవో మోహనరావు, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దారు ఆర్ఆర్ఎల్ పాత్రో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, గరివిడి ఎంపీపీ పైల సింహాచలం, ఐసీడీఎస్ పీవో టి.ఎస్తేరురాణి, సర్పంచ్ బాణాన రామకృష్ణంనాయుడు, రెస్కో డైరెక్టర్ కెల్ల రామారావు, గరివిడి మండల పార్టీ అధ్యక్షుడు పైల బలరాం, అటవీ శాఖ బీవో ఉరిటి ప్రసాద్, ఎస్‌డబ్ల్యుపీసీ రిసోర్సు పర్సన్లు వర్మ, బీఎస్‌కెఎన్ పట్నాయక్, కె .శేషుబాబు ఉన్నారు.

వాట్సాప్‌లో సమాచారం పంపండి

మండల స్థాయి అధికారులు తమ పర్యటన వివరాలను తనకు వాట్సాప్ ద్వారా పంపించాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి మృణాళిని ఆదేశించారు. కర్లాంలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఇకపై ప్రతి శాఖాధికారి తన పర్యటన వివరాలు, ఏరోజుకారోజు తనకు పంపించాలన్నారు. ఈ విషయాన్ని అధికారులెవరూ నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఐసీడీఎస్ అధికారులు తనకు పంపిస్తున్న వివరాల వల్ల లోపాల సవరణకు తనకు అవకాశం కలిగిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు.

'చవితి' ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు



పట్టణంలోని వినాయకుడి మండపం... గరివిడిలో తయారు చేస్తున్న మట్టి విగ్రహాలు

చీపురుపల్లి: వినాయక చవితి ఉత్సవాలకు చీపురుపల్లి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పలుచోట్ల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక యువత వివిధ ఆకృతుల్లో గణనాధుడిని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసవ బారీ సెట్టింగులు వేస్తున్నారు. ప్రత్యేక ఆకర్షణలతో మండపాలను ముస్తాబు చేస్తున్నారు. భారీ ఎత్తున విద్యుదీకరణకు ఏర్పాట్లు ఇప్పటికే మొదలపెట్టారు. అలాగే.. లావేరు రోడ్డులో, గులివిందాడ అగ్రహారంలో సుమారు చుట్టు పక్కల అరకిలోమీటరు వరకు లైట్ సెట్టింగ్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఏటా మండపాలకు ప్రత్యేకంగా కర్రలతో స్టేజ్, షెడ్డులు వేసేవారు. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా భారీగా మండపాలు ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే.. ఈ ఏడాది ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలకు బదులు పలు చోట్ల మట్టి విగ్రహాలు వినియోగానికి నిర్వాహకులు చొరవ చూపిస్తున్నారు. స్థానికులు ప్రజలు కూడా ఈ పనుల్లో భాగస్వాములవుతున్నారు. మండలంలోని ముల్లుపేటలో ఏటా వినూత్నంగా మండపాలు వేసి ఉత్సవాలు జరపడం ఇక్కడ ఆనవాయితీ. గతేడాది వేసిన అమరావతి సెట్ అందరిని ఆకట్టుకుంది. అలాగే ఈ ఏడాది సరికొత్త నమూనాతో షెడ్డు వేస్తున్నారు.

మట్టి విగ్రహాలకు గిరాకీ

ఏటా ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రాహాలకే ఎక్కువ డిమాండ్ ఉండేది. దీని కోసం విజయనగరం వరకు వెళ్లి విగ్రహాలను కొనుగోలు చేసేవారు. మట్టి విగ్రహాలకు ఇళ్లలతో మాత్రమే పూజలు చేసేవారు. కానీ ఈ సారి పక్కనే గరివిడి పట్టణంలోని పెద్ద వినాయకుని విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఈ తరుణంలో మట్టి విగ్రహాలపై నిర్వాహకులు ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ మట్టి విగ్రహాల ఏర్పాటు చేయడం వల్ల బరువు తక్కువగా ఉండడంతో పాటు నిమజ్జనానికి కూడా సులువుగా ఉంటుందనేది వారి భావన.

మట్టి గణపతిని పూజిద్దాం..

గుర్ల: మట్టి వినాయకుడి పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం.. అని గుర్ల తహసీల్దార్ ఆదిలక్ష్మి, గుర్ల ఎస్ఐ రవి అన్నారు. ఈమేరకు బుధవారం గుర్లలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మట్టి వినాయకులు పంపిణీ చేశారు, ఆనందపురం యువత ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. రంగుల పూత ప్లాస్టిక్ వాడకం వలన వాతావరణం కలుషితం అవుతుందన్నారు. దీనివలన రానున్న రోజుల్లో అనారోగ్యాలు బారిన పడే ప్రమాదం ఉందని గుర్తుచేశారు. భవిష్యత్ అనర్థాల దృష్ట్యా ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలను వాడరాదని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కిలారి వెంకటలక్ష్మి, ఏపీడీ మురళీబాబు దాసరి ఈశ్వరరావు, బొద్దలరాము, పతివాడ సీతారాములు, జయంతి సాంబశివరావు ఉన్నారు.


వినాయక విగ్రహాల పంపిణీలో తహసీల్దార్, ఎస్ఐ తదితరులు

ఉపాధ్యాయులపై ఎంఈవో మండిపాటు


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈవో

గుర్ల: పనితీరు మెరుగుపర్చుకోవాలని లవిడాం పాఠశాల ఉపాధ్యాయులపై ఎంఈవో భానుప్రకాష్ మండిపడ్డారు. ఈమేరకు బుధవారం ఆయన లవిడాం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ ఉపాధ్యాయుల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో 71 విద్యార్థులకు గానూ ముగ్గురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇక్కడ ఉపాధ్యాయుల సమయపాలనపై తనకు ఫిర్యాదు అందిన నేపథ్యంలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం చూశారు. అంతా బాగున్నా.. పాఠశాలలో వంటశాల లేకపోవడంతో అక్కడ కట్టెల పొయ్యి నుంచి వెలువడే పొగ విద్యార్థులను చుట్టి ముటడంపై ఆందోళన వెలిబుచ్చారు. పొగ మధ్యలో పిల్లలు చదువులు సాగుతాయని ప్రశ్నించారు. ఇకనుంచి విద్యార్థుల బాగోగులపై నా దృష్టిసారించాలని సూచించారు.

సినిమాలు

చీపురుపల్లి

అనురాగ్	- జయ జానకీ నాయక
అమోగ్	- నేనే రాజు నేనే మంత్రి
వంశీ	- ఆనందో బ్రహ్మ
విష్ణు	- ఫిదా
నటరాజ్	- ప్రతి క్షణం

ఘనంగా టంగుటూరి ప్రకాశం జయంతి

లోగిశ (గజపతినగరం రూరల్): నవ్యాంధ్ర ఆవిర్భావ దినోత్సవంగా టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకలను బుధవారం లోగిశ గ్రామంలో బండారు బాలానంద సంఘం అధ్యక్షుడు బండారు చిన రామారావు నిర్వహించారు. గ్రామ పాఠశాలలో విద్యార్థులకు ఆంధ్రకేసరి టంగుటూరి జీవిత చరిత్రను వివరించారు. విద్యార్థులను ప్రతిభను గుర్తించి బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించే కథలు, నీతిపద్యాలు, ప్రముఖుల జీవిత చరిత్రలను బోధించారు. ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న రామకృష్ణ

మట్టి విగ్రహాలే ముద్దు



తయారు చేసిన మట్టి విగ్రహాలతో విద్యార్థులు

గంట్యాడ: పర్యావరణం పరిరక్షణకు అందరూ భాగస్వాయం కావాలని నందాం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయలు బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం పాఠశాలలోని విద్యార్థులకు తమన్నా ఫౌండేషన్, ఆదర్శ యువజన సంఘం అధ్వర్యంలో ఈ కార్యక్రమం మట్టితో వినాయ విగ్రహాల తయారీ నేర్పారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణానికి నష్టంవాటిల్లుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, రేవతి, శ్రీను, గ్రామస్థులు లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులకు చికిత్సనందిస్తున్న దృశ్యం

ఎం.గుమడాం (గజపతినగరం రూరల్): మండలంలోని ఎం. గుమడాం గ్రామంలో ఆయుష్, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యుడు ఎం. వెంకటనాగ్ 246మంది రోగులకు వైద్యపరీక్షలు జరిపి మందులను పంపిణీ చేశారు. ఆయుర్వేదిక పరీక్షలు కూడా జరిపి మందులను ఉచితంగా అందించారు. పరిసరాల్లోని మరుపల్లి, తమ్మారాయుడుపేట, మదుపాడతదిర గ్రామాలనుంచి రోగులు వచ్చారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి జి. త్రినాధరావు సంతోష్, గ్రామ పెద్దలు సన్యాసినాయుడురామునాయుడు పాల్గొన్నారు

వరుస వరినాట్లతో తెగుళ్ల నివారణ



నాట్లు వేసే విధానంపై సూచనలు ఇస్తున్న వ్యవసాయ సిబ్బంది

గంట్యాడ: బుడతనాపల్లి, చినామానపురం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతుల వరినాట్లపై వ్యవసాయ అధికారులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచనలందించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నాట్లు వేసే సమయంలో బాటలు తీయాలని సూచించారు. దీని వల్ల దోమ తెగులు ఆరికట్టవచ్చని సూచించారు. కలుపు తీయడానికి వీలుగా ఉంటుందన్నారు. మండల వ్యవసాయ అధికారి గ్రేష్ లత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్ వద్ద జామ్

- గజపతినగరంలో వర్షపు నీటితో అవస్థలు



నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిలిచిన వర్షపునీరు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడంతో స్థానికులతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిలిచిన నీటితో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలో ఇళ్ల నిర్మాణాలు, షాపుల కట్టడాల ఆక్రమణలతో సమస్యలు తలెత్తుతుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము సమస్య ఎ దుర్కొవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇక, రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉభాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే చెరువుల్లో నీరు చేరుకోవడంతో సాగునీరు ఇబ్బంది లేదని పలు గ్రామాలకు చెం దిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముందుగా ఉభాలు జరిగిన కొన్ని గ్రామాల్లో మరింతగా ఉపయోగంగా ఉంటాయని తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

గజపతినగరం రూరల్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి కె. రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద అగ్నిప్రమాదాలపై ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా వంట గ్యాస్ వలన ప్రమాదాలు సంభవించినప్పుడు గృహిణులు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో పలు సూచలనందించారు. గాలి, వెలుతురు తగిలేలా వంట గదులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్యాస్ సిలిండర్ లీకైనప్పుడు తక్షణమే అగ్నిమాపక కేంద్ర అధికారులకు సమాచారమందించాలన్నారు. గ్యాస్ లీక్ అయినప్పుడు ప్రమాద నివారణకు గోనె సంచులను సిలిండర్ పై ఉంచినట్లయితే కొంతమేర లీక్ అయ్యే అవకాశాలు తగ్గుతాయన్నారు. పాత సిలిండర్‌లను వినియోగించరాదని సూచించారు. సిలిండర్‌లను ఆటో, బస్సుల్లో తరలించరాదని తెలిపారు. అగ్ని మాపక సిబ్బంది, గ్యాస్ వినియోగదారులున్నారు.

అంగన్‌వాడీలు సక్రమంగా పనిచేయాలి



మాట్లాడుతున్న పీవో రమణమ్మ

గంగచోళ్లపెంట (గజపతినగరం రూరల్): అంగన్‌వాడీ కార్యకర్తలపై ఫిర్యాదులు వస్తే సహించేదిలేదని ఐసీడీఎస్ పీవో కె. రమణమ్మ హెచ్చరించారు. బుధవారం మండలంలోని గంగచోళ్లపెంటలో అంగన్‌వాడీ కేంద్రంలో అన్న అమృతహస్తం పథకం అమలు తీరును ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు అన్నఅమృత హస్తం పథకం ద్వారా పౌష్టికాహారం ఎలా అందిస్తున్నారో బాలింతలు, గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని వారిని రోజూ కేంద్రాలకు తీసుకు వచ్చి ఫీడింగ్ అందజేయాలన్నారు. కేంద్రాల్లో సమయవేళలు పాటించాలని సూచించారు. రోజూ రికార్డులను ఆన్‌లైన్‌చేయాలన్నారు. గుడ్లు పంపిణీపై ఆమె ఆరా తీశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో ఆదా



నీమాస్త్రం తయారీని వివరిస్తున్న ఏఓ రాజశేఖర్

మెంటాడ: పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు గణనీయంగా తగ్గించుకోవచ్చని ఏఓ రాజశేఖర్ అన్నారు. బుధవారం జీటీ పేట, ఆగూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభాలు పూర్తయిన వెంటనే చేనుకు ద్రవ జీవామృతం, ఘన జీవామృతం ఎరువుగా వేయాలన్నారు. మొక్కకు కావలసిన పోషకాల కోసం ఎకరానికి 200 లీటర్ల నీమాస్త్రం పిచికారీ చేయాలని సూచించారు. దీనివల్ల రసం పీల్చు పురుగుల ఉధృతిని అరికట్టుకోవడంతో పాటు, గుడ్డు దశలో ఉన్న లద్దె పురుగులను కూడా సమర్ధవంతంగా అరికట్టవచ్చన్నారు. 2 కేజీల ఆవుపేడ, 200 లీటర్లు నీరు, 10 కేజీల వేపాకు, 10 లీటర్ల ఆవు మూత్రంను వినియోగించి నీమాస్త్రంను ఖర్చు లేకుండా తయారు చేసుకోవచ్చన్నారు. రసాయనిక ఎరువుల స్థానంలో రెండు కేజీల జీవన ఎరువును వాడుకుని మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. రాయితీపై దేశవాళీ కూరగాయల విత్తనాలు రైతులకు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో అప్పలనాయుడు, సీఆర్పీ అప్పారావు , చిన్నంనాయుడు, సీఏలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వంట పాత్రల పంపిణీ



వంట పాత్రలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కొండమ్మ

మెంటాడ: స్థానిక పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వంట పాత్రలు, కుర్చీలు కంచాలు గ్లాసులు, చాపలు తదితర సామగ్రిని బుధవారం గ్రామసర్పంచ్ పాండ్రంకి కొండమ్మ పంపిణీ చేశారు. గ్రామంలోని నాలుగు కేంద్రాలకు పంచాయతీ 4వ ఆర్థిక సంఘ నిధులు రూ . 20 వేలతో ఈ సామగ్రి కొనుగోలుచేసినట్లు ఐసీడీఎస్ ఈవో రమణమ్మ తెలిపారు. కేంద్రాల పనితీరు రికార్డులను పరిశీలించారు. నెలలు నిండుతున్న గర్భిణులకు పౌష్టికాహారం ఇళ్లకు వెళ్లి ఇవ్వాలని ఆమె కార్యకర్తలకు సూచించారు. బియ్యం నాసిరకం సరఫరాపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపించినట్లు చెప్పారు. అన్న అమృతహస్తం పథకం అమలుపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈదిబిల్లి జోగారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు చిప్పాడ ఈశ్వరమ్మ, గొర్లె సన్యాసమ్మ, బడుకొండ మంగమ్మ, లగు డు కొండమ్మ పాల్గొన్నారు.

ఉత్సవాల ఏర్పాటులో నిబంధనలు తప్పనిసరి

బొండపల్లి: మండల పరిధిలో ఉన్న 26 గ్రామ పంచాయతీల్లో వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్‌ఐ ఎస్ సుదర్శన్ కోరారు. విగ్రహాల ఏర్పాటు పై తమకు తెలియజేయాలని ఆయన కోరారు. మండపాలకు మైక్ సెట్లు ఏర్పాటుకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు పోలీస్ స్టేషన్‌లో ముందుగా అనుమతి తీసుకోవాలని సూచించారు.మండపాల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా విధిగా ఒకరు పర్యవేక్షణ చేయాలని కోరారు. ఉత్సవాలలో ఎలాంటి వివాదాలకు పాల్పడవద్దని, అశ్లీల నృత్యాలు ప్రదర్శించినా, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మట్టి విగ్రహాలనే వినియోగించాలి

మెంటాడ: వినాయక చవితికి మట్టి విగ్రహాలనే వినియోగించుకోవాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని ఆండ్ర ఎస్‌ఐ ఎస్. భాస్కరరావు తెలిపారు. గ్రామాల్లో అనుమతి పొందిన ప్రదేశాలలోను ఉత్సవ వేదికలు ఏర్పాటుచేయాలని కోరారు. స్పీకర్, అక్రమ విద్యుత్ కనెక్షన్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బాణసంచా వినియోగంలో జాగ్రత్త వహించాలన్నారు. వినాయక నిమజ్జన సందర్భంగా పెద్ద వాహనాలలో ఊరేగింపు చేయరాదని కోరారు. మట్టి ఎ విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలని ఆయన కోరారు.

ప్రైవేటు విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

నెల్లిమర్ల: ప్రైవేటు విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం గౌరవాధ్యక్షులు కృష్ణాజీ పిలుపునిచ్చారు. బుధవారం ఆదిత్య పాఠశాలలో ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం జరగనున్న బంద్‌నువిజయవంతం చేయాలని, ప్రైవేటు విద్యా సంస్థలకు నష్టం కలిగించే సెల్ఫ్ ఫైనాన్స్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల యజమానులపై దాడులకు పాల్పడడం అన్యాయమన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల పరిరక్షణ ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వి.శేఖర్, వి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం 'గుడ్డు' సరఫరా!

● మధ్యాహ్న భోజనానికి సక్రమంగా కాని సరఫరా ● అసంతృప్తిలో విద్యార్థులు ● అమలుకాని ప్రభుత్వ లక్ష్యం

(భోగాపురం)

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించే ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా అధిక పోషకాలున్న కోడిగుడ్డును వారంలో రెండు రోజులు అందించింది. మరింత బలవర్థక ఆహారం అందించాలనే ఉద్దేశంతో వీటి సంఖ్యను మూడుకు పెంచింది. ఈనెల ఒకటో తేదీ నుంచి వారంలో సోమ, బుధ, శుక్ర వారాల్లో మూడు గుడ్లు పెట్టాలని ఆదేశించింది. ఇక్కడే అసలు సమస్య ఏర్పడింది. వారంలో రెండు గుడ్లున్నప్పుడు మధ్యాహ్న భోజన నిర్వాహకులే బయట కొనుగోలు చేసి, విద్యార్థులకు అందించేవారు.సమాయానుకూలంగా డబ్బు మంజూరైనా కాకున్నా.. దీనిని కచ్చితంగా అమలు చేసేవారు. కాగా భోజన పథకానికి రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న ప్రభుత్వం వారంలో మూడు రోజులు అందించే గుడ్ల సరఫరానూ గుత్తేదారులకే అప్పగించింది. దీంతో వారు పాఠశాలలకు సక్రమంగా సరఫరా చేయడం లేదు. ఫలితంగా వారంలో క్రమం తప్ప కుండా మూడు రోజులు పెట్టాల్సిన గుడ్లు ఒక్కో వా రంలో అసలు పెట్టేందుకు అవకాశం లభించడం లేదు. మరో వారంలో రెండు వారాల గుడ్లు కలిపి ఆ రు రోజులూ పెడుతున్నారు. దీనివల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

గుడ్ల సరఫరాను గుత్తేదారులకు అప్పగించిన తరువాత చాలా పాఠశాలల్లో విద్యార్థులకు గుడ్లు సక్రమంగా అందడంలేదు.
పాఠశాలలకు సరఫరా చే యాల్సిన కాంట్రాక్టర్ చాలా పాఠశాలలకు అందించడం లేదు. దీంతో అనేక పాఠశాలల్లో విద్యార్థులకు గుడ్లు అందడంలేదు. కాంట్రాక్టరు తనకు నచ్చినప్పుడు ఆ పాఠశాలకు అందజేయవలిసిన బకాయి గుడ్లు ఒక్క సారే



అందిస్తున్నారు. గతంలో ఎండీఎం నిర్వాహ కులు మోనూప్రకారం విద్యార్థులకు గుడ్లు అందించే వారు ప్రస్తుతం కాంట్రాక్టరుకు ఇవ్వడంతో విద్యార్థుల కు మోనూ ప్రకారం అందడంలేదు. కమీషన్లకు కక్కుర్తిపడి ఈ బాధ్యతను కాంట్రాక్టర్లకు అప్పజెప్పారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వారం రోజులు పాటు గుడ్లు పెట్టకుండా మానేసి తరువాతి వారం ప్రతిరోజూ పెట్టడం వలన విద్యార్థులకు ఇబ్బంది ఎదురవుతుందంటున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలకు క్రమం తప్పకుండా గుడ్లు సరఫరా చేసి మోనూ ప్రకారం అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నెలరోజుల్లో అంతా సర్దుకుంటుంది



పాఠశాలలకు గుడ్లు సరఫరాచేసే బాధ్యత కాంట్రాక్టరుకు ప్రభుత్వం అప్పగించింది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు కలిపి ఒకే కాంట్రాక్టరు గుడ్లు సరఫరా చేస్తున్నారు. సమయనుకూలంగా అందించేలా ముందుగానే బిల్లులు చేశాం. అయితే సక్రమంగా సరఫరా కావడం లేదు. బకాయి గుడ్లు ఇస్తున్న పరిస్థితీ మా దృష్టికి వచ్చింది. మరో నెలరోజుల్లో ఇదంతా సర్దుకుంటుంది. **ఎం.రమణమూర్తి, ఎంఈవో**

టంగుటూరికి ఘన నివాళి


టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భోగాపురం: ప్రజాసేవకోసం జీవితాన్నే త్యాగం చేసిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులుగారని ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య అన్నారు. బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజలకు విశేష సేవలు చేశారన్నారు. స్వాంతంత్ర్య ఉద్యమ సమయంలో ఆయన చూపిన ధైర్య సాహసాలు ఆంధ్రకేసరి బిరుదును సంపాదించి పెట్టాయని కొనియాడారు. ఆయన జీవత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఏపీడీ ఇందిరారమణి

భోగాపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి సిబ్బంది రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆ పథకం ఏపీడీ ఇందిరారమణి సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ రికార్డులు పరిశీలించారు. ఏ విధంగా రికార్డులు నమోదు చేస్తున్నారు, ఏయే వివరాలు నమోదు చేస్తున్నారని పరిశీలించారు.అన్ని వివరాలు రికార్డుల్లో తప్పకుండా నమోదు చేస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఆదిబాబు తదితరులు ఉన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ


మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: కొండ గుంపాం రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేశారు. సమితి ప్రతినిధి పతివాడ శ్యామలరావు ఆధ్వర్యంలో, ఉత్తరాంధ్ర కన్వీనర్ జగన్నాథరాజు సహకారంతో గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపట్టిన ట్లు ఆయన వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన విగ్రహా లు వాడడం వల్ల వాతావరణం కలుషితం అవుతుందని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యురాలు రుంకాన సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా పథకం బాధితులకు వరం

భోగాపురం: చంద్రన్న భీమా పథకం బాధిత కుటుంబాలకు ఎంతో ధీమానిస్తుందని ఎంపీపీ కర్రోతు బంగార్రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బాధిత కుటుంబాలకు చంద్రన్న భీమా ప్రొసిడింగ్సు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రన్న బీమా పథకం కొంత వరకు ఆర్థిక పరిస్థితులనుంచి రక్షించేలా చేస్తుందన్నారు. ప్రస్తుతం సాదార ణ మరణానికి రూ.30 వేలు అందజేస్తున్నారని, దీనిని రూ.2లక్షలకు పెంచడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని అన్ని పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎద్మజ, ఏపీఎం పద్మ, నాయకులు తోటారావు, తాతారావు, బాధితులు పాల్గొన్నారు.


లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: చంద్రన్న బీమా పథకం బాధిత కుటుంబీకులకు వరమని జన్మభూమి కమిటి సభ్యుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు లెంక అప్పలనాయుడు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని థామస్‌పేటకు చెందిన దామోదర వెంకటరమణ ఇటీవల అకాల మరణం చెందిన దృష్ట్యా ఆయన భార్య లక్ష్మికి చంద్రన్న బీమా పథకం కింద తక్షణ సాయంగా 5000 రూపాయలను అప్పలనాయుడు, బయిరెడ్డి నాగేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి ఈ పథకం బాసటగా నిలస్తున్నదన్నారు. సహజ మరణం చెందితే రూ.30వేలు అందుతుందన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు ఇస్తారన్నారు. బీపీఎల్ కుటుంబాల వారు ఈ పథకంలో చేరి లబ్ధి పొందాలని సూచించారు. బయిరెడ్డి నాగేశ్వరరావు, మహంతి కృష్ణ, సీవో గేదెల రాము, బీమా మిత్ర కె.వసంతకుమారి, అదపాక విజయ పాల్గొన్నారు.


చంద్రన్న బీమా ప్రొసీడింగ్సు అందజేస్తున్న ఎంపీపీ

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి


విద్యార్థికి సర్టిఫికేట్ అందిస్తున్న దృశ్యం

డెంకాడ: విద్యార్థులంతా విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని హైదరాబాద్ మెషిన్ ఆర్ ఎన్‌డీ ఫ్యాకల్టీ బార్ల రోహిణికుమార్ అన్నారు. జొన్నాడ లెండి కళాశాలలో మూడురోజుల పాటు జరిగిన గేట్ వేటు ఆర్ అండ్ డి కంపెనీస్ శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ జెషాన్ బార్ కోడ్, ఫుడ్‌కౌంటర్ అప్లికేషన్‌తో పాటు కోడింగ్ నందు మెలకువలు నేర్చుకోవాలన్నారు. నూతన సాంకేతిక విషయాలను తెలుసుకోవడం వలన పరిశ్రమలలో ఉద్యోగావకాశాలు ఎక్కువ ఉంటాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని దీని ద్వారా విద్యా సంస్థకు తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరువస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ విభాగాధిపతి ఎ . రామారావు , సెక్రటరీ శివరామకృష్ణమూర్తి, జయశ్రీ , రవితేజ, బీఏ స్వామి, శ్రీనివాస్, గణేష్ విద్యార్థులు పాల్గొన్నారు.


లెండిలో రెండోరోజు శిక్షణ కార్యక్రమం

సినిమాలు

నెల్లిమర్ల

సాయిసుభద్ర : లై
శ్రీనివాస : జయ జానకి నాయక

పూసపాటిరేగ

శ్రీసాయికృష్ణ : జయ జానకి నాయక

భోగాపురం

శ్రీగోపాలకృష్ణ : జయ జానకి నాయక


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కోటమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

శృంగవరపుకోట రూరల్ : కొట్టాం కోటమ్మతల్లి హుండీ ఆదాయాన్ని ఆలయ ఈవో వినోదేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. ఈ లెక్కింపును విజయనగరం దేవాదాయ శాఖ కార్యాలయ సీనియర్ క్లర్క్ ఎన్.రాజకుమారి పర్యవేక్షించారు. 50 రోజులకు రూ.2,05,929 ఆదాయం లభించింది. కార్యక్రమంలో సర్పంచ్ తెరపల్లి సూరిబాబు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కొట్టాం పీహెచ్‌సీలో నీటికి కట..కట

●మరమ్మతులకు గురైన బోరు
●నిధులున్నా బాగు చేయించలేని స్థితిలో సిబ్బంది
●పూర్తిస్థాయి వైద్యాధికారి లేకపోవడమే కారణం

శృంగవరపుకోట రూరల్ : కొట్టాం పీహెచ్‌సీని నెల రోజులుగా నీటికొరత వేధిస్తోంది. దీంతో ఇటు సిబ్బంది, అటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ నీటి సమస్యను తీర్చాలంటే నిధులు వెచ్చించాల్సి ఉండడం, ఇన్‌చార్జి వైద్యాధికారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించకపోవడంతో ఈ సమస్య పరిష్కారం కాలేదు. కొన్నాళ్లుగా ఈ పీహెచ్‌సీలో విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పీహెచ్‌సీలో విధులు నిర్వహించడం వైద్యాధికారులకు కష్టసాధ్యంగా మారింది. రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో వెళ్లాలంటే ఆటోలు, ఇతరత్రా సదుపాయాలు లేవు. మండల కేంద్రం నుంచి సుమారు 13 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. దీంతో ఇక్కడ విధులు నిర్వహించేందుకు వైద్యులు ఇష్టపడడం లేదు. మండల వాసులెవరికీ ఉపయోగపడని రీతిలో పీహెచ్‌సీని కొట్టాంలో అప్పట్లో నిర్మించారు. ఇక్కడ నుంచి గ్రామాలకు సిబ్బంది సేవలను అందిస్తున్నారు. ఇటీవల ఇక్కడకు వైద్యాధికారిగా డాక్టర్ బురిడి సూర్యకుమారి వచ్చారు. కొన్నాళ్లకు ఈమె విశాఖకు బదిలీపై వెళ్లిపోయారు. అనంతరం జామి పీహెచ్‌సీ వైద్యాధికారి ధనుంజయ్‌నాయుడును ఇన్‌చార్జిగా నియ మించినా ఆయన ఉండలేక వెళ్లిపోయారు. విజయనగరం డాక్టర్ శర్మను ఇక్కడకు వేసినా.. ఆయనా వెళ్లిపోవడంతో ప్రస్తుతం ఇన్‌చార్జి వైద్యాదికారిగా మోపాడ జగదీష్ విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ పీహెచ్‌సీలో పలు సమస్యలు నెలకొన్నాయి. డ్రాయింగ్ పవర్స్ లేక ఇవి పరిష్కారం కావడం లేదు. జిల్లా అధికారులు చొరవ తీసుకుని ఈ సమస్యలను పరిష్కరించి, ఇక్కడ శాశ్వత వైద్యుడిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.


మరమ్మతులకు నోచుకోని మోటారు

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన

శృంగవరపుకోట రూరల్ : ధర్మవరం ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఎన్నికలలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో పాఠశాల నాయకుడి ఎన్నిక నిర్వహించారు. నాయకుడిగా యాలమల గణేష్‌ను విద్యార్థులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిర్మూలనకు చట్టం చేయాలి

శృంగవరపుకోట : మూఢ నమ్మకాల నివారణకు చట్టం చేయాలని భారత నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షుడు వై.నూకరాజు బుధవారం కోరారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మూఢ నమ్మకాల పేరుతో కొందరు అమయాకులను చంపేస్తున్నారని పేర్కొన్నారు. ప్రపంచం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నా మూఢ భక్తితో దాడులు చేసుకోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహారాష్ట్ర మాదిరిగా మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం తేవాలని కోరారు.

వియ్యంపేట కళాశాల ల్యాబ్‌కు రూ.20లక్షలు

కొత్తవలస రూరల్ : వియ్యంపేట సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల(బాలికల)లో సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.20లక్ష లు మంజూరు చేసినట్టు ప్రిన్సిపాల్ టీఎం.ఫ్లోరెన్సీ తెలిపారు. బుధవారం ఆమె విలేఖరులతో మాట్లాడారు. సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు ఎంపికచేయడం ఆనందదాయకమన్నారు. దీంతో సైన్స్ గ్రూపులు ప్రవేశపెట్టేందుకు అవకాశాలు మెరుగయ్యాయన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఫ్లోరెన్సీ

'ఏడాదికో దూడ'కు రామలింగపురం ఎంపిక

కొత్తవలస రూరల్: పాడి రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా 'ఏడాదికో దూడ' కార్యక్రమానికి రామలింగపురంను ఎంపిక చేసినట్టు మండల పశు వైద్యాధికారిణి అరుణ తెలిపారు. వియ్యంపేటలో బుధవారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే రామలింగపురంలో పశుగణన, వాటి ఆరోగ్య పరిస్థితులపై పూర్తి నివేదికను తయారుచేశామన్నారు. త్వరలోనే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి పూర్తి పశు సంరక్షణ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కొత్తవలస : రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులకు నిరసనగా బుధవారం కొత్తవలసలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. మేజిస్ట్రేట్ ప్రదీపకు వినతిపత్రం అందజేసినట్టు న్యాయవాద సంఘం ప్రతినిధులు ఎంవీఎస్ గిరిబాబు, డి.శ్రీనివాస్ తెలిపారు.


మహిళలకు కోడిపిల్లలను అందిస్తున్న వైద్యాధికారి

20 యూనిట్ల కోడి పిల్లల పంపిణీ

కొత్తవలస: పెరటి కోళ్ల పెంపకం కింద కొత్తవలస మండలంలో 20యూనిట్లను పంపిణీ చేశామని మండల పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి తెలిపారు. బుధవారం ఆమె ఏడీ కార్యాలయంలో ఈ యూనిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కొక్క యూనిట్‌కు 20 కోడిపిల్లలను మొదటి విడతగా పంపిణీ చేశామని, మిగిలిన 25 కోడి పిల్లలను త్వరలో అందజేస్తామన్నారు. యూనిట్‌కు లబ్ధిదారుడు రాయితీ పోను రూ.810 చెల్లించాలని తెలిపారు. అన్ని గ్రామాల మహిళలకు ఈ యూనిట్లు అందిస్తామని చెప్పారు. కోడి పిల్లలను చక్కగా పెంచి, ఆర్థిక లబ్ధి పొందాలని ఆమె సూచించారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందించండి

శృంగవరపుకోట రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని కొట్టాం సర్పంచ్ తెరపల్లి సూరిబాబు సూచించారు. బుధవారం ఆయన అంగన్‌వాడీ కార్యకర్తలకు వంటపాత్రలు, గ్యాస్ స్టవ్‌లను అందించారు.

టంగుటూరికి ఘన నివాళి


వైస్ ఎంపీపీకి వినతిపత్రం అందిస్తున్న నేతలు

శృంగవరపుకోట: ఎస్.కోట నుంచి శాసనసభ్యుని గా ఎన్నికై ముఖ్యమంత్రి పదవిని అలంకరించిన మహనీయుడు టంగుటూరి ప్రకాశం అని బాపూజీ సేవా సంఘం వ్యవస్థాపకుడు మోపాడ మరియదాస్ అన్నారు. బుధవారం బాపూజీ సేవా సంఘ భవనంలో టంగుటూరి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ఆంధ్రకేసరి గొప్పతనం, ధైర్య, సాహసాలను వివరించారు. అనంతరం ఎస్.కోటలోని టంగుటూరి ప్రకాశం మార్కెట్ నిరాదరణకు గురైందని, దీనిని వినియోగంలోకి తేవాలని వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీకి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఆయన.. కృషి చేస్తానని వారికి తెలిపారు. అంతకుముందు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో : పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ప్రిన్సిపాల్ టీఎస్ రామనూజం ఆధ్వర్యంలో ని ర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు జీవిత విశేషాలను విద్యార్థులకు..అధ్యాపకులు వివరించారు.

వేపాడ : సోంపురం జడ్పీ పాఠశాలలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు గారి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శంకరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం.. ప్రకాశం పంతులు జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. మద్రాస్‌లో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో బ్రిటీష్ వారి తుపాకీ ఎదురు నిలిచిన మహనుభావుడు ఆంధ్రకేసరి అని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు


గతుకులమయమైన సీతంపేట రహదారి

అధ్వానంగా సీతంపేట రహదారి

కొత్తవలస రూరల్: తుమ్మికాపల్లి-సీతంపేట రహదారి అధ్వానంగా తయారైంది. పూర్తి గతుకులమయంగా మారడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురిస్తే గుంతల్లో బురద నీరు చేరి పరిస్థితి ద యనీయంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పం దించి రోడ్డుకు మరమ్మతులు చేయాలంటూ పలువురు కోరుతున్నారు.

శివరామరాజుపేటలో పొలం పిలుస్తోంది

శృంగవరపుకోట రూరల్: శివరామరాజుపేటలో మండల వ్యవసాయధికారిణి చుక్క నీలవేణి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది బుధవారం నిర్వహించారు. సర్పంచ్ కాపుగంటి కుమారితో కలిసి వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి రైతులకు వ్యవసాయంలో పలు సూచనలు, సలహాలు అందించారు. పంటలకు ఆశించే పురుగులు, నివారణ పద్ధతులను వివరించారు.

మట్టి గణపతితో పర్యావరణానికి మేలు


మట్టి విగ్రహాలు తయారుచేస్తున్న విద్యార్థులు

శృంగవరపుకోట : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించడం ఎంతో మేలని రవీంద్రభారతి ప్రిన్సిపాల్ శాంతిమహంతి అన్నారు. బుధవారం ఆమె విద్యార్థులకు మట్టి గణపతి తయారీపై శిక్షణ ఇచ్చారు. మట్టి గణనాథులను చేయించారు. రసాయన విగ్రహాల వినియోగంతో కలిగే నష్టాలు, మట్టి విగ్రహాలతో కలిగే లాభాలను వివరించారు.

నేడు మట్టి ప్రతిమల పంపిణీ

కొత్తవలస రూరల్ : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మంగళపాలెంలో మట్టి గణపతి ప్రతిమలను గురువారం పంపిణీ చేయనున్నట్టు సర్పంచ్ కోరుబిల్లి భూలక్ష్మి, జగ్గారావు దంపతులు తెలిపారు. ఆసక్తిగల వారందరూ గురువారం సాయంత్రం 3గంటలకు రామాలయం వద్ద జరిగే పంపిణీకి హాజరుకావాలని కోరారు.

సినిమాలు

శృంగవరపుకోట

శ్రీశ్రీనివాస--------------------లై
శ్రీవెంకటేశ్వర -----జయజానకినాయక

కొత్తవలస

శ్రీజయ-------నేనే రాజు..నేనే మంత్రి
శ్రీరాజా---------------------లై
శ్రీలక్ష్మీనరసింహ---జయజానకినాయక

జామి

జ్యోతి----------------ఆనందోబ్రహ్మ

అంగన్‌వాడీలకు వంట పాత్రలు పంపిణీ

పాచిపెంట: మాతుమూరులోని అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం ఎంపీడీవో జి.వెంకటరావు వంట పాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క కేంద్రానికి రూ. 5 వేల విలువ చేసే పాత్రలు పంపిణీ చేసినట్లు చెప్పారు. సకాలంలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. సాలూరు ఏఎంసీ వైస్ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, సీడీపీవో డి.ఉమాభారతి, ఈవోపీఆర్‌డీ ఎం.మురళీకృష్ణ, సూపర్‌వైజర్ సుగుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

మట్టి వినాయక విగ్రహాలు నేడు పంపిణీ


రోటరీక్లబ్ ద్వారా పంపిణీకి సిద్ధంగా ఉన్న మట్టి గణపతి విగ్రహాలు

సాలూరు: పట్టణ ప్రధాన రహదారిలో గురువారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తామని ఎమ్మెల్సీ గుమ్మిడి సంధ్యారాణి బుధవారం తెలిపారు. 300 విగ్రహాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆఫీసు జంక్షన్, వెంకటేశ్వర డీలక్స్, కోటవీధి, శివాజీ సెంటర్లలో 1500 మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తామని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జె. కళ్యాణ చక్రవర్తి, రవి వర్మ తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

ధీశాలి టంగుటూరి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సహదేవుడు

సాలూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ఈసమావేశంలో తొలుత టంగుటూరికి ప్రిన్సిపాల్ బలగ సహదేవుడు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటీష్‌వారి తుపాకులకు బయపడకుండా ఎదురుగా గుండె నిలిపిన ధీశాలి టంగుటూరి అన్నారు. అటువంటి మహనీయుని ఆశయాలు కొనసాగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

'భోజన' బకాయిలు చెల్లించక ఇక్కట్లు


మాట్లాడుతున్న సీఐటీయూ ప్రభావతి, తదితరులు

పాచిపెంట: అంగన్‌వాడీ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకుల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు టి.ప్రభావతి డిమాండ్‌చేశారు. బుధవారం స్థానిక విలేఖరులతో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు నెలలుగా, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఆరు నెలల వేతనాలు చెల్లించలేదని తెలిపారు. ప్రతి లింక్ వర్కర్‌కు కూడా సకాలంలో వేతనాలు అందజేయాలన్నారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వారికి పదవీ విరమణకు సంబంధించిన రాయితీలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు జి.కల్యాణి, ఆశ వర్కర్ల మండల కార్యదర్శి నిర్మల, సీఐటీయూ నేత కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు మోక్షం

- ప్రధాన రహదారిలో కాలువ పనులు
- పదేళ్ల సమస్యకు పరిష్కారం

సాలూరు: పదేళ్లుగా ఎదురుచూస్తున్న ప్రధాన రహదారిలో మురుగు కాలువ నిర్మాణ పనులకు అధికారులు మోక్షం కల్పిస్తున్నారు. లెప్రసీ ఆస్పత్రి నుంచి మున్సిపల్ ఆఫీసు జంక్షన్ వరకు కాలువ నిర్మించలేదు. దీంతో మురుగునీరు బయటకు పోవడంలేదు. అంతేకాకుండా వర్షం కురిస్తే రోడ్డుపై ఆ నీరూ నిలిచిపోతోంది. ఈసమస్యలకు చెక్ పెట్టేందుకు పాలకవర్గం కాలువ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేసింది. ప్రస్తుతం అధికారులు పనులు చేపడుతున్నారు. జేసీబీతో కాలువ గోతులు తవ్వుతున్నారు. ప్రధానరహదారిలో ఆక్రమణలు కూడా తొలగిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితిలో రోడ్డుపక్కన ఎన్నో ఏళ్ల కిందట నాటిన చెట్లను కూడా తొలగిస్తున్నారు.

దుమ్ము, ధూళి నివారణకు సీసీ పేవ్‌మెంట్స్

ప్రధాన రహదారి బురదమయమవుతోంది. ఎండ ఎక్కితే, దుమ్ము, ధూళితో ప్రయాణికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారికి ఇరువైపులా ఉన్న నివాస గృహాలు, దుకాణాల దారులు దుమ్ము, ధూళితో తీవ్ర సమస్య ఎదుర్కొంటున్నారు. దీంతో శ్వాస కోశ, ఇతర ఆరోగ్య సమస్యలు కూడా వస్తున్నాయి. ఈసమస్యలనుంచి గట్టెక్కించాలని పలుమార్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గొర్లె విజయకుమారి, పాలకవర్గ సభ్యులను స్థానికులు కోరారు. ఈమేరకు కాలువ, సీసీ పేవ్‌మెంట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఎన్‌హెచ్‌శాఖ నుంచి అనుమతులు ఆలస్యం కావడంతో పనుల్లో జాప్యం జరిగింది. ఇప్పుడు ఆమోదించడంతో అధికారులు పనులు ప్రారంభించారు.


పోస్టాఫీసు జంక్షన్ వద్ద సీసీ పేవ్‌మెంట్ పనులు, జాతీయ రహదారిలో కాలువ కోసం తవ్వకాలు

పాఠశాల పనితీరుపై ఆరా

సాలూరు: పట్టణంలోని 18వవార్డు మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌ను బుధవారం పట్టణ ప్రత్యేకాధికారి సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ గొర్లె విజయకుమారి పరిశీలించారు. బోధన తీరు, మధ్యహ్న భోజనం సక్రమంగా అందిస్తున్నారా? లేదా? అన్న విషయాలను విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. ఆంగ్ల మాధ్యమ తరగతులకు సంబంధించిన విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మట్టి విగ్రహాలు తయారు చేస్తున్న చినకుమ్మరివీధిలోని కుమ్మర్లతో మాట్లాడారు. ప్లాస్టర్‌ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు విక్రయించొద్దని కోరారు. 18వవార్డులో మృతి చెందిన కొంకర శ్యామ కుమారి కుటుంబ సభ్యులకు చంద్రన్న బీమా సాయం రూ.5వేలు అందజేశారు. కమిషనర్ ఎంఎం నాయుడు, గొర్లె మాధవరావు, వార్డు కౌన్సిలర్ ఎన్. రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి, చైర్‌పర్సన్

కాకినాడ ఎన్నికల్లో వైసీపీ జిల్లా నేతల సందడి

సాలూరు రూరల్: కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో జిల్లాకు చెందిన వైసీపీ నేతలు సందడి చేస్తున్నారు. బుధవారం కాకినాడ 12 వార్డులో సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర, రాజాం ఎమ్మెల్యే జోగులు విస్తృతంగా ప్రచారం చేశారు. వివిధ వార్డుల్లో మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), బొత్స అప్పల నర్సయ్య, కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి, కొలగట్ల వీరభద్రరావు, బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు వైసీపీ అభ్యర్థుల విజయానికి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాకినాడ మున్సిపల్ నగరపాలక సంస్థలో 50 వార్డులు ఉండగా 48 వార్డులకు ఎన్నికలు ప్రస్తుతం జరుగుతున్నాయి.

విజయం వైసీపీదే: ఎమ్మెల్యే రాజన్నదొర

కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల్లో విజయం తమ పార్టీదేనని ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర అన్నారు. బుధవారం ఆయన రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులతో కలసి 12 వార్డుల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేఖరులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. 12 వార్డులో 7400 ఓటర్లు ఉన్నారన్నారు. తమ పార్టీ అభ్యర్థి బుదిరెడ్ల పుష్ప పోటీ చేస్తున్నారన్నారు. ఈ వార్డులో విజయనగరం, శ్రీకాకుళం జిల్లా వాసులు అధికంగా ఉన్నారన్నారు. తమ అభ్యర్థిపై టీడీపీకి చెందిన సునీత పోటీ చేస్తున్నారన్నారు. అయితే ప్రచారంలో తమకు ఆదరణ లభిస్తోందన్నారు. వైసీపీకే విజయం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.


అభ్యర్థి పుష్పతో కలసి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజన్నదొర

సహకారంతో విద్యాభివృద్ధి


ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమావేశం

సాలూరు రూరల్/ పాచిపెంట: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలని పాచిపెంట ఎంఈవో పల్లి జోగారావు కోరారు. బుధవారం ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘనేతలు కోలా ఆనంద్, ముక్తేశ్వర పాణిగ్రాహి, నాయుడు ప్రభాకర్, పసుమర్తి నాగేశ్వరరావు, బండి ప్రభాకర్, శ్రీనివాసరావు తదితరులు పలు సమస్యలను దృష్టికి తీసుకువచ్చారు. పరిష్కరిస్తానని ఎంఈవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మరడాన మోహనరావు, ఆర్నిపల్లి తిరుపతిరావు,ఆశోక్, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సమాచారం

శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ పరిధిలో ఈ నెల 16న గ్యాస్‌బుక్ చేసుకున్న సాలూరు పట్టణం, మామిడిపల్లి, పాచిపెంట వినియోగదారులకు బుధవారం గ్యాస్ సరఫరా చేస్తారు.

సినిమాలు

సాలూరు

లక్ష్మి..	నేనే రాజు నేనే మంత్రి
శ్రీలక్ష్మి..	ఆనందో బ్రహ్మ
శ్రీరామ ..	జయ జానకి నాయక
వెంకటేశ్వర..	ఫిదా
సూర్యమహల్ ...	ప్రతిక్షణం



పోసర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వివేక్‌యాదవ్

మిలియన్ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్:సీపీఎస్ ఉద్యోగులు చేపట్టిన మిలియన్ మార్చ్ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను కలెక్టరు వివేక్‌యాదవ్ ఆవిష్కరించారు. జేఏసీ జిల్లా చైర్మన్ పేడాడ జనార్ధనరావు ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరు చాంబర్‌లో ఈపోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు చేయాలంటూ సెప్టెంబరు 1న విజయవాడలో మిలియన్ మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

సమాచారం

నేడు ప్రైవేట్ పాఠశాలల బంద్

రింగురోడ్డు: కర్నూలులో పాఠశాల కరస్పాండెంట్‌పై ఎస్ఎఫ్ఐ విద్యార్థులు దాడికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ప్రైవేటు విద్యాసంస్థలు బంద్ చేస్తున్నట్టు ప్రైవేటు స్కూల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.ఆర్.కృష్ణాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులపై దాడి చేయడం దారుణమన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి దాడులకు పాల్పడకుండా కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వరకు ప్రైవేట్ పాఠశాల సిబ్బందితో ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరుకావాలని ఆయన కోరారు.

గ్రంథాలయానికి స్థలం కేటాయించండి

కలెక్టరేట్:గోపినాథం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న గ్రంథాలయానికి జిల్లా కేంద్రంలో నాలుగు సెంట్లు స్థలం కేటాయించాలని సంస్థ అధ్యక్షుడు ఒక ప్రకటనలో అధికారులను కోరారు. స్థలం కేటాయిస్తే భవన నిర్మాణం చేపట్టి విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచుతామన్నారు. అధికారులు సాయమందిస్తే ముమ్మందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మట్టి వినాయకా... నమామ్యహం!

- నగరంలో ఉచితంగా గణనాథుల ప్రతిమల పంపిణీ
- ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలు వాడొద్దని విస్తృత ప్రచారం



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

దాసన్నపేట:గణపతి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలకు పూజలు చేసి పర్యావరణాన్ని కాపాడాలని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగులు, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో చేసిన విగ్రహాల వల్ల వాతావరణం కలుషితం అవుతుందన్నారు. చర్మవ్యాధులు వ్యాప్తి చెందుతాయని, వాటిని చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల జలచరాలు మృత్యువాత పడుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పి.రామారావు, వి.సత్యనారాయణమూర్తి, ఎం.కె.ఎస్.గుప్త, పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో...

బీజేపీ ఎస్సీ మోర్చా పట్టణ శాఖ అధ్యక్షుడు పాండ్రంకి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద బుధవారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని కోరారు. కార్యక్రమంలో షకీల్, నీలాపుదేవి, కౌతల శంకర్ పాల్గొన్నారు.

దుప్పాడలో..

విజయనగరం రూరల్:దుప్పాడ గ్రామంలో మట్టి వినాయక విగ్రహాలను టీడీపీ నాయకులు మేకా కాశీ, సైలాడ పెంటయ్యలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాల వల్ల పర్యావరణం కలుషితమవుతుందని తెలిపారు. ఈ ఏడాది 1200 విగ్రహాలను పంపిణీ చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వెయ్యి మట్టి విగ్రహాల పంపిణీ

రింగురోడ్డు:వినాయకచవితిని పురస్కరించుకుని ఆదిత్య ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో విద్యార్థులు 1000 మట్టి విగ్రహాలను పాఠశాల కరస్పాండెంట్ ఉమానాయుడు, ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నివారణకు మట్టి వినాయక ప్రతిమలు వాడాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో చేసిన విగ్రహాలతో కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. మట్టి వినాయకులను పూజించాలని తల్లిదండ్రులతో పాటు చుట్టుపక్కల ఉన్నవారికి తెలియజేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఉమానాయుడు సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ ఇంచార్జు బి.కళ్యాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.





కోట జంక్షన్, దుప్పాడలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న బీజేపీ, టీడీపీ నాయకులు, ఆదిత్య పాఠశాలలో విద్యార్థులకు విగ్రహాలు అందిస్తున్న కరస్పాండెంట్



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న నారాయణరావు

తపాలాశాఖను ప్రైవేటీకరించొద్దు

- సంఘ నాయకుడు నారాయణరావు
- కార్యాలయం ఎదుట ఉద్యోగుల ధర్నా

విజయనగరం రూరల్: కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అఖిలభారత తపాలా ఉద్యోగాల సంఘం విజయనగరం డివిజన్ యూనియన్ నాయకుడు కంది నారాయణరావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోస్టల్ కార్యాలయం ఎదురుగా ఎంటీఎస్, జీడీఎస్ ఉద్యోగులు ఒక్క రోజు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ తపాలాశాఖలో అన్ని విభాగాల్లోను ఖాళీగా ఉన్న 60వేల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. లక్ష్యాల పేరిట ఉద్యోగులను వేధించడం ఆపాలని, పాత పింఛను విధానాన్ని కొనసాగించాలని, వారానికి ఐదురోజులు మాత్రమే పనిదినాలు కల్పించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తపాలాశాఖ సూపరింటెండెంట్‌కు అందించారు. డిమాండ్లు నెరవేర్చకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ధర్నాలో యూనియన్ నాయకులు పప్పుల శ్రీను, పి.నారాయణ, జి.తాతినాయుడు, బి.ప్రసాద్, ఎ.పెంటపాపయ్యలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయండి

- వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్



మాట్లాడుతున్న ఉద్యోగుల సంఘ నాయకుడు ప్రసాద్

రింగురోడ్డు: ఏళ్ల తరబడి విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను తెలంగాణా తరహాలో రెగ్యులర్ చేయాలని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. ఇందుకు కార్మిక సంఘాలు ఐక్యంగా ప్రభుత్వంపై వత్తిడి తేవాలని కోరారు. బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారని తెలిపారు. విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు కార్మికులను వేరే విధులకు వాడుకోవడం తగదని తెలిపారు. ప్రమాదాల నివారణకు సంస్థ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. కనీస వేతనాలు సైతం ఇవ్వకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు వి.గోవిందరావు, కార్యదర్శి రామకృష్ణ, కన్వీనర్ సురేష్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

శిశుగృహను శుభ్రంగా ఉంచాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు శ్రీవాణి



శిశుగృహను సందర్శించిన మహిళా కమిషన్ సభ్యురాలు

విజయనగరం రూరల్: జిల్లాకేంద్రంలోని రెవెన్యూ కాలనీలో స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కొయ్యాన శ్రీవాణి బుధవారం సందర్శించారు. కార్యాలయంతో పాటు రికార్డులు, చిన్నారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. చిన్నారులతో మాట్లాడి భోజన, వసతి, ఆరోగ్యం తదితర సేవలపై అడిగి తెలుసుకున్నారు. శిశుగృహను శుభ్రంగా ఉంచాలని, పిల్లలకు సరైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులు దైవంతో సమానమని చెప్పారు. ఇక్కడ అందిస్తున్న సేవలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట డీసీపీయూ జిల్లా మేనేజర్ బీహెచ్ లక్ష్మి, శిశుగృహ సామాజిక కార్యకర్త శ్రీధర్, డీసీపీయు పీవో ఎస్.చిట్టిబాబు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు: సీఐ

విజయనగరం క్రైం: టూటౌన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ నర్సింహమూర్తి హెచ్చరించారు. బుధవారం టూటౌన్ పరిధిలోని గాజులరేగ రాళ్లమాలపల్లిలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన నిడదాపు సత్యవతిని అరెస్టు చేశారు. ఆమె నుంచి 300గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈసందర్భంగా సీఐ నర్సింహమూర్తి మాట్లాడుతూ టూటౌన్ పరిధిలో ఖైనీలు, గుట్కాలు, గంజాయి తదితర మాదక ద్రవ్యాలు విక్రయించినా, బెల్టుషాపులు నిర్వహించినా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. ఎవరైనా అనుమానాస్పందన కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేశామని చెప్పారు. వాహనచోదకులు తప్పనిసరిగా ధ్రువపత్రాలు కలిగివుండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైల్‌శిక్ష తప్పదని హెచ్చరించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ప్రతిఒక్కరు లాక్డ్‌హౌస్ మానటరింగ్ సిస్టమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సిస్టమ్‌పై రెండో పట్టణ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సీఐ నర్సింహమూర్తి తెలిపారు.

వర్షంతో ఉపశమనం

విజయనగరం టౌన్: విజయనగరం పట్టణంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఎప్పటిలాగే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండ, ఉక్కబోత వున్నా, సాయంత్రానికి పరిస్థితిలో మార్పు వచ్చింది.. గంట పాటు కురిసిన వర్షం కారణంగా పట్టణ ప్రజలు సేదతీరారు. సాయంత్రానికి పూర్తిగా వాతావరణం చల్లగా మారింది. రోడ్లపై వర్షం నీరు తగ్గలేదు. కాలువల్లో నీరు రోడ్లపైకి ప్రవహించడం జరిగింది. పుట్‌పాత్, తోపుడు బళ్ల వ్యాపారులతో పాటు పలువురు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు.

సినిమా గైడ్

విజయనగరం

ఆదిత్య	: నేనే రాజు నేనే మంత్రి
శ్రీకృష్ణ	: జయజానకి నాయక
న్యూపూర్ణ	: నేనే రాజు నేనే మంత్రి
రంజని	: ఫిదా
శివరంజని	: ఆనందో బ్రహ్మ
హిమగిరి	: గౌతమ్‌నంద
సప్తగిరి	: లై
లీలామహల్	: జయజానకి నాయక
ఎన్‌సీఎస్	: నక్షత్రం

ఎన్‌సీఎస్ ఐనాక్స్

స్క్రీన్-1, స్క్రీన్-2, స్క్రీన్-3
ఆనందో బ్రహ్మ, నేనే రాజు నేనే మంత్రి, జయ జానకి నాయక, లై, అనబెల్

సమాచారం

గ్యాస్ ఏజెన్సీ ఫోన్ నంబర్లు

సాయి ఏజెన్సీ	: 08922-234523
ఎన్‌సీఎస్‌ఏజెన్సీ	: 08922- 224177, 233578
ఎన్‌వీఆర్ ఏజెన్సీ	: 08922-225810
శ్రీనివాసా ఏజెన్సీ	: 08922-224301, 285288

ఆర్టీసీ సమాచారం

విచారణ కేంద్రం	08922 225333
ఫిర్యాదుల విభాగం	7382923726
అడ్వాన్స్ బుకింగ్	08922 234911
టోల్‌ఫ్రీ నంబరు	1800 200 4599

ఎమర్జన్సీ సర్వీసెస్

పోలీస్	100
ఫైర్	101
ఆపద సమయాల్లో	108
బాలల సంరక్షణ కోసం	1098
కేంద్రాసుపత్రి అంబులెన్స్	08922 272124
ఘోషాసుపత్రి అంబులెన్స్	8008553401

రైతుబజారు ధరలు

కూరగాయలు	కిలో (రూ)
టమోటా (దేశవాళీ)	44-00
టమోటా(హైబ్రిడ్)	42-00
వంకాయలు	27-00
బీరకాయలు	22-00
బెండకాయలు	24-00
కాకర కాయలు	22-00
క్యాబేజీ	18-00
గోరు చిక్కుడు	22-00
దొండకాయలు	30-00
క్యారెట్	34-00
బీట్‌రూట్	25-00
ఉల్లిపాయలు	23-00
బంగాళదుంపలు	10-00
అల్లం	58-00
పచ్చిమిర్చి	45-00
క్యాప్సికమ్	50-00
కీర దోస	20-00

బంగారం ధరలు

24క్యారెట్లు (10 గ్రాములు)	30,150-00
22 క్యారెట్లు	27,740-00
వెండి కిలో	40,500-00

నేడు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

కలెక్టరేట్: జిల్లాలో ఆరు కౌంటర్ల ద్వారా గురువారం 12వేలు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేయనున్నామని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సుదర్శన్ అన్నారు. బుధవారం కలెక్టరును కలిసి మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. కలెక్టరేట్, ఆర్టీసీ కాంప్లెక్స్, రింగురోడ్డు, రైతు బజారు, మూడు లాంతర్లు, చీపురుపల్లి, బొబ్బిలిలో ఉదయం 9.30 గంటలకు విగ్రహాలు పంపిణీ చేస్తామన్నారు.

టంగుటూరికి ఘన నివాళి




వయో వృద్ధుల సంక్షేమ భవనంలో మాట్లాడుతున్న ఈశ్వర్, భాష్యం పాఠశాలలో టంగుటూరికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

దాసన్నపేట: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటితరానికి ఆదర్శమని వయోవృద్ధుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు కేపీ ఈశ్వర్ అన్నారు. పట్టణంలోని పంచముఖ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో సంఘ కార్యాలయంలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేపీ ఈశ్వర్ మాట్లాడుతూ నీతి, నిజాయితీలకు ఆయన ప్రాధాన్యమిచ్చేవారన్నారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టినా నిరాడంబరంగా ఉండేవారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి గిడుతూరి పైడితల్లి, ప్రతినిధులు మురళీభగవాన్, అల్లంకి బసవమూర్తి, అవధాని కట్టమూరి చంద్రశేఖర్, పెద్దింటి అప్పారావు పాల్గొన్నారు.

తెలుగు భాషా పరిరక్షణ ఆధ్వర్యంలో...

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక టంగుటూరి ప్రకాశం పంతులని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలుగుభాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో టంగుటూరి జయంతి కార్యక్రమాన్ని భాష్యం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకాంధ్ర రాష్ట్రసాధనలో ప్రకాశం పంతులు కీలకపాత్ర పోషించారన్నారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీకి ఎదురొడ్డి నిలబడిన ధీరోదాత్తుడని తెలిపారు. ఆంధ్రరాష్ట్ర తొలి అవతరణ దినోత్సవంలో 2వేలమంది ఖైదీలకు క్షమాభిక్ష పెట్టారని చెప్పారు. కార్యక్రమంలో తెలుగుభాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీఎల్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఆర్ కళాశాలలో..

విజయనగరంటౌన్: కోటలోని మహారాజా కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరస్వతి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, టంగుటూరి జీవితం ఆదర్శప్రాయమన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని రాష్ట్ర పండుగ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి.శశికళ, భాస్కర రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోండి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ నాగమల్లి

దాసన్నపేట: విద్యార్థులు పుస్తక పఠనం అలవాటుగా చేసుకోవాలని తిరుమల నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నాగమల్లి అన్నారు. లిఫ్టింగ్ హేండ్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జొన్నగుడ్డి పురపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఉన్నత విద్యను అభ్యసించి లక్ష్యాలను సాధించాలన్నారు. లిఫ్టింగ్ హేండ్స్ సంస్థ అధ్యక్షుడు కంది గౌరీకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అచ్చిరెడ్డి, కిరణ్, జ్యోత్స్న, శ్రీదేవి కృష్ణ, ప్రధాన కార్యదర్శి సూర్యలక్ష్మి, హెచ్‌ఎం సత్యవేణి పాల్గొన్నారు.

జీపీఎస్ సిస్టంతో చోరీల నివారణ

● టూటౌన్ సీఐ నర్సింహమూర్తి

విజయనగరం క్రైం: లారీల్లో జీపీఎస్ సిస్టంను యజమానులు అమర్చుకోవాలని టూటౌన్ సీఐ నర్సింహమూర్తి చెప్పారు. బుధవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో లారీ యజమానులు, డ్రైవర్లకు సీపీఎస్ సిస్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లారీ డ్రైవర్లు, యజమానులు లారీని పార్కింగ్ చేసే ప్రాంతంలో క్యాబిన్‌లో లారీ తాళాలను ఉంచకూడదన్నారు. లారీలను పార్కింగ్ చేసే ప్రాంతంలో ఎవరో ఒకరు ఉండేలా చూడాలని తెలిపారు. లారీల్లో జీపీఎస్ సిస్టం అమర్చడం వల్ల చోరీకి గురయ్యే లారీ ఏ ప్రాంతంలో ఉందో తెలుసుకోవచ్చని అన్నారు. సమావేశంలో ఎస్‌ఐలు అశోక్‌కుమార్, దుర్గాప్రసాద్, లారీ యజమానులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'కరస్పాండెంట్‌పై దాడి తగదు'

దాసన్నపేట: కర్నూలులో పాఠశాలలో మృతి చెందిన విద్యార్థిని మృతదేహాన్ని సందర్శించడానికి వెళ్లిన కేవీఆర్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస రెడ్డిపై విద్యార్థి సంఘం దాడి చేయడం సరికాదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బి.రాంబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిద్ధూ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాడికి పాల్పడిన వారిని విద్యార్థి సంఘాలను తొలగించాలని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఇటువంటివి పునరావృత్తం కాకుండా చూడాలన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

విజయనగరం టౌన్: తెలుగుయువత ఆధ్వర్యంలో స్థానిక కోట జంక్షన్‌లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం బుధవారం చేపట్టారు. అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు, జడ్పీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, మున్సిపల్ చైర్మన్ రామకృష్ణతో పాటు టీడీపీ నాయకులు, ఐవీపీ రాజు, ఎస్‌ఎన్‌ఎం రాజులు పాల్గొని ఈ ప్రతిమలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అదితి గజపతిరాజు మాట్లాడుతూ ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను పూజలకు ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు కర్రోతు నర్సింగరావు, జి సురేంద్ర, పి పైడిరాజు, పి మహేష్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

బిందు సేద్యంపై అవగాహన

శృంగవరపుకోట రూరల్: రైతులు ప్రస్తుతం బిందు,తుంపర సేద్యంపై దృష్టిసారిస్తే ఎంతో లాభదాయకమని ఏపీడీ మన్మధరావు తెలిపారు. బుధవారం భర్తపురం గ్రామంలో రైతులకు వీటిపై అవగాహన కల్పించారు. వీటిని ఎంత రాయితీపై పొందవచ్చు అనే విషయాలపై వివరించారు.

కాకినాడలో ఎమ్మెల్యే కోళ్ల ప్రచారం

శృంగవరపుకోట: శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 29,30 వార్డుల్లో అభ్యర్థులతో కలిసి ఇంటింటికి తిరిగారు. ఈ వార్డులకు సంబంధించి ఎన్నికల పరిశీలకులుగా ఎమ్మెల్యేను నియమించిన సంగతి తెలిసిందే.



28వ వార్డులో కరపత్రాన్ని అందిస్తున్న బీజేపీ నాయకులు

అర్హులకు పథకాలు అందేలా చూడండి

● బీజేపీ పట్టణ అధ్యక్షుడు సత్తి అచ్చిరెడ్డి

దాసన్నపేట: అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూడాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సత్తి అచ్చిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 28వ వార్డు ఉడాకాలనీలోని కామాక్షినగర్‌లో మహిళామోర్చా పట్టణ అధ్యక్షురాలు గండికోట శాంతి ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అచ్చిరెడ్డి మాట్లాడుతూ వార్డులో పారిశుధ్య పనులు మెరుగుపడాల్సివుందన్నారు. ఎక్కడ చూసినా మట్టి రోడ్లే కనిపిస్తున్నారని తెలిపారు. ఇక్కడి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ ప్రతినిధులు సుధీర్, రాంబాబు, కూర్మారావు, విశ్వనాధం, ప్రమీళారాణి, సుభద్రాదేవి, దేవి, పైడితల్లి పాల్గొన్నారు.


పోసర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వివేక్‌యాదవ్

మిలియన్ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్:సీపీఎస్ ఉద్యోగులు చేపట్టిన మిలియన్ మార్చ్ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను కలెక్టరు వివేక్‌యాదవ్ ఆవిష్కరించారు. జేఏసీ జిల్లా చైర్మన్ పేడాడ జనార్ధనరావు ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరు చాంబర్‌లో ఈపోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు చేయాలంటూ సెప్టెంబరు 1న విజయవాడలో మిలియన్ మార్చ్ నిర్వ హిస్తున్నామని తెలిపారు.

సమాచారం

నేడు ప్రైవేట్ పాఠశాలల బంద్

రింగురోడ్డు: కర్నూలులో పాఠశాల కరస్పాండెంట్‌పై ఎస్ఎఫ్ఐ విద్యార్థులు దాడికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ప్రైవేటు విద్యాసంస్థలు బంద్ చేస్తున్నట్టు ప్రైవేటు స్కూల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.ఆర్.కృష్ణాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులపై దాడి చేయడం దారుణమన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి దాడులకు పాల్పడకుండా కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వరకు ప్రైవేట్ పాఠశాల సిబ్బందితో ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరుకావాలని ఆయన కోరారు.

గ్రంథాలయానికి స్థలం కేటాయించండి

కలెక్టరేట్:గోపినాధం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న గ్రంథాలయానికి జిల్లా కేంద్రంలో నాలుగు సెంట్లు స్థలం కేటాయించాలని సంస్థ అధ్యక్షుడు ఒక ప్రకటనలో అధికారులను కోరారు. స్థలం కేటాయిస్తే భవన నిర్మాణం చేపట్టి విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచుతామన్నారు. అధికారులు సాయమందిస్తే ముమ్మందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మట్టి వినాయకా... నమామ్యహం!

- నగరంలో ఉచితంగా గణనాథుల ప్రతిమల పంపిణీ
- ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలు వాడొద్దని విస్తృత ప్రచారం


మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

దాసన్నపేట:గణపతి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలకు పూజలు చేసి పర్యావరణాన్ని కాపాడాలని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగులు, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో చేసిన విగ్రహాల వల్ల వాతావరణం కలుషితం అవుతుందన్నారు. చర్మవ్యాధులు వ్యాప్తి చెందుతాయని, వాటిని చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల జలచరాలు మృత్యువాత పడుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పి.రామారావు, వి.సత్యనారాయణమూర్తి, ఎం.కె.ఎస్.గుప్త, పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో...

బీజేపీ ఎస్సీ మోర్చా పట్టణ శాఖ అధ్యక్షుడు పాండ్రంకి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద బుధవారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని కోరారు. కార్యక్రమంలో షకీల్, నీలాపుదేవి, కౌతల శంకర్ పాల్గొన్నారు.

దుప్పాడలో..

విజయనగరం రూరల్:దుప్పాడ గ్రామంలో మట్టి వినాయక విగ్రహాలను టీడీపీ నాయకులు మేకా కాశీ, సైలాడ పెంటయ్యలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాల వల్ల పర్యావరణం కలుషితమవుతుందని తెలిపారు. ఈ ఏడాది 1200 విగ్రహాలను పంపిణీ చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వెయ్యి మట్టి విగ్రహాల పంపిణీ

రింగురోడ్డు:వినాయకచవితిని పురస్కరించుకుని ఆదిత్య ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో విద్యార్థులు 1000 మట్టి విగ్రహాలను పాఠశాల కరస్పాండెంట్ ఉమానాయుడు, ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నివారణకు మట్టి వినాయక ప్రతిమలు వాడాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో చేసిన విగ్రహాలతో కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. మట్టి వినాయకులను పూజించాలని తల్లిదండ్రులతో పాటు చుట్టుపక్కల ఉన్నవారికి తెలియజేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఉమానాయుడు సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ ఇంచార్జు బి.కళ్యాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.




కోట జంక్షన్, దుప్పాడలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న బీజేపీ, టీడీపీ నాయకులు, ఆదిత్య పాఠశాలలో విద్యార్థులకు విగ్రహాలు అందిస్తున్న కరస్పాండెంట్


ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న నారాయణరావు

తపాలాశాఖను ప్రైవేటీకరించొద్దు

- సంఘ నాయకుడు నారాయణరావు
- కార్యాలయం ఎదుట ఉద్యోగుల ధర్నా

విజయనగరం రూరల్: కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అఖిలభారత తపాలా ఉద్యోగాల సంఘం విజయనగరం డివిజన్ యూనియన్ నాయకుడు కంది నారాయణరావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోస్టల్ కార్యాలయం ఎదురుగా ఎంటీఎస్, జీడీఎస్ ఉద్యోగులు ఒక్క రోజు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ తపాలాశాఖలో అన్ని విభాగాల్లోను ఖాళీగా ఉన్న 60వేల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. లక్ష్యాల పేరిట ఉద్యోగులను వేధించడం ఆపాలని, పాత పింఛను విధానాన్ని కొనసాగించాలని, వారానికి ఐదురోజులు మాత్రమే పనిదినాలు కల్పించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తపాలాశాఖ సూపరింటెండెంట్‌కు అందించారు. డిమాండ్లు నెరవేర్చకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ధర్నాలో యూనియన్ నాయకులు పప్పుల శ్రీను, పి.నారాయణ, జి.తాతినాయుడు, బి.ప్రసాద్, ఎ.పెంటపాపయ్యలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయండి

- వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్


మాట్లాడుతున్న ఉద్యోగుల సంఘ నాయకుడు ప్రసాద్

రింగురోడ్డు: ఏళ్ల తరబడి విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను తెలంగాణా తరహాలో రెగ్యులర్ చేయాలని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. ఇందుకు కార్మిక సంఘాలు ఐక్యంగా ప్రభుత్వంపై వత్తిడి తేవాలని కోరారు. బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారని తెలిపారు. విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు కార్మికులను వేరే విధులకు వాడుకోవడం తగదని తెలిపారు. ప్రమాదాల నివారణకు సంస్థ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. కనీస వేతనాలు సైతం ఇవ్వకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు వి.గోవిందరావు, కార్యదర్శి రామకృష్ణ, కన్వీనర్ సురేష్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

శిశుగృహను శుభ్రంగా ఉంచాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు శ్రీవాణి


శిశుగృహను సందర్శించిన మహిళా కమిషన్ సభ్యురాలు

విజయనగరం రూరల్: జిల్లాకేంద్రంలోని రెవెన్యూ కాలనీలో స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కొయ్యాన శ్రీవాణి బుధవారం సందర్శించారు. కార్యాలయంతో పాటు రికార్డులు, చిన్నారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. చిన్నారులతో మాట్లాడి భోజన, వసతి, ఆరోగ్యం తదితర సేవలపై అడిగి తెలుసుకున్నారు. శిశుగృహను శుభ్రంగా ఉంచాలని, పిల్లలకు సరైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులు దైవంతో సమానమని చెప్పారు. ఇక్కడ అందిస్తున్న సేవలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట డీసీపీయూ జిల్లా మేనేజర్ బీహెచ్ లక్ష్మి, శిశుగృహ సామాజిక కార్యకర్త శ్రీధర్, డీసీపీయు పీవో ఎస్.చిట్టిబాబు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు: సీఐ

విజయనగరం క్రైం: టూటౌన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ నర్సింహమూర్తి హెచ్చరించారు. బుధవారం టూటౌన్ పరిధిలోని గాజులరేగ రాళ్లమాలపల్లిలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన నిడదాపు సత్యవతిని అరెస్టు చేశారు. ఆమె నుంచి 300గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈసందర్భంగా సీఐ నర్సింహమూర్తి మాట్లాడుతూ టూటౌన్ పరిధిలో ఖైనీలు, గుట్కాలు, గంజాయి తదితర మాదక ద్రవ్యాలు విక్రయించినా, బెల్టుషాపులు నిర్వహించినా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. ఎవరైనా అనుమానాస్పందన కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేశామని చెప్పారు. వాహనచోదకులు తప్పనిసరిగా ధ్రువపత్రాలు కలిగివుండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైల్‌శిక్ష తప్పదని హెచ్చరించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ప్రతిఒక్కరు లాక్డ్‌హౌస్ మానటరింగ్ సిస్టమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సిస్టమ్‌పై రెండో పట్టణ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సీఐ నర్సింహమూర్తి తెలిపారు.